తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

మే 2021..... వెల రూ. 5/-



## తిరుపతి
## శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం
## 2021 మే 18 నుండి 26 వరకు



# తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం

**2021 మే 18 నుండి 26 వరకు**

**18-05-2021 మంగళవారం**

పగలు: ధ్వజారోహణం - రాత్రి: పెద్దశేషవాహనం.

**19-05-2021 బుధవారం**

పగలు: చిన్నశేషవాహనం - రాత్రి: హంసవాహనం.

**20-05-2021 గురువారం**

పగలు: సింహవాహనం - రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**21-05-2021 శుక్రవారం**

పగలు: కల్పవృక్షవాహనం - రాత్రి: సర్వభూపాలవాహనం.

**22-05-2021 శనివారం**

పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం - రాత్రి: గరుడవాహనం.

**23-05-2021 ఆదివారం**

పగలు: హనుమద్వాహనం - రాత్రి: గజవాహనం.

**24-05-2021 సోమవారం**


పగలు: సూర్యప్రభవాహనం - రాత్రి: చంద్రప్రభవాహనం.

**25-05-2021 మంగళవారం**

పగలు: రథోత్సవం - రాత్రి: అశ్వవాహనం.

**26-05-2021 బుధవారం**

పగలు: చక్రస్నానం - రాత్రి: ధ్వజావరోహణం.



## గీతాశ్లోకార్థసారం

**శ్లో :** యోత్స్యమానానవేక్షేఽ హం య ఏతేఽ త్ర సమాగతాః ।
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధే ర్యుద్ధే ప్రియచికీర్షవః ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 23)

**ప్రతిపదార్థం:** దుర్బుద్ధేః= దుష్టబుద్ధిగల; ధార్తరాష్ట్రస్య= దుర్యోధనునకు; యుద్ధే= యుద్ధమునందు; ప్రియచికీర్షవః= ప్రియము చేయగోరినవారై; ఏతే= ఏ వీలు; అత్ర= ఇక్కడ; సమాగతాః= చేరియున్నారో; (తాన్=అ) యోత్స్యమానాన్= యుద్ధము చేయ బోవుచున్నవారిని; అహమ్= నేను; అవేక్షే= చూచెదను.

**భావం:** దుష్టబుద్ధిగల దుర్యోధనునకు యుద్ధమున ప్రియమొనగూర్ప నెంచి ఇచట చేరియున్నట్టి ఈ యోధులను నేను చూచెదను.

## కుమ్మరించే రాజసమే గోవిందరాజు


కొమ్మలాలా ఎంతవాడె గోవిందరాజు
కుమ్మరించీ రాజసమే గోవిందరాజు ॥

ఉలిపచ్చి నవ్వులతో ఒత్తిగిలి పవళించి
కొలువు సేయించుకొనీ గోవిందరాజు
జలజాక్షు లిద్దరును సరిపాదా లొత్తగాను
కొలదిమీర మెచ్చేని గోవిందరాజు ॥

అదె నాభికమలాన అజుని పుట్టించి తాను
కొదలేక వున్నవాడు గోవిందరాజు
చెదరక తన వద్ద సేవ సేసే సతులకు
గుదిగుచ్చీ వలపులు గోవిందరాజు ॥

ఒప్పగా వామకరము ఒగిచాచి, వలకేల
కొప్ప కడునెత్తినాడు గోవిందరాజు
ఇప్పుడు శ్రీ వేంకటాద్రి నిరవై శంఖుచక్రాలు
కుప్పె కటారము పట్టె గోవిందరాజు ॥

(సంపుటం- 7, సంకీర్తన - 470)





*అన్నమయ్య దృష్టిలో అన్నీ విష్ణుఅంశాలే! అంతా హరిమయమే! అందరూ నారాయణ స్వరూపులే! ఏ కొండయినా తిరుమలయే! ఎన్ని పాడినా ఏడుకొండలవానిని ఉద్దేశించే! అందుకే కొండ దిగువున ఉన్న శ్రీగోవిందరాజస్వామివారిని వర్ణిస్తున్నాడు. స్త్రీలనందర్నీ పిలిచి రాజసాలు ఒలికించే శ్రీగోవిందరాజస్వామి గొప్పతనాన్ని వివరిస్తున్నాడు- అంతవాడో, ఇంతవాడో చెప్పలేనంత ఎంత మహానుభావుడో ఆస్వామి అని సంకీర్తించాడు.*





# శ్రీవేంకటేశ్వర సర్వ శ్రేయస్సు ట్రస్టు

**"మానవసేవయే మాధవసేవ"- అనే లక్ష్యంతో తి.తి.దేవస్థానములవారు వివిధ సామాజిక సంక్షేమకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనాథ బాలబాలికలకు చేయూతనివ్వాలనే సంకల్పంతో 1943వ సం॥లో శ్రీవేంకటేశ్వర బాలమందిర్(తిరుపతి) ట్రస్టును స్థాపించారు. ఈ శ్రీవేంకటేశ్వర బాలమందిరంట్రస్టు ప్రస్తుతం శ్రీవేంకటేశ్వర జలనిధిపథకం, కల్యాణమస్తుట్రస్టు, శ్రీవేంకటేశ్వర సమాచార సాంకేతికట్రస్టులను కలుపుకుని 'శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు'గా రూపొందించడమైనది.**

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు లక్ష్యాలు




01) అనాథలైన బాలబాలికలు, వృద్ధులు, నిరాశ్రయులు, అభాగ్యులు, నిరుపేద బలహీనవర్గాలవారిఅభివృద్ధి, సంరక్షణ, సంక్షేమాలకోసం ధర్మశాలలు, వసతిగృహాల ఏర్పాటు.

అనాథలకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం;

02) దివ్యాంగులకు, మానసికరోగులకు తగు వైద్యసదుపాయాలు కల్పించి, వారిజీవితప్రమాణాలను మెరుగుపరచడం. ఈ లక్ష్యంలో కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలను పాటించక అందరినీ సమానంగా స్వీకరించడం.

03) వరదలు, కరవువంటి ప్రకృతివిపత్తులసమయాల్లో అగ్ని ప్రమాదాలవంటి అవాంఛనీయసంఘటనలు జరిగినపుడు సత్వరసహాయచర్యలు గావించడం.

04) వినికిడిలోపం, మాటలురానిశిశువులకు, ఈ లోపాలతో ఎదిగిన పిల్లలకు పునరావాసకేంద్రాల్ని ఏర్పాటుచేయడం.

05) గ్రామాలలో పై లోపాలతో ఉన్న బాలబాలికలకు అవసరమైన పరికరాలను అందజేయడంతోపాటు- వారిని విద్యావంతుల్ని చేయడం.

06) సమాజంలో కనీస అవసరమైన త్రాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచడం. తిరుమల పంచాయతి, తిరుపతి కార్పొరేషన్‌కు అవసరమైన నీటివనరులఏర్పాటుకై ఆనకట్టలు, తొట్టెలు ఏర్పాటుచేయడం. నీటిపొదుపుకై అవసరమైన చర్యలు తీసుకోవడం.

07) శ్రేయస్కరమైన వివాహకార్యక్రమాలద్వారా వధూవరులు గౌరవాభిమానాలతో, ఉన్నతకుటుంబజీవితంతో ప్రశాంతంగా ఉండేందుకై కల్యాణమస్తు కార్యక్రమం.

08) పుస్తకాలతోపాటు, ఇంటర్‌నెట్‌వంటి ఆధునికసాంకేతిక సదుపాయాలతో మనదేశ చారిత్రక, సాంస్కృతికవారసత్వ సంపదను భవిష్యత్తరాలకు అందజేయడం.

09) సామాజిక క్రమశిక్షణ, నైతికవిలువల్ని పెంపొందిస్తూ యువ తరంలో ఆత్మవిశ్వాసం కలిగించటం.

10) పైన పేర్కొన్న ఆశయాలసాధనకు కృషిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సహకారమందించడం.

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టుకు విరాళాలు ఇలా....

**01) ఈ పథకంకోసం కనీస విరాళం రూ.1000/- గా నిర్ణయించబడింది.**

**02) రూ.1000/- కంటే తక్కువవిరాళం శ్రీవారి హుండీఖాతాలో జమ చేయబడుతుంది. ఈ విరాళాలన్నీ కూడా ఒకే జాతీయబ్యాంకులో డిపాజిట్ చేయబడతాయి, వాటిమీదవచ్చే వడ్డీ ఈ పథకంకోసం వినియోగింపబడుతుంది. దాతలు తమ విరాళాలను 'ది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు, తి.తి.దే.,తిరుపతి' వారి పేరిట ఏదైనా షెడ్యూల్‌బ్యాంకుమీద తీసిన చెక్కు/ డిమాండ్‌డ్రాఫ్ట్‌ద్వారా 'చీఫ్ అకౌంట్స్ ఆఫీసరు, తి.తి.దే., తిరుపతి-517501' వారికి పంపవచ్చు.**

**ఇతర వివరాలకు 0877-2264258ను సంప్రదించగలరు.**

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 మే, 2021 సంచిక : 12



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకులు
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు

సప్తగిరి మాస పత్రిక

0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| ఈ అవతారంలో ఉన్నంత బాధ... | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 07 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్ | 11 |
| ప్రహ్లాదవరద! | బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు | 14 |
| తిరుమల సమయాచారములు | డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 17 |
| మాధవమాసం | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 18 |
| పతంజలి మహర్షి | డా॥ కప్పగంతు రామకృష్ణ | 20 |
| భక్తిపారిజాతం | డా॥ సంగీతం కేశవులు | 22 |
| వర్ణించడానికి... వేయికన్నులు చాలవు!! | ఆచార్య కోలవెన్ను మలయవాసిని | 24 |
| ఆలుమగలు హాయిగా ఉండాలంటే.. | డా॥ మేడికుర్తి ఓబులేశు | 26 |
| వాగ్గేయకారులు కీర్తించిన తిరుపతి గంగమ్మ | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| శ్రీమద్భగవద్గీత | శ్రీ కుప్పా విశ్వనాథశాస్త్రి | 34 |
| భక్తసులభుడు పెంచలకోన నరసింహుడు | శ్రీ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 35 |
| స్వామిని చూడాల్సింది కళ్లతో కాదు... | శ్రీ దేవరకొండ శ్రీనివాస విజయప్రకాశ్ | 38 |
| ఆస్వాదించేవారికి ఆస్వాదించినంత!! | శ్రీ వెంకట్ గరికపాటి | 39 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 40 |
| నిత్యమై.. నిఖిలమై నిలిచి ఉంటాయి | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 41 |
| ఈ తిథికి ఎన్ని విశేషాలో...! | శ్రీమతి జానపాటి మనస్విని | 42 |
| కూర్చుని మాట్లాడుకుంటే సరిపోతుంది కదా! | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 44 |
| 'కరోనా'ను నివారిద్దాం! | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 45 |
| నాన్నా..! వేదం గురించి చెప్పవూ..? | డా॥ కుప్పా వేంకటకృష్ణమూర్తి | 46 |
| పేదపౌరాణికుడు | శ్రీ సంగనభట్ల చిన్న రామకిష్టయ్య | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య, నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| ఈ నిజం తెలుసుకో! తెలివిగా మసలుకో! | ఆచార్య పి.ఎల్.శ్రీనివాస రెడ్డి | 51 |
| జీవితం సార్థకం కావాలంటే..! (చిత్రకథ) | కథ & బొమ్మలు : శ్రీ తుంబలి శివాజీ | 52 |

ముఖచిత్రం : శ్రీ గోవిందరాజస్వామివారు (తిరుపతి)
వెనుక చిత్రం : వినరో భాగ్యము విష్ణుకథ..!!

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# వినా వేంకటేశం న నాథో న నాథః

మనిషికి జీవితం అంటే ఏమిటో ఇప్పుడు బాగా అర్థమవుతోంది. కంటికి కనిపించలేనంత అతిచిన్నక్రిమి మొత్తం ప్రపంచాన్నే శాసిస్తోంది. ఇంకా చెప్పాలంటే మానవజాతికే మరణశాసనం రాస్తోంది. ఎవరూ ఊహించని ఉత్పాతం ఇది. మొత్తంగా ప్రపంచమంతా స్థాణువైపోతోంది. రక్తసంబంధాలనుకూడా అత్యంత కఠినంగా కాదనుకుని జీవన భాగస్వాములను, కన్నబిడ్డలనుకూడా బయటకు నెట్టేసేంతటి దుస్థితిలో ప్రస్తుత సమాజం ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగవలసిందేనా? ఇందుకు అంతం లేదా? మానవజాతికి మంచి రోజులు రావా? మళ్ళీ పూర్వవైభవం వికసించదా... అంటే మనిషిజీవితంలోకి వసంతం మళ్ళీ వస్తుంది.

అలా జరగాలంటే మనం ఒక్కసారి వెనక్కి తిరిగి చూడాలి. అధునాతనసాంకేతికపరిజ్ఞానమే అభివృద్ధి అనుకుంటూ మొత్తం విశ్వానికే పునాదిగా ఉన్న ప్రకృతిని పూర్తిగా విస్మరిస్తున్నాం. పురోగమనం రూపులో తిరోగమనానికి అక్కడే బీజం పడింది. మనందరికి అనుక్షణం వెన్నంటి ఉండేందుకు శ్రీమన్నారాయణుడు తనకు మరోరూపంగా ప్రకృతిని మనకు అందించాడు. అందుకే ప్రకృతి పరమాత్మ స్వరూపమైంది. అటువంటి భగవత్స్వరూపమైన ప్రకృతిని ఆశ్రయించాలే కానీ ఆక్రమించకూడదు.

జరిగిందేదో జరిగింది. బాధపడుతూ కూర్చుంటే ఫలితం దక్కదు. మన కర్తవ్యాన్ని గుర్తించాలి. ఇప్పటికైనా కళ్ళు తెరవాలి. సనాతనసంప్రదాయాలు, ఆచారాలే ఇప్పటి కరోనా రక్కసి పీచమణిచే శక్తిమంతమైన ఆయుధాలని ప్రపంచమంతా అంగీకరిస్తోంది. అందుకే మన వారసత్వసంపదైన ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేయాలి. వీటిఅంతరాత్మ అయిన ఆధ్యాత్మికచింతనను మరింతగా వృద్ధి చేసుకోవాలి. పరమాత్మపాదాలను ఆశ్రయించాలి. తనదివ్యకరుణాకృపాకటాక్షవీక్షణాలతో మనందరి కష్టాలు తొలగించాలని ఆ తిరుమలగిరి సార్వభౌముని పాదాలు పట్టుకుని శరణు వేడాలి.

శ్రీవేంకటేశుడు కరుణాసముద్రుడు. స్వామీ! అంటూ ఆర్తిగా పిలిస్తే- ఏమీ? అంటూ వెంటనే పలుకుతాడు. ఆపదమొక్కుల స్వామికి భక్తులను ఆదుకోవటం తప్ప మరొకటి తెలియదు. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీనివాసుని శ్రీచరణాలే మనకు శ్రీరామరక్ష!

ఈ క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం విశ్వమానవసంక్షేమ సంకల్పంతో అనేక కార్యక్రమాలకు శ్రీకారంచుట్టింది. సుందరకాండపారాయణం, విష్ణుసహస్రనామపారాయణం, విరాటపర్వపఠనం తదితరకార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ, భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింతగా జాగృతం చేస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం చేస్తున్న ఈ మహోన్నతమైన కార్యక్రమానికి అండగా మనందరం చేయి కలుపుదాం!

ఎవరికి వారుగా మన ఇళ్ళలోనే దైవికమైన శక్తిని పెంచుకునేందుకు శక్తివంచనలేకుండా స్తోత్రపారాయణలు చేద్దాం. మనం చేస్తున్న పారాయణాల ఫలితాలను శ్రీవారిపాదాలకు అర్పణ చేసి, ఈ లోకాన్ని కాపాడమని వేడుకుందాం. కోట్లాది గొంతుకలు ఇలా మనసుపెట్టి పిలిస్తే కొండలరాయడు పలుకుతాడు. ఆ స్వామి చల్లనిచూపుతో లోకాలన్నీ ఆయురారోగ్యాలతో చల్లగా ఉంటాయి.


*వినా వేంకటేశం న నాథో న నాథః, సదా వేంకటేశం స్మరామి స్మరామి।*
*హరే వేంకటేశ ప్రసీద ప్రసీద, ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ॥*

# ఈ అవతారంలో ఉన్నంత బాధ.. ఏ అవతారంలోనూ లేదు....!!

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

భగవంతుడు ఎంత ఆర్తిని పోగొట్టాలని అనుకుంటాడు అంటే– ఆర్తితో పిలిస్తే పరిగెత్తుకుని వచ్చి, తనని తాను ఇచ్చేసుకుంటాడు. వారికోరిక తీరిస్తే, నన్ను నేను ఇచ్చుకోవడం ఏమిటి అని కూడా ఆలోచించడు. పరమభక్తితో భగవంతుణ్ణి సేవించిన వారికికోరిక ఉన్నదా? అవతలివారి అవగుణాన్ని చూడకుండా భక్తితో పిలిస్తే పలికే లక్షణ మున్న దయాస్వరూపుడు.

స్వామి ధర్మసంస్థాపనార్థం ఒకప్పుడు కూర్మావతార స్వీకారం చేశాడు. కూర్మం అంటే అమరకోశం అనేకమైన అర్థాలతో వ్యాఖ్యానం చేసింది. కచ్ఛభాగంతో నీటిని తాకుతుంది కాబట్టి, కదులుతున్నప్పుడు నీటిని కలుషితం చేస్తుంది కాబట్టి కచ్ఛపము అని పేరు. అనేక కారణాలచేత తాబేటికి ఆ పేర్లు వచ్చాయి. కఠిన మైన డిప్ప కలిగి ఉంటుంది. పరమాత్మ అటువంటి తాబేటిరూపం పొందాడు.



లక్ష్మీదేవి అనుగ్రహం లేని కారణంగా దేవతలు ఎన్నిసార్లు యుద్ధానికి వెళ్ళినా రాక్షసుల చేతిలో ఓడిపోతున్నారు. దుర్వాసమహర్షి వాక్కుచేత ఐశ్వర్యం పోయింది. దేవేంద్రుణ్ణి ఆవరించిన మదమూ తొలగిపోయింది.


ఐశ్వర్యం తిరిగిరాదు అన్న భయంవల్ల ఇంద్రునికి కలిగిన మదం పోయింది. అసలు బతకనిస్తారా? కనపడితే బలి చక్రవర్తి చంపేస్తాడేమో? అన్న భయం పెరిగి పరమేశ్వరుడు జ్ఞాపకం వచ్చాడు. దేవతలు అందరూ చతుర్ముఖబ్రహ్మనూ, పరమశివుణ్ణి తీసుకుని, రక్షకత్వం వహించే శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్లి, ఆయన్ను స్తోత్రంచేసి, రక్షణకోరారు.

"ఇంతకు పూర్వం నేను ఏది పొంది ఉన్నానో అది నా ప్రవర్తనచేతనే పోగొట్టుకున్నా, ఇప్పుడు మారాను కనుక మళ్లీ నన్ను అనుగ్రహించు. నువ్వే జోక్యం చేసుకుని కాపాడగలవు. అనుగ్రహమే రక్షణ. రక్షించవలసింది" అని ప్రార్థన చేశాడు.

మహావిష్ణువు విని, రెండుమాటలు చెప్పాడు. "కాలం అని ఒకటి ఉన్నది. అది కలసి రానప్పుడు నేర్చుకోవలసింది ఒకటి ఉన్నది– సహనం" అని, చాలా గొప్పమాట చెప్పాడు.

కలసిరానప్పుడు మనిషి నేర్చుకోవలసింది సహనమే దానికి జవాబు. ఓర్పుతో ఉండడమే! కాలం ఈశ్వరస్వరూపమే! అది అనుకూలంగా లేదు కనక సహనం వహించండి. సహనం అంటే కనపడితే చంపేస్తాడేమో అని కాకుండా ఆ రాక్షసులతో

మీకు కాలం కలిసి వచ్చేవరకు ప్రయత్న పూర్వకంగా స్నేహం చెయ్యండి. ఇవ్వాళ వినయంతో ప్రార్థన చేశారని వెంటనే అనుగ్రహించడం ఉండదు. బుద్ధి బాగా స్థిరీకరింపబడింది అన్న నిర్ణయానికి రావాలి. అందుకని రాక్షసులతో చెలిమి చేసి తిరగండి. యుద్ధంచేస్తే రాక్షసుల చేతిలో మరణిస్తారని బెంగపెట్టుకుని ఉన్నారు. మీ బెంగ తొలగడానికి ఒక మార్గం చెపుతాను. అందరూ వెళ్ళి పాలసముద్రాన్ని చిలకండి, అమృతోత్పాదనం అవుతుంది. ఆ అమృతం త్రాగితే దేవతలకు వార్ధక్యంకానీ, మృత్యువుకానీ, భయంకానీ ఉండవు. మీరు రాక్షసులను గెలువగలుగుతారు. అమృతోత్పాదన యత్నం చెయ్యండి. స్వర్గలక్ష్మి అంతా వెళ్ళి సముద్రంలో పడిపోయి ఉన్నది. ఆ లక్ష్మి పైకిరావాలంటే పాలసముద్రాన్ని చిలకాలి. అందుకొరకు కవ్వంగా మంధరపర్వతం పదార్థంగా ఉపయోగపడుతుంది. దానిని తవ్వి పైకి ఎత్తి పట్టుకోవాలి. అందుకొరకు కావలసిన సాధనసంపత్తులు మీదగ్గర ఉన్నవి పనికిరావు. దేవతలశిల్పిఅయిన త్వష్టను ఆశ్రయించండి.



**శ్రీకూర్మ గాయత్రి**

ఓం లోకాధ్యక్షాయ విద్మహే
ధరాధ్యక్షాయ ధీమహి।
తన్నః కూర్మః ప్రచోదయాత్॥

ఆ త్వష్ట పదునైన తవ్వుగోళ్ళను సిద్ధం చేసి ఇస్తాడు. వాటితో భూమిని తవ్వి, రోకళ్ళు భూమిలోకి దింపి పైకి ఎత్తితే దానిమూలం కదలుతుంది. ఆ పర్వతం కింద పడకుండా దేవతలు, రాక్షసులు తమతమ బలాలను చెప్పుకుని జాగ్రత్తగా ఎత్తి పట్టుకుని, పాలసముద్రం దగ్గరకు తీసుకుని వెళ్ళి, సముద్రంలో దింపి చిలికితే, అందులోనుండి అమృతం ఉత్పాదనమౌతుంది. ముందు హాలాహలం వస్తుంది. జాగ్రత్తగా ఉండండి. అందులోనుండి లక్ష్మి, కామధేనువు, కల్పవృక్షం, ఇంతకు పూర్వం దుర్వాసోమహర్షి శాపకారణంచేత స్వర్గంలో దేవేంద్రునియొక్క అంతర్ధానమైన సమస్తభోగాలకూ కారణమైన సాధనసంపత్తులన్నీ వచ్చి, ఇంద్రుడికి ఐశ్వర్యం కలుగుతుంది. పాలసముద్రాన్ని చిలకండి. మీ ఆశయం ఫలిస్తుంది అని చెప్పారు. వెంటనే వెళ్ళి దేవతలు రాక్షసులతో స్నేహం చేశారు. వాళ్ళు కనపడగానే రాక్షసులు చంపేస్తామంటే బలిచక్రవర్తి వద్దని చెప్పాడు. అతని మాటమేరకు అందరూ వెళ్లి రోకళ్లు, గునపాలు విప్పి, పర్వతాన్ని చేతులతో ఊపారు. అది కదిలితే దాని కిందకి చేతులు దింపి తమతమ బలాలు చెప్పుకుని మంథరపర్వతాన్ని పైకి ఎత్తారు. జాగ్రత్తగా ఆ పర్వతాన్ని పట్టుకుని అడుగులో అడుగు వేసుకుంటూ సముద్రం దగ్గరకు తీసుకుని వస్తున్నారు. ఎంత జాగ్రత్తగా తెస్తున్నా చాలా పెద్దదైన పర్వతం ఒక పక్కకు ఒరిగితే ఆపలేకపోయారు.

అప్పుడు శ్రీమహావిష్ణువు దానిని ఒక హేలగా పైకి ఎత్తి, ఒక బొంగరాన్ని తిప్పినట్లుగా చేత్తో తిప్పి, ఎత్తి పట్టుకుని గరుత్మంతునిమూపున పెట్టి, "ఓ గరుత్మంతా! దీనిని తీసుకుని వెళ్లి కవ్వంగా క్షీరసాగరంలో దింపు" మని చెప్పారు. "నేను చెపితే మీరు చేసే పని కాదు. నేనూ మీదగ్గర ఉంటాను. మనమందరం క్షీరసాగరమథనం చేద్దాం" అని శ్రీమహావిష్ణువు దేవతలందరికీ అధ్యక్షత వహించాడు.


క్షీరసాగరమథనం చెయ్యడానికి మంథర పర్వతాన్ని పాలసముద్రంలో దింపినప్పుడు, పట్టుకుని తిప్పడానికి ఒక తాడు కావాలి. లౌకికమైన తాడు పనికిరాదు. వాసుకి అనే సర్పరాజును పిలిస్తే వచ్చాడు. వాసుకిని చుట్టి తలవైపు దేవతలు, తోకవైపు రాక్షసులు పట్టుకున్నారు. చిలకడం మొదలుపెట్టాలి. మధ్యలో ఎవరో ఒకరు ఉంటారు. అహంకారం అంత తొందరగా పోదు. చిలకడంకొరకు దింపుతుండగా, "తలవైపు దేవతలు పట్టుకోవడం ఏమిటి, తోక మేము పట్టుకోవడం ఏమిటి? తోక అంటే కింద భాగం కదా. మా మర్యాద ఏమైపోయినట్లు? మేము తల భాగమే పట్టుకుంటాం" అన్నారు. అహంకారంచేత అసలు కార్యం మొదలుపెట్టింది లేదు, అల్లరి ప్రారంభం! మనిషి దానిని గెలవగలిగితే ప్రశాంతంగా ఉంటాడు. అది గెలవలేకపోతే ఎక్కడకు వెళ్లినా ప్రశాంతత ఉండదు. శ్రీ మహావిష్ణువు "దానిదేముంది? ఎక్కడ పట్టుకున్నా త్రిప్పడం ప్రధానం పట్టుకోండి" అన్నాడు.

మంథరపర్వతం పాలసముద్రంలోకి దింపినప్పుడు దానిని భరించగలిగిన పదార్థం ఒకటి కావాలి. నీటిలోపల ఉండి వహించకలిగినదై ఉండే ఆ పదార్థంగా భగవానుడే మారిపోయాడు. అంత పెద్దమంథరపర్వతాన్ని తీసుకువచ్చి వీపుమీద పెట్టినాకూడా శరీరానికి ఒరుసుకోకుండా ఉండాలి. పైన డిప్పకు ఇబ్బంది కలిగినా శరీరానికి ఇబ్బంది కలగని ప్రాణి ఒక్క తాబేలే. తాబేలు డిప్ప మీద ఎంత దెబ్బకొట్టినా దానికి ఏమీ కాదు. తిరగవేసి ఒక చిన్న దెబ్బకొట్టినా చచ్చి పోతుంది. మనః అంటే నాది అంటే డిప్ప పైకి ఉన్నట్లు. తిరగ వేస్తే నమః అంటే నాది కాదు. అంటే తాబేలు చచ్చిపోయినట్లు. మనసు పంచజ్ఞానేంద్రియాలతో పని చేస్తుంటుంది. నాలుగు కాళ్లు, ముఖం బయటపెట్టి తిరిగినంతసేపు మనః తిరగవేస్తే నాది కాదు భగవంతునిది. నాది అన్నంతసేపూ అహంకారం. కఠినమైన డిప్పను వహించగలిగినదై, తనకు దెబ్బ తగలక నీటిలో ఉండే ప్రాణి తాబేలు ఒక్కటే. అందువల్ల ఆయన కూర్మరూపం ధరించాడు.

మహాసుందరుడైన విష్ణువు దేవతలను రక్షించడంకోసం అత్యంతప్రేమ, దయ కలిగినవాడై, లక్షయోజనాలు కలిగిన పెద్ద తాబేలుగా మారిపోయాడు. దానిమీది డిప్ప బహుకఠినంగా ఉంది. దానిని బద్దలుకొట్టడం ఎవరికీ సాధ్యం కాదు. బ్రహ్మాండమంతటినీ పట్టి మింగేస్తుందేమో అన్నంత పెద్ద నోరు తెరుస్తూ ప్రపంచంలోని సమస్తజంతు రాశినంతటినీ మింగి లోపల పెట్టుకోగలిగిన పెద్ద కడుపుతోటి ఈ ప్రపంచం మీద ఇంకో ప్రపంచం వచ్చి పడినా మెల్లిగా కదిలే కాళ్ళు. మెల్లిగా నడవడానికి పేరు పొందిన ప్రాణులలో తాబేలు ఒకటి. అలా వెయ్యడానికి బలం కలిగిన కాళ్లు కలిగినదై, లోపలకూ బయటికి వెళుతున్న తుండంతో తామరపువ్వులవంటి కన్నులతో, సుందరమైన విష్ణువు పెద్దకూర్మమై సముద్రంలో పడుకుని "నా మీద మంథరపర్వతం ఉంచండి" అన్నాడు. ఆయన వీపుమీద పర్వతం పెట్టి తిప్పు తున్నప్పుడు ఆయనకు ఉన్నడిప్ప ఎంత ఒరుసుకుని పోయి ఉంటుంది! ఎంత ఖేదాన్ని పొంది ఉంటాడు. క్షీరసాగర మథనంలో శ్రీమహావిష్ణువు పొందినంత ఖేదం, ఏ ఇతర అవతారాలలో ఆయన పొందలేదు. మనసుకు దిగులు కలిగించే రెండువిషయాలు కూర్మావతారంలో జరిగాయి. అయినా ఆయన దయకు ప్రతీక, కదలలేదు. తాబేటిరూపం విడిచి పెట్టిన తరవాత, క్షీరసాగరమథనం జరిగినప్పుడు ఏ రూపంలో పడుకున్నారో, మంథరపర్వతాన్ని ఆయన డిప్పమీద పెట్టి తిప్పు తున్నప్పుడు, ఆయన తోక, ముఖం కదుపుతుంటే చిన్నది కాదు కనక సముద్రంలో ఉండే ఎన్నో ప్రాణులు చనిపోయాయి.

శ్రీమహావిష్ణువు అన్ని ప్రాణులు చనిపోవటానికి తాను తాబేటి రూపంలో మంథరపర్వతాన్ని వహించడమే కారణమని, తాను, చేసిన పాపమెలా పోతుందని పరమశివుణ్ణి ప్రార్థన చేసి అడిగాడు. శివుడు ప్రత్యక్షమై "బెంగ పెట్టుకోవద్దు. కాంచీ పురంలో నేను పరమశివస్వరూపంగా వెలసి ఉన్నాను. అక్కడకు వచ్చి నన్ను ఆరాధన చేసి పూజిస్తే, నువ్వు తాబేలుగా పడుకుని మంథరపర్వతం తిప్పినప్పుడు ప్రాణిసమూహానికి కలిగిన ఇబ్బంది వల్ల నీకు కలిగిన పాపంనుండి ఉపశమనం కలుగుతుంది." అని చెప్పాడు. కచ్ఛపేశ్వరదేవాలయం ఇప్పటికీ ఉంది. ఆ ఆలయంలోకి వెళ్ళి చూస్తే లోపల పెద్ద రాగిరేకు మీద తాబేలు పూజచేస్తున్నట్లుగా ఉన్న శివలింగం ఉంటుంది. ఆ రూపంలోనే వచ్చి అక్కడ శివలింగార్చన చేశారు.

కూర్మం అంటే తాబేలు. ప్రతి ఇంటిలో ఉండాలి. ప్రతి దేవాలయంలో తాబేలు ఉంటుంది.



పూర్వం ప్రతినూతిలో ఒక తాబేల్ని ఉంచేవారు. తాబేటి దర్శనం మంగళదర్శనం. ఇంట్లో కనీసం తాబేలు బొమ్మనయినా ఉంచుకుంటారు. ప్రయత్నపూర్వకంగా దానివంక చూస్తారు.

కూర్మాసనం వేసుకుని కూర్చుంటారు. అలా కూర్చుంటే ప్రత్యేకమైనలక్షణం ఏర్పడుతుంది. కోతిలా కదలిపోతున్న మనసును భక్తిపాశాలతో కట్టేయి అంటారు- ఆదిశంకరులు. భగవంతునియందు భక్తి అనే తాటిని చుట్టి, ఆయన స్మరణలతో చిలకాలి. ముందు హాలాహలం పుడుతుంది. గుళ్లోకి వెళ్లి బయటికి వచ్చేవరకు అందరూ భగవంతునిమీద మనసు పెట్టి ఉండరు. అక్కడ తప్ప అన్ని చోట్లా మనసు పెట్టి ఉంటారు. ఆ స్థితినుండి బయటికి రావాలి అంటే మనసు భగవంతుని యందు నిలబడి, దుర్గుణాలను తొలగతోసుకోగలగాలి. కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్యాలు ఆశ్రయించడంవలన మనసుకు అవన్నీ స్మరణలోకి వస్తుంటాయి. అవి బయటికి తొలగిపోయి భక్తియందు మనసు నిలబడాలి అంటే మన ప్రయత్నంతో అయిపోతుందన్న సాధన కాకుండా శ్రీమహావిష్ణువు ఆది కూర్మమై ఆధారంగా నిలబడాలి. భక్తి అన్న తాటితో మనసు అన్న మంథరపర్వతాన్ని ఆయనమీద పెట్టి, భగవంతునిస్మరణ అన్న చిలుకుడు చిలికితే, లోపలనుండి దుర్గుణాలు అన్నీ వెళ్లిపోయి అందులోనుంచి అమృతం వస్తుంది.

భగవంతునికథ అనే సుధాసముద్రంమీది కెరటాల మీద భగవత్ కథ వింటున్నప్పుడు తేలిపోతాడు. ఆ కథ విని ఆనందం పొందడమే పాలసముద్రం. 'వినడమనే గుణం కలిస్తే విన్న దానిని వెంటనే విడిచిపెట్టేసేటట్లుగా ప్రవర్తించకూడదు. ఇంకోదాని మీదకి దృష్టి వెళ్లకుండా ఏది విన్నామో దానినే లోపల మననం చేసుకోవాలి. అదే తోడుపెట్టడం అనగా దానిని దీనితో కలిపి నుంచోపెట్టడం. భాండమనగా శరీరం. అందులో తోడుపెడితే తోడుకుని 'గడ్డ' కడుతుంది. భగవంతుని రూప గుణ విభూతుల స్మరణలు నిలబడతాయి. దానిలోకి భగవంతుని నిరతిశయభక్తి అనే తాడు కట్టబడి మనసును దింపి సవరణలను చిలకాలి. అప్పుడు అందులోనుండి వెన్న పైకి వస్తుంది. ఆ వెన్నను నిరతిశయప్రీతి అంటారు. భగవంతుణ్ణి తప్ప ఇంకో దానిని చూడలేదు. ఆయనే అస్తమానం జ్ఞాపకం వస్తుంటాడు. అన్నిటిలో ఆయననే చూస్తుంటాడు.

దాంట్లో నుండి వచ్చేదే నెయ్యి. అమృతం అంటే మళ్లీ పుట్టవలసిన అవసరం లేని స్థితిని పొందుతారు.

మనసు కదలకుండా ఉండాలి అంటే ఆధారం ఉండాలి. మనం భగవంతునిపట్ల చేసిన భక్తికారణంగా శ్రీమహావిష్ణువే ఆదికూర్మమై, ఆధారమై మనసును నిలబెట్టి అమృతం లోపల నుండి పుట్టేటట్లు 'హాలాహలం తొలగిపోయేటట్లు చేస్తాడు.

క. మకర మొకటి రవి జొచ్చెను,
మకరము మతియొకటి ధనదు మాటునదాగెన్;
మకరాలయమున దిరిగెడు,
మకరంబులు కూర్మరాజు మఱువున కరిగెన్.

(భాగ.8-114)

భయం వేస్తే నీళ్లల్లో ఉన్న ప్రాణులు అన్నీ ఆదికూర్మం చాటుకి వెళ్లి దాక్కుంటాయి. ప్రశస్తి వహించిన కూర్మావతారం గురించి చెప్పినా, విన్నా, చదివినా వారికి గొప్ప ప్రయోజనం, బయట ఎన్నిటినైనా జయించవచ్చు. మనసును నిలబెట్టి ఉంచడం సాధ్యంకాదు. మనసు నేను చెప్పినట్లు ఉంటుందని అనలేరు. మనసు ఆగదు.

మనను పిలవగానే వచ్చి భగవంతునిపాదాలను స్మరించు అంటే ఆయన పాదాలయందు చేరదు. అందుకే శంకరులు షట్పదీ చేశారు. తుమ్మెద తామరపువ్వులోకి వెళ్ళి అణగిపోతుంది. భగవంతుని పాదారవిందములో పంచేంద్రియాలతో కూడుకున్న మనసు అనబడే ఆరుకాళ్లు కలిగిన షట్పది 'అణగిపోవాలి. ఆ పాదపంకజంలో వచ్చే మకరందాన్ని తుమ్మెదలా గ్రోలుతూ మత్తెక్కి పరవశించి ఉండి అణగిపోవాలి, అంటే అటువంటి ధ్యానస్థితిని పొంది మృత్యోర్మా అమృతం గమయ అని నడవడానికి ఆదికూర్మమే ఆధారం. రక్షణభారాన్ని వహించి గురుతత్వాన్ని ప్రకటింప చేశాడు.

పెద్దదేవాలయాలలో నీటిసరస్సు ఏర్పాటు చేసి తాబేళ్ళని ఉంచుతారు. తాబేటిదర్శనం చాలా గొప్పది ఎక్కడైనా కనపడితే నమస్కరిస్తారు. కూర్మయంత్రం అని ఒక ప్రత్యేకమైన యంత్రం వేస్తారు. కూర్మాసనం వేసుకుంటారు. ఎందుకు అనగా ఆ ఆదికూర్మం మీద కూర్చోకూడదు కనక కూర్మాసనం పీటమీద చెక్కించి కూర్చుని ధ్యానం చేస్తే, దానివలన మనసు ఏకాగ్రతను పొంది, పరమేశ్వరుణ్ణి చేరడానికి కావలసిన స్థిరీకరణశక్తిని పొందుతాడు. ఇన్ని లక్షణాలను ప్రకటింపచేసిన మహోత్కృష్టమైన అవతారం కూర్మావతారం!



కరోనా విషయంలో భయం వద్దు! అలాగని అలసత్వమూ వద్దు

# శ్రీమద్భగవద్గీత

6

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్,
94416 45995



## 6వ - అధ్యాయం (సారసంగ్రహం)

### ఆత్మసంయమ యోగం-అధ్యాయ నామౌచిత్యం

ఆత్మశబ్దం శరీరం, మనస్సు, బుద్ధి, పరమాత్మ, జీవాత్మ అనే అర్థాలలో వాడబడుతోంది. ఇక్కడ "ఆత్మ" అంటే మనస్సని అర్థం. "సంయమం" అంటే వశంలో ఉంచుకోవడం. మనస్సును నియమబద్ధంగా తన వశంలో ఉంచుకోవడమే ఆత్మ సంయమయోగం. ఈ అధ్యాయాన్నే "ధ్యానయోగ" మనే పేరుతో కూడా పిలుస్తారు. ఏ యోగానికైనా ఏకాగ్రత, ధ్యానం, ఇంద్రియనిగ్రహం అవసరం. జీవాత్మను పరమాత్మలో లయింప చెయ్యాలంటే గుణరాహిత్యం కల్గాలి. ఆ ఉపాయాలన్నీకూడా ఈ అధ్యాయంలో కృష్ణభగవానులు ఉపదేశించి ఉన్నారు.

సన్న్యాసానికి, యోగానికి భేదం లేదంటూనే, మనస్సం కల్పాలను విడిచిపెట్టినవాడే నిజమైన సన్న్యాసి, యోగి అంటూ..

యం సన్న్యాసమితి ప్రాహు ర్యోగం తం విద్ధి పాండవ ।
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన ॥ 2

ఈ శ్లోకంలో చెప్పారు. కర్మతో యోగారూఢుడు కావాలని యోగారూఢునికి కర్మనివృత్తే సాధనమని బోధించారు. కఠినమైన సాధన లేవీ ఇందులో లేవు. అన్నీ సులభసాధ్యమైనవే. మనోనిగ్రహం కల్గి ఉంటే చాలు అనే ఉపదేశం ఉంది కాబట్టే ఆత్మసంయమయోగమనే పేరు పెట్టటానికి కారణమై ఉంటుంది.

ఈ అధ్యాయంలో చాలా ముఖ్యమైన ధ్యానాభ్యాసం గూర్చి తెలియజేస్తూ..

యోగీ యుంజీత సతతమాత్మానం రహసి స్థితః।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః ॥ 10

అనే ఈ శ్లోకంలో భగవానుడు ఐదు నియమాలు తెలిపారు. అవి 1)ఏకాంతప్రదేశంలో ఉండటం 2)ఒంటరిగా ధ్యానించటం 3)ఇంద్రియనిగ్రహం కలిగి ఉండటం 4) ఆశలేని వాడై ఉండటం 5)ఇతరులనుండి ఏ వస్తువులను స్వీకరింప కుండటం.

అంతేగాకుండా యోగి ఎలా కూర్చోవాలో, ఎలా ఇంద్రియనిగ్రహం చేయాలో, ఏమిచేస్తే నిర్వాణశాంతి లభి స్తుందో వివరించడం జరిగింది. ఆహార, విహారాదుల్లో యోగి పాటించాల్సిన నియమాలు ఈ అధ్యాయంలో ఉన్నాయి. ఆత్మ లాభంకంటే మరొక గొప్పలాభం లేదని చెప్పబడింది. మనసును ఆత్మయందే నిల్పాలనీ, ఇంద్రియాలనుండి మరలించాలనీ, దానికి పట్టుదల, ప్రయత్నం అవసరమనీ, అలా చేసే యోగి ఉత్తమసుఖానికి నోచుకుంటాడని ఈ అధ్యాయంలో బోధించటం జరిగింది.

యోగశాస్త్రంలో ఏ యే అనుష్ఠానాలు చెప్పబడి ఉన్నాయో అవన్నీకూడా ఇందులో కనబడుతున్నాయి. అయితే అభ్యాసయోగం విస్తారంగా చెప్పబడి ఉంది. ఆత్మను పర మాత్మతో ఐక్యం చేసే యోగమవడంచేత దీనికి ఆత్మ సంయమ యోగం అనే పేరు కల్గింది. ఈ అధ్యాయపారాయణం వల్ల సమస్తదానాల ఫలితం కలిగి, విష్ణుసాయుజ్యం కలుగుతుంది.

- - - - -

### భగవంతు డంటున్నాడు

అర్జునా! కర్మఫలాన్ని కోరకుండా కర్మ నాచరించేవాడే సన్న్యాసి లేక యోగి. నిత్యకర్మలను మానినవాడు సన్న్యాసి లేక యోగికాజాలడు. ఈశ్వరుడే అన్నిటికీ కర్త. ఆయనే మనల్ని కాపాడుతాడన్న బుద్ధితో అహంకార, మమకారాలను వదలి నిష్కాముడై కర్మలను చేసేవాడే జ్ఞాని. ఇంద్రియాలను విషయ సుఖాలజోలికి పోనీక, సమస్తవాసనలను నిర్మూలించినవాడే

యోగారూఢుడు అనబడుతాడు. సాధకుడు ఆత్మలో మనసును నెలకొల్పేందుకు నిరంతరం ప్రయత్నించాలి. శాంతచిత్తుడై ప్రకృతిలో వచ్చే శీతోష్ణపరిణామాలను, సుఖదుఃఖాలను, మానావమానాలను మట్టిపెళ్లను, బంగారాన్ని, రాయిని సమంగా చూస్తూ అనుభవించగలవాడే యోగాగ్రేసరుడు (జ్ఞాని).

యోగికి జీవులంతా ఒకటే! సుహృత్తులపట్ల (ప్రత్యుప కారం కోరకుండా ఉపకారం చేసేవారు), మిత్రులపట్ల, శత్రు వులపట్ల, ఉదాసీనులపట్ల (శత్రుత్వమిత్రత్వాలు లేనివారు), మధ్యస్థులపట్ల (ఉభయుల శ్రేయస్సు కోరేవారు), ద్వేషింప తగినవారిపట్ల, బంధువులపట్ల, సాధువులపట్ల, పాపులపట్ల, సమభావన ఉండేవాడే యోగి. యోగికి ఎవరి విషయంలోనూ రాగంగానీ, ద్వేషం గానీ ఉండదు. వీరు ఆశలేనివారై రహస్య ప్రదేశంలో ఏకాంతంగా ఉండడానికే ఇష్టపడతారు.

"అర్జునా! ఇక ధ్యానం ఎలా చేయాలో వివరిస్తాను విను." ధ్యానం చేసేచోటు పరిశుభ్రంగా ఉండాలి. మిక్కిలి ఎత్తయిన చోట గానీ, మరీ తగ్గుగా ఉన్నచోటగానీ కూర్చోరాదు. దర్భాసనంపైన జింక చర్మం వేసి, దాని పైన వస్త్రాన్ని పరచు కొని, స్థిరంగా కూర్చొని, ధ్యానానికి ఉపక్రమించాలి. నడుము, మెడ, శిరస్సు నిటారుగా ఉండేటట్లు చూచుకోవాలి. మనసును ఏకాగ్రం చేసి సగం మూసిన కంటితో దృష్టిని నాసికాగ్రమందు నిలపాలి. ఇంద్రియవిషయాలపైకి మనసును పోనీక అరికట్టాలి. ఇతర కోరిక లేవీ లేనివాడై వ్యామోహాన్ని వదలి, మనసును తన అదుపులో ఉంచుకోవాలి. దిక్కులు చూడక, ఇతరచింతలు లేక, ప్రశాంతచిత్తంతో నిర్భరహృదయంతో ఆత్మయందు మనసును నిల్పి ధ్యానించుటే యోగం. అదే ఆత్మస్వరూపసాక్షా త్కారం!

అర్జునా! ధ్యానాభ్యాసి ఎక్కువగా తినకూడదు. అస లేమీ తినకుండా ఉపవాసాలతో కడుపు మాడ్చుకోకూడదు. ఎక్కువసేపు నిద్రపోకూడదు. నిద్రలేకుండా జాగరణం చేయకూడదు. ఆహార, విహార, నిద్రాదులందు మితంగా ఉంటూ మధ్యమమార్గాన్ని అవలంబించాలి. యోగి ధ్యానం చేసేటప్పుడు మనస్సును ఏకాగ్రంగా ఉంచుకోవాలి. గాలిలేనిచోట దీపం చలింపక స్థిరంగా ఎలా వెలుగుతుందో ఆలాగే మనసును ఇటునటు కదలనివ్వకుండా నిశ్చలంగా నిర్మలంగా ఉంచు కోవాలి. అప్పుడు యోగికి ధ్యానం చక్కగా కుదిరి పరమ శాంతినీ, ఆనందాన్నీ అనుభవిస్తాడు. ఆ అనుభవం రాగానే ఏ భౌతిక సుఖాలు, క్లేశాలు యోగిని చలింపనివ్వవు. మనస్సును ఆత్మయందే స్థిరంగా ఉంచి మెల్లమెల్లగా సాధన చేస్తూ అన్ని ఆత్మలు తనఆత్మజ్ఞానాకారమేనని గుర్తించగల్గుతాడు. తనలో తానే బ్రహ్మానందసుఖాన్ని పొందుతూ పాపరహితుడై జీవాత్మే పరమాత్మ అనే స్థితికి చేరుకుంటాడు. ఈ సిద్ధిని పొందిన వాడు అన్ని ప్రాణుల్లోను భగవంతుడు అంతర్యామిగా ఉన్నా డని గ్రహించి, ప్రాణికోటియందు తనఆత్మను, తనలో నిఖిల ప్రాణికోటినీ చూస్తాడు.

తన సుఖదుఃఖాలను ఇతరుల సుఖదుఃఖాలను సమంగా భావించేవాడు యోగులలో శ్రేష్ఠుడు.

**ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32**

ఈ విధంగా ధ్యానశీలుడు ఆత్మౌపమ్యస్థితిని అను భవిస్తాడు – అని శ్రీకృష్ణపరమాత్మ ధ్యానయోగాన్నిగూర్చి చెబుతుండగా అర్జునుడికి సందేహం కలిగి ఇలా ప్రశ్నించాడు.


## అర్జునుడు అడుగుతున్నాడు

కృష్ణా! మనోనిగ్రహాన్నిగూర్చి మీరు చాలా చక్కగా వివరించారు. కానీ ధ్యానంలో నా మనసు నిలకడగా ఉండదు. మహాచంచలంగా ఉంటున్నది. కదిలే గాలిని లాగి పట్టడం వలే నా ఈ మనసును అరికట్టడంకూడా కష్టతరంగా ఉంది అన్న ప్రశ్నకు కృష్ణపరమాత్మ ఇలా సమాధానమిస్తున్నారు.

"అర్జునా! నిజమే! నీ వన్నట్లు మనస్సును నిగ్రహించడం అంత తేలికైన పనికాదు. కష్టసాధ్యమే! అయినా అభ్యాసం చేయగాచేయగా లొంగదీయవచ్చు. అందుకు సాధన, వైరాగ్యాలు అవసరం." ఆ మాటవిన్న అర్జునుడు మరల శ్రీకృష్ణమూర్తిని ఇలా ప్రశ్నిస్తున్నాడు.

"కృష్ణా! శ్రద్ధతో, సాధనతో యోగసిద్ధిని పొందవచ్చునని అంటున్నావు. ఒకవేళ ఈ యోగాన్ని ప్రారంభించి, ఈ జన్మలో పూర్తిచేయకపోతే వానిగతి ఏమిటి? ఏ దశకు చేరుతాడు? భవిష్యత్తులో ఎట్టి జన్మసంభవిస్తుంది? ఈ అభ్యాసంలో ఒక వేళ మనస్సు చలించి మోహగ్రస్తం అవుతుందనుకుందాం.


టీకా తీసుకున్నాం కదా, ఇక మునుపటిలా ఎక్కడికైనా వెళ్లవచ్చని భావించకూడదు



# ఈ మాసం.. సూక్తి

– డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

**మనిషికి ముందుచూపు ఎంత అవసరమో తెలియచెప్పేసూక్తి**

వర్షార్థ మష్టౌ ప్రయతేత మాసాన్
నిశార్థ మర్థం దివసే యతేత ।
వార్ధక్యహేతో ర్వయసా నవేన
పరత్రహేతో రిహజన్మనాచ ॥

వర్షంలో బయటికి వెళ్ళటం కష్టం కనుక, వర్షాకాలానికి అవసరమైన వన్నీ మిగతా ఎనిమిదిమాసాల్లోనే సమకూర్చుకోవాలి. రాత్రివేళ చీకటి కనుక, రాత్రికి అవసరమైన వన్నీ పగటిపూటే పొందుపరచుకోవాలి. ముసలితనం మీద పడేసరికి శక్తి సన్నగిల్లిపోతుంది కనుక, వార్ధక్యంలో ప్రశాంతంగా ఉండడానికి అవసరమైన వన్నీ వయస్సులో ఉండగానే సమకూర్చుకోవాలి. ఆలాగే *పరలోకజీవితానికి అవసరమైన వన్నీ - అంటే పుణ్యం, జ్ఞానం మొదలైనవి - ఇహలోక జీవితంలోనే ఆర్జించుకోవాలి.*

ఇది మధురానగరంలో ఒక వైష్ణవపండితుడు తనతో పాటు తీర్థయాత్రలు చేస్తున్న తోడివైష్ణవులతో చెప్పినమాట. భోగభాగ్యాలూ, కామసుఖాలూ అనుభవించటమే జీవితమని అనుకొన్న మహారాజు మనస్సును మార్చిన మాట. ఆయన జీవితాన్ని మలుపు త్రిప్పిన మాట. మనిషికి ఉండవలసిన ముందుచూపు ప్రాధాన్యాన్నిగూర్చి చెప్పేమాట.

మానవాళి మాటిమాటికి గుర్తుచేసుకోదగినమాట.

అప్పుడు వాడు విడిపోయిన మబ్బువలె భ్రష్టుడు కాడుకదా? యోగసాధనవల్ల వచ్చే మోక్షం, వేదవిహిత కర్మలవల్ల ప్రాప్తించే స్వర్గం రెండూ నశిస్తాయా ఏమి? ఈ సందేహాన్ని నివారించడానికి నీకంటే సమర్థుడు ఎవడున్నాడు?"

## భగవంతు డంటున్నాడు

అర్జునా! యోగభ్రష్టుడు ఈ లోకంలోగానీ, పరలోకంలోగానీ నశించడానికి వీల్లేదు. మంచిభావనతో మంచి పనిచేసే వాడెన్నడూ దుర్గతిని పొందడు. యోగభ్రష్టుడు చనిపోయిన తరువాత పుణ్యవంతుల లోకాల్లో భోగాలనుభవించి మళ్ళీ భూలోకానికి వచ్చి, సదాచారసంపన్నులైన శ్రీమంతుల ఇళ్లల్లో పుట్టి, జీవితం సాగిస్తాడు. సాధన ఎక్కువగా చేసిన యోగి ఐతే తిరిగి యోగులయొక్క వంశంలోనే జన్మించి, పూర్వజన్మ సంస్కారంతో మళ్లీ యోగసాధనను చక్కగా ఆచరిస్తూ సిద్ధిని పొందుతాడు. నిజానికి మహోన్నతమైన ఈ జన్మ బహు దుర్లభమైంది.

కాబట్టి అర్జునా! ధ్యానయోగివికమ్ము. కర్మయోగం కంటే ధ్యానయోగం మహత్తరమైంది. తపోదీక్ష చేసేవారికంటే, శాస్త్రఅధ్యయనం చేసేజ్ఞానికంటె, వేదవిహితకర్మనుష్ఠాతకంటే ధ్యానయోగి శ్రేష్ఠుడు. యోగివి కావడానికి దీక్ష వహించు. యోగులందరిలో భగవద్భక్తుడే శ్రేష్ఠుడు.

యోగులందరిలో కూడా నాయందే శ్రద్ధాభక్తులు గల్గి, మనసు నా యందే లగ్నమొనర్చి, నన్ననుభవించువాడు ఉత్తమోత్తముడని నా అభిప్రాయం.

శ్రీకృష్ణార్పణమస్తు.

# ప్రహ్లాదవరద!

– బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు

**స్వామి ఆర్తత్రాణపరాయణుడు. అనన్యమైన చిత్తంతో ఉపాసించేవారి యోగక్షేమాలను భగవంతుడు అనునిత్యం గమనిస్తుంటాడు. కనుక ఆర్తులు చేయవలసినదల్లా నిర్మలమైన, నిశ్చలమైన మనస్సుతో స్వామిని ప్రార్థించడమే! హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి ఎన్ని బాధలు పెట్టినా, అతడు శ్రీహరిని తప్ప ఇతరులను స్మరించలేదు. కనుకనే, శ్రీహరి స్తంభంలో ఆవిర్భవించి, తన భక్తుణ్ణి బాధించినవాణ్ణి కూల్చి, చీల్చి చండాడి బాలభక్తుడైన ప్రహ్లాదుణ్ణి రక్షించాడు. శ్రీహరి నృసింహుడు. సింహము మృగరాజు. ఎంతటి క్రూరమృగమైనా, మృగరాజైన సింహానికి లొంగవలసిందే కదా! ఈ విధంగా క్రూరమృగమైన హిరణ్యకశిపుణ్ణి మృగరాజైన సింహంగా స్వామి వధించి, ప్రహ్లాదవరదునిగా ఖ్యాతి పొందిన విశేషాలన్నీ ఈ వ్యాసంలో... మీకోసం!**



తన తమ్ముడైన హిరణ్యాక్షుణ్ణి శ్రీహరి చంపాడనే కోపంతో ఆ విష్ణువుమీద ఎలాగైనా సరే పగతీర్చుకోవాలనే ఉద్దేశంతో హిరణ్యకశిపుడు తపస్సు ప్రారంభించాడు. ప్రత్యక్షమైన బ్రహ్మతో హిరణ్యకశిపుడన్నాడు. “దేవా! పంచభూతాలవల్లగాని, మరి వేటివల్లనైనా గాని, ఏ దిక్కున గాని, రాత్రింబవళ్లలో గాని... ఇలా ఏ స్థలంలోనూ, ఏ కాలంలోనూ, చావులేనివరం ఇయ్యవలసింది”– అని.

ఆయన అంతా విని “సద్బుద్ధితో జీవించడం ఎందుకైనా మంచిది. అయినా అడిగావు కాబట్టి నువ్వడిగిన వరమే ఇస్తున్నాను జాగ్రత్త” – అని వెళ్లిపోయాడు. వరంపొందానని తనకు తెలిసిన మరుక్షణం నుంచే హిరణ్యకశిపునికి గర్వం పెరిగింది. అహంకారం విజృంభించింది. తమోగుణం మిన్నుముట్టింది. దేవ, గంధర్వ, యక్ష, కిన్నర, విహంగ, నాగ, కింపురుష.... ఒకరేమిటి? అందరినీ ఎన్నివిధాల బాధలు పెట్టచ్చో అలా బాధించసాగాడు.

ఈ పరిస్థితిని గమనించిన శ్రీమహావిష్ణువు, హిరణ్యకశిపునికి పుత్రునిగా ప్రహ్లాదుణ్ణి పుట్టించాడు. అనితరవిష్ణుభక్తి తత్పరుడుగా పుట్టుకతోనే పరిమళించాడు– ప్రహ్లాదుడు. ఇంతవరకూ ఇతరుల్ని బాధపెట్టే విధానాలను మాత్రమే ఆలోచించే హిరణ్యకశిపునికి, ఈ ప్రహ్లాదునికారణంగా ‘మనసు బాధపడడం’ అంటే ఏమిటో అర్థం కాసాగింది. అయినా పుత్రవాత్సల్యం తండ్రిని కట్టివేసింది.

మరి కొంతకాలం సాగింది. ప్రహ్లాదుని విష్ణుకీర్తనలకు మరి కొన్ని రాక్షసకంఠాలు తోడయ్యాయి. తనవంశానికి ముసలం తన ఇంట్లోనే పుట్టిందనిపించింది హిరణ్యకశిపునికి. ప్రహ్లాదునివరకూ చెడిపోతే పోవచ్చుగానీ, ఇతరులకు అంటే తన రాక్షసజాతికి ఇతడివల్ల ఈ జాడ్యం పట్టరాదని భావించి, హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి చంపించబోయాడు. ఏ ఉపాయంవల్లా అతడు చావలేదు. ‘ఈ పుత్రుడు చావక– నన్ను ఎంతగా చంపుతున్నాడు?’ అనుకున్నాడు– తండ్రి.

పోనీ! తనను ఇలా తండ్రి బాధిస్తున్నాడని కూడా ఎవరితోనూ అనక ‘ఇదంతా శ్రీహరిఅనుగ్రహమే’ అనేంత స్థితిలో ప్రహ్లాదుడున్నాడని తండ్రి గ్రహించి, ఎటో ఒకటి తేల్చ దలిచి, స్తంభంలో శ్రీహరిని చూపించవలసిందన్నాడు ప్రహ్లాదునితో.



కరోనా జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించి తీరాల్సిందే!

స్తంభంలో నుంచి నర+సింహ రూపంతో ఆవిర్భవించిన స్వామి హిరణ్యకశిపుణ్ణి చంపి, ప్రహ్లాదుణ్ణి రక్షించి, వరంకోరు కొమ్మన్నాడు. 'కోరికలు వృద్ధి పొందకుండా ఉండే వరా'న్ని ప్రహ్లాదుడు కోరగా, స్వామి అనుగ్రహించి వెళ్లిపోయాడు.

ఇది పైకి కనిపించే కథ. ఇందులోని కొన్ని లోపలి విశేషాలు-

'మరణమనేది ఉండడంవల్ల కదా! ఈ విష్ణువుకు భయపడవలసి వస్తోం'దని గమనించిన హిరణ్యకశిపుడు, 'చావు లేక శాశ్వతంగా జీవించేవరాన్ని' భక్తసులభుడైన బ్రహ్మను అడిగాడు.

'ఎవరికీ ఇవ్వనిదీ- ఇంతవరకూ ఎవరూ కోరుకొని ఉండనిదీ, తాను కూడా ఇవ్వ వీలు లేనిదీ ఈ వరం' అని హెచ్చరిస్తూనే ఈ వరాన్నిచ్చాడు బ్రహ్మ. అంతటితో ఊరు కోకుండా 'సద్బుద్ధితో జీవించవలసింది' అని సూచించాడుకూడా!

ఎదుటివారినుంచి సహాయాన్ని పొంది, తిరిగి వాళ్లనే ఆపదకు గురి చేయడమనేది ఏదుందో అదే రాక్షసవిధాన మంటే. రాక్షసులంటే ఎక్కడో ఉన్నారు కాబోలు! అనుకోకూడదు. మనలోనైనా ఈ లక్షణాలుంటే మనమూ ఆ జాతివాళ్లమే. సరే! దేవతలలో ఒకడైన బ్రహ్మ నుంచీ 'చావులేనివరాన్ని' పొంది, అదే దేవజాతికి చెందిన విష్ణువును చంపాలని భావించడం నిజమైన రాక్షసలక్షణం. దీన్నే కృతఘ్నత అంటారు. చేసిన మేలుని మరవడమన్నమాట. దీనికి భగవంతుడు హర్షించ (లే)డు. అందుకే బాగా ఆలోచించాడు. 'దీనికి విరుగుడు ఏమిటా?' అని.

బాగా ఆలోచించి హిరణ్యకశిపునికి సర్వశః (అన్ని విషయాల్లోనూ - అన్ని దృక్పథాల్లోనూ- అన్ని కాలాల్లోనూ- అన్ని స్థలాల్లోనూ) విరోధి అయిన పుత్రుణ్ణి పుట్టింపచేయాలని ఆలోచించి తన నారద (నారద= జ్ఞానాన్ని ఇచ్చేవాణ్ణి) హిరణ్య కశిపుని భార్య అయిన లీలావతి (పరమేశ్వరుని లీలలకు ఆధార భూతమై లేదా ఆశ్రయభూతురాలై ఉండేది) వద్దకి పంపిం చాడు. పుట్టిన తర్వాత ఏది ఎవరు చెప్పినా ఆ విన్నవ్యక్తి, తాను విన్నదానితోపాటు తన ఆలోచనను కూడ జోడించి 'మంచి-చెడు' అని ఆలోచించుకుని 'ఔను-కాదు' అనే విషయాన్ని నిర్ణయించుకోవడం లోకసహజం కదా! అందుకని, లీలావతి కంటూ ఓ పుత్రుడు పుట్టక పూర్వమే, అతనికి విష్ణుభక్తిని పుట్టించాలని నిశ్చయించాడు - పరమాత్మ. అంతే చేశాడు కూడ. పుట్టుకతో పుట్టిన బుద్ధి పుడకలవరకూ (మరణం వరకూ) పోదు' అనే వాక్యానికి గట్టిసాక్ష్యం ఈ సంఘటన.

తనకు పుట్టిన పుత్రునిపేరు ప్ర+హ్లాదుడు. 'చెప్ప లేనంతటి ఆనందాన్ని అనుభవిస్తూ ఉండేవాడు' అని అర్థం. ఎందుకింతటి ఆనందం కలిగిందట? తాను తనతల్లి బొజ్జలో ఉండగానే శ్రీహరితత్త్వాన్ని నారదుడు చెప్పినందుకూ, తాను స్వయంగా తనతల్లి నిద్రపోతుంటే విన్నందుకూ, తన తండ్రికి ఇది ఎన్నవ జన్మమో, ఏ జన్మలో ఎలాటి మనస్తత్వమో అన్నీ, తెలుసుకోగలిగినందుకూ, ఎవరికీ కలుగనంతటి ఆ తత్త్వం మహాదృష్టంగా తనకే కల్గినందుకూను. ఇంతటి తత్త్వజ్ఞానం ఉంది కాబట్టే తాను ఎంత ఒత్తిడికి గురైనా మారరాదను కున్నాడు. ఈ తత్త్వం తెలియని హిరణ్యకశిపుడుమాత్రం ఎంతైనా ఒత్తిడి చేసి, పుత్రుణ్ణి మార్చాలనుకున్నాడు. పోటీ అనేది ఇలాటి భిన్నధ్రువాలమధ్యే కదా ఏర్పడేది!

జ్ఞానం ముందు అజ్ఞానం, వివేకం ముందు అవివేకం బలహీనపడిపోతాయనేది కాలంలోని అనుభవం చెప్పిన సత్యం, ధర్మం నేర్పిన పాఠమూను! అందుకే ప్రహ్లాదుణ్ణి తమరాక్షస విద్యతో మార్చాలని భావించిన గురువులు చండామర్కులవారు (చండుడూ అమర్కుడూ అనే ఇద్దరు) ప్రహ్లాదుని వాదంలో ఒక అర్థం ఉందని మనసులో అనుకుని కూడ, ఉద్యోగ సంప్రదాయ వంశమర్యాదలకోసం మారుపల్కక ప్రహ్లాదుణ్ణే నిందించారు. ఎక్కడైనా పరీక్షకు గురి అయ్యేది జ్ఞానమే (ప్రహ్లాదుడు మొదలైన వారే). ఇప్పటికీ వాడిజ్ఞానం ఎంతదో పరీక్షించండి' అంటూం టారు గదా! దానికర్థం ఇదే!

తండ్రీ కొడుకులిద్దరూ విరోధపడ్డారు. ఇద్దరికీ కారణం తెలిసింది. తమ విరోధం మాత్రం, మిత్రులైన ఇద్దరిలో వచ్చిన తాత్కాలిక విరోధంవంటిది కాదనీ ఎలుకా, పిల్లీ, పామూ, ముంగిసలులా శాశ్వత 'జాతివిరోధమే' అనీను. ఒకరి నొకరు మాటల ద్వారా ఇతరులను మార్చి సరైనతోవలో పెట్టుకుందా మనే ఆలోచనను పరస్పరం మొదట్లో కలిగి ఉన్నా, జాతివిరోధ మని పరస్పరం గుర్తించుకున్నాక ఇద్దరూ ఆ ప్రయత్నం నించి విరమించేసుకున్నారు.

తండ్రీ కొడుకుల్లో మానసికంగా తండ్రికి ఎక్కువ బాధ అన్పించింది. ప్రహ్లాదుణ్ణి మనసు మార్చుకొమ్మని మెత్తమెత్తగా సామోపాయం ప్రయోగించి చూచాడు తండ్రి, లాభం లేక పోయింది. ఇంద్రపదవి నిప్పిస్తానని దానోపాయాన్ని విసిరాడు

ప్రయోజనం కలగలేదు. దేవతావిధానాన్ని ఖండించే రాక్షస విద్యను నేర్పించి, భేదోపాయంతో ఛేదించదలచాడు చుక్కెదురైంది.

ఇక 'దండోపాయమే వీడికి గతి' అనుకున్నాడు. పుత్రుడనే మమకారపుహద్దును దాటి, చంపవలసిందని ఆజ్ఞాపించాడు. తనజాతిసముద్ధరణంకోసం పుత్రవధకు పాల్పడిన హిరణ్యకశిపుని దానవసంప్రదాయభక్తినీ, రాక్షస సిద్ధాంతం పట్ల గౌరవాన్ని ఎంతగా ప్రశంసించినా తక్కువే ఔతుంది గదా! అలాగే కన్నతండ్రితోపాటు తనవైపు ఏ ఒక్కరూ లేకున్నా ఒంటరి పోరాటాన్ని సాగిస్తున్నానని తనకు తెలిసినా తానునమ్మిన విష్ణు భక్తికై జన్మత్యాగానిక్కూడా సిద్ధపడిపోయిన ప్రహ్లాదుని దైవభక్తిని ఎందరు ఎన్నివిధాలుగా స్తుతించినా ఋణం తీరుతుందా? అందుకే భగవద్గీతలో "రాక్షసుల్లో ప్రహ్లాదుణ్ణి నేను" అన్నాడు పరమాత్మ. ఆయన దృష్టిలోకూడ తన గురించి ఇంత సాహసాన్ని ఇన్ని యుగాల్లోనూ ఎవరూ చేయలేదనే ఆలోచన ఉందన్న మాట. అంత గొప్పవాడు ప్రహ్లాదుడు.

వాదం జరుగుతూన్న ఇద్దరిలో కాలం గడిచిన కొద్దీ ఒకరు ఒక మెట్టెక్కితే మరొకరు ఒక మెట్టు దిగసాగారు. వాద ప్రారంభంలో 'విష్ణువు లేనే లేడు' అన్నాడు తండ్రి. ఆ వాదం కొంతగా జారింది మధ్యదశలో ఎలాగట?

"నా తమ్ముడు హిరణ్యాక్షుణ్ణి చంపినపుడు ఆ చంపిన శ్రీహరికోసం ముల్లోకాలూ వెదికాను. కన్పడలేదు. 'శ్రీహరి' అనేవాడు ఒకడు "లేడు' కాబట్టే అసలు కన్పించలేదు. 'నాకు కన్పించని హరిని' నువ్వు చూపించగలవా?" అన్నాడు తండ్రి. 'చూపిస్తే శ్రీహరి కన్పడితే నమ్ముదామనే మధ్యమదశలోనికి జారాడు తండ్రి' అని గమనించాడు- ప్రహ్లాదుడు. చివరిదశలో 'ఈ స్తంభంలో చూపించు!' అంటూ, శ్రీహరి తనను వధిస్తాడేమో ననే గట్టి నమ్మకంతోనూ, భయంతోనూ కత్తిదూసి, ఎదురు నిలబడ్డాడు 'చావులేని వరాన్ని' పొందిన హిరణ్యకశిపుడు.

ఇటు ప్రహ్లాదుడు కూడ వాదం ప్రారంభించిన మొదట్లో 'విష్ణునందే మనసు చేర్చుకుని జీవించడం' సరైందన్నాడు. మధ్యదశలో తనతండ్రి పెట్టే కష్టాలుకూడ 'విష్ణుమాయా విలసితాలే' అని భావించాడు. చివరిదశలో "ఇందుగలఁ డందు లేఁడను సందేహము వలదు' అని ప్రారంభించి, చక్రిసర్వోప గతుడు (ప్రాణిఅప్రాణి భేదంలేక అన్నిటిలోనూ తానై ఉన్న వాడూ) విష్ణువని అన్నాడు.

స్తంభాన్ని అరచేత్తో మోదాడు- రాక్షసుడు. లోనున్న విష్ణువు ఆలోచించాడు. నరరూపంతో సాక్షాత్కరిస్తే ఈ హిరణ్య కశిపుడు నరులందర్నీ విష్ణువులే అనుకుని ఈ జాతిమొత్తాన్ని సంహరించేస్తాడు. సింహరూపంతో కన్పిస్తే సింహాలన్నింటినీ విష్ణువులే అని భావించి, ఆ జాతి మొత్తాన్ని వధించేస్తాడు. అందుకని కన్పించీ కన్పించనట్టూ అర్థమయ్యీ అర్థం కానట్టూ ఎవరికి చెప్పినా విని నవ్విపోయేటట్టూ తనరూపం ఉండాలని ఆలోచించుకున్న శ్రీహరి, నర+సింహ రూపంలో తాను ఆవిర్భవించి హిరణ్యకశిపుణ్ణి వధించి ప్రహ్లాదుణ్ణి రక్షించాడు. దైవం విషయంలో సగం విశ్వాసం, లేదేమోననే సగం అవిశ్వాసం హిరణ్యకశిపునిలో ఉండడంబట్టే, అతనికి విష్ణువు సగం నర రూపంతో, సగం సింహరూపంతో సాక్షాత్కరించాడు. ప్రహ్లాదునికి నరసింహరూపం రక్షకునిగా గోచరించింది. దానికి కారణం ప్రహ్లాదుడు నరసింహుణ్ణి సంపూర్ణరక్షకునిగా భావించాడు కాబట్టి. అదే రూపం హిరణ్యకశిపునికి శిక్షకునిగా కన్పించింది. దానికి కారణం శ్రీహరిని విరోధిగా భావించాడు కాబట్టి.



**యే యథా మాం ప్రపద్యంతే తాం స్త థైవ భజా మ్యహమ్!**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ! సర్వశః!!**

అని గీత చెప్తోంది. భగవంతుణ్ణి ఎలా మనం భావిస్తే ఆయన అలా కన్పిస్తాడట.


కరోనా వైరస్ నేరుగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది

*(గత సంచిక తరువాయి....)*

భగవద్రామానుజులు ఈ తిరుమలపై వెలసియున్న స్వామి శ్రీవైకుంఠనాథుడును శ్రియఃపతియునగు శ్రీమహావిష్ణువే యని సకలదేశముల తెలియులాగున ఏర్పాటుచేసిరి. శ్రీవైఖానసాగమము చొప్పున సంప్రోక్షణము చేయించి నిత్యారాధనము నెరవేరునట్లు సంకల్పించి, శ్రీవిష్ణుతత్త్వప్రతిష్ఠాపనాచార్యులై శ్రియఃపతికి అసాధారణములైన శంఖచక్రములు ధరింప చేయుటతో నిలువక ముందుగ, ఉన్నతమైన దివ్యవిమానము నందు శ్రీవైఖానసాగమప్రకారముగ నాలుగుదిక్కులందును వరాహ నారసింహ వైకుంఠనాథ శ్రీవేంకటేశ దేవతామూర్తులను ప్రతిష్ఠింప జేసెను. విష్ణుపరికరదేవతలను ఆదిశేష విష్వక్సేన గరుడద్వారపాలురను కూడా ఆయా స్థానములందు ప్రతిష్ఠింప జేసెను. సన్నిధియందు దివ్యైశ్వర్యము పెంపొందగ శ్రీవక్షఃస్థల నాయిక యగు అలర్మేల్ మంగమ్మను –

**"ద్విభుజా వ్యూహలక్ష్మీః స్యాత్ బద్ధపద్మాసనప్రియా,**
**శ్రీనివాసాంగమధ్యస్థా సుతరాం కేశవప్రియా."**


(కేశవునకు మిగుల ప్రేమాస్పదయై బద్ధపద్మాసనస్థితి యందు ప్రీతిగలిగి శ్రీనివాసుని అంగమధ్యమున (వక్షః స్థలమున) వసించెడి వ్యూహలక్ష్మి రెండుభుజములు గలదై యుండవలయును.)

అని వరాహపురాణసిద్ధమైన తీరుగ ద్విభుజవ్యూహ లక్ష్మిగా భక్తులకు దర్శనము ప్రసాదించునట్లు చేయ సమకట్టి శుక్ల ద్వాదశియు, శుక్రవారము, ఉత్తరఫల్గునీనక్షత్రము కూడి యున్న రత్నమంజరికాయోగమున దివ్యవక్షఃస్థలమున (లక్ష్మీ దేవిని) సమర్పింపజేసెను. శ్రీ వేంకటేశ్వరస్వామికి ఆదికాలము నుండియు నిత్యాభిషేకము జరుపుచుండుట విని ఇట్లు జరుపు చుండినచో దివ్యవిగ్రహమునకు సముచితోపచారములు సంపూర్ణ ముగ నెరవేరవని తలచి,

**"కించ లక్ష్మ్యభిషేకస్తు వాసరే భార్గవే హరేః,**
**సాన్నిధ్యకారీ సతతం సర్వసంపత్ప్రదాయకః."**

(ఇదియును గాక, శుక్రవారమునాడు శ్రీలక్ష్మీదేవికి జరిపిన అభిషేకము శ్రీవిష్ణుసాన్నిధ్యము నొసగును. ఎల్లప్పుడును సర్వసంపదల నొడగూర్చును.)

అని వైఖానసశాస్త్రమగు ఆనందసంహితయందు చెప్పిన విధముగ శుక్రవారమున అలర్మేల్ మంగాదేవి దివ్యవక్షః




స్థలమునుండి దిగి, అభిషేకము స్వీకరించుటకు ముందుగా స్వామియు అభిషేకము స్వీకరించునట్లుగా కట్టడిచేసెను.

**"అష్టమీందు కలాకార లలాటస్థోర్ధ్వ పుండ్రకః"**

(అష్టమినాటి చంద్రకళాకారమైన లలాటమందు ధరించిన ఊర్ధ్వపుండ్రము గలవాడు)

అని పద్మపురాణమందలిదైన –

**"నాసికామూలమారభ్య రేఖాద్వితయసంయుతమ్,**
**ధారయే దూర్ధ్వపుండ్రం తు హరేః ఫాలతలే శుభే."**

(మంగళకరమగు శ్రీహరి ఫాలభాగమున నాసికా మూలము మొదలుకొని రెండురేఖలతో కూడినట్లుగ ఊర్ధ్వ పుండ్రమును ధరింపజేయవలెను.) *(ఇంకా ఉంది)*

# మాధవ మాసం

- శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి

ఆధ్యాత్మికత, పవిత్రత, దైవశక్తి అధికంగా ఉన్న మాసాల్లో వైశాఖమాసానికి ప్రత్యేస్థానం ఉంది. ఈ మాసంలో చేసే స్నానం, దానాలు అత్యంత విశేషమైన ఫలితాలను ఇస్తాయని పురాణాలు చెబుతున్నాయి. కార్తిక, మాఘమాసాల తర్వాత వైశాఖమాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది.

వైశాఖం అనే పేరులోనే ఎన్నో విశేషాలు దాగి ఉన్నాయి. విశాఖానక్షత్రంతో కూడిన పూర్ణిమ వచ్చే మాసం వైశాఖమాసం అనేది సాధారణ అర్థం. ఇందులోని ప్రత్యేకతలను పరిశీలిద్దాం. 'విశాఖ' అనే పదానికి 'రాధా' అనే అర్థం ఉంది. 'రాధ్నోతి కార్యమనయా ఇతి రాధా' అనే వ్యుత్పత్తి ప్రకారం రాధా అంటే కార్యసిద్ధి కలుగజేసేది అనే అర్థం ఉంది. అలాగే 'విశాఖతే కాంత్యావ్యాప్నోతీతి' అనే వ్యుత్పత్తి ప్రకారం విశాఖ అంటే కాంతిచేత అంతటా వ్యాపించేది అనే అర్థం ఉంది. ఈ రెంటిని సమన్వయం చేస్తే వైశాఖం అనే పదానికి 'కాంతి చేత సర్వత్రా వ్యాపించి, కార్యసిద్ధి కలుగజేయునది' అనే అర్థాన్ని చెప్పుకోవచ్చు. అలాగే, 'వైశాఖే మాధవో రాధా' అని గురుబాల ప్రబోధిక చెబుతోంది. దీనిప్రకారం చూస్తే సర్వత్రా వ్యాపించే కాంతితో కూడిన మాసమే వైశాఖం అని తెలుస్తుంది. 'మాధవ' అంటే వసంతుడు అనే అర్థంతో పాటు విష్ణుమూర్తి, శ్రీకృష్ణుడు అనే అర్థాలు కూడా వ్యాప్తిలో ఉన్నాయి. ఈ అర్థాలను కూడా సమన్వయం చేస్తే మాధవుడనే వసంతుడు రాధా అనే కాంతితో కూడి సకల కార్యసిద్ధి కలుగజేస్తున్నాడనే అర్థాన్ని చెప్పుకోవచ్చు.

ఈవిధంగా వైశాఖం అనే పేరులోనే ఎన్నో విశేషాలు దాగి ఉన్న ఈ మాసంలో చేయదగిన శాస్త్రవిహితకర్మల గురించి తెలుసుకుందాం.

## వైశాఖం- దాన, భోజన నియమాలు

పూజలతో పాటు వైశాఖంలో చేసే దానాలు అనంత కోటి పుణ్యాన్ని అందిస్తాయి. ఒక కలశంలో నీరు పోసి వైశాఖ మాసం ప్రారంభంలో బ్రాహ్మణునికి దానం ఇవ్వాలి. అలాగే, ఎండలు అధికంగా ఉండే కాలం కాబట్టి, వాటి నుంచి ఉపశమనం పొందడానికి నీరు, గొడుగు, విసనకర్ర, పాదరక్షలను దానం చేయాలి. వీటితోపాటు చలివేంద్రాలు ఏర్పాటుచేయాలి. పండ్లు, పండ్లరసాలు, పానకం, మామిడిపండ్ల రసం, పనస తొనలు, దోసపండు రోజుకు ఒక్కటి చొప్పున దానం చేయాలి. దీనివల్ల శివకేశవుల అనుగ్రహం కలుగుతుంది. అలాగే, కొబ్బరికాయ, పోకచెక్క, అరటిపండ్లు, సుగంధద్రవ్యాలు దానం చేయడంవల్ల వంశంలోని ఏడుతరాలవారికి వైకుంఠప్రాప్తి కలుగుతుంది. ఈ దానాలకు అదనంగా శయ్యాదానం, అన్నదానం కూడా చేస్తే ఇహలోకంలో సౌఖ్యం, పరలోకంలో మోక్షం లభిస్తాయని శాస్త్రవచనం.

వైశాఖంలో స్నాన, దానాదుల తర్వాత కొన్ని భోజన నియాలనుకూడా శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి. ఈ మాసం అంతా ఏకభుక్తం అంటే ఒక పూట మాత్రమే భోజనం (మధ్యాహ్నం భోజనం, రాత్రికి అల్పాహారం) చేయాలి. దీనివల్ల అక్షయపుణ్యం కలుగుతుంది. లేదంటే 'నక్తం' చేయవచ్చు. అంటే పగలంతా ఉపవాసం ఉండి రాత్రిపూట భోజనం చేయటం. దీనివల్ల కోరికలు సిద్ధిస్తాయి.

### శుక్ల పక్షం

**తదియ:** అక్షతదియగా ఈ రోజు ప్రఖ్యాతి పొందింది. గంగా స్నానం చేయాలి. ఈ రోజు చేసే జప, దాన, హోమాదులు అక్షయమైన ఫలితాలను ఇస్తాయి. ఉదక కుంభదానం చేయాలి. కొత్త కుండలో నీరు పోసి, సుగంధ ద్రవ్యాల పొడివేసి, రవికబట్ట వాసెన కట్టి, చందనం అద్ది, నవధాన్యాలు, చెప్పులు, గొడుగుతో సహా బ్రాహ్మణులకు దానం ఇవ్వాలి. అతిథులకు పెరుగన్నం పెడితే ఉత్తమ ఫలితం కలుగుతుంది. విష్ణువుకు చందన లేపనం చేయాలి. ఈ రోజే పరశురామ జయంతి అని పురుషార్థ చింతామణి చెబుతోంది. మన పంచాంగాల్లో మార్గశిర బహుళ విదియ పరశురామ జయంతి అని ఉంటుంది. రోహిణీ నక్షత్రం, బుధ, సోమ వారాలు కలసివస్తే ఆ రోజు చేసే విష్ణుపూజ ఉత్తమ ఫలితాలు ఇస్తుంది. యవలతో హోమం చేసి, యవలు

## వైశాఖమాసం - స్కందపురాణం

వైశాఖమాసంలో చేయాల్సిన మరికొన్ని విశేషకృత్యాలు, వాటి ఫలితాలను స్కందపురాణం ఇలా చెబుతోంది.

- వైశాఖశుక్ల అంత్యతిథుల్లో పుష్కరిణిని సేవించిన వారికి పుత్రపౌత్రాభివృద్ధి కలుగుతుంది.
- వైశాఖపూర్ణిమరోజున బ్రాహ్మణునికి అప్పాలు, పాయసంతో రుచిగా, శుచిగా భోజనం పెట్టిన స్త్రీ పుత్రసంతానవంతు రాలవుతుంది.
- వైశాఖ శుక్ల అంత్యతిథుల్లో గీతాపారాయణ చేసినవారు నిత్యం అశ్వమేధయాగం చేసిన ఫలితం పొందుతారు.
- ఈ రోజుల్లో నిత్యం భాగవత శ్లోకం లేదా శ్లోకార్ధం పఠించినవారు బ్రహ్మత్వాన్ని పొందుతారు.
- వైశాఖశుక్ల అంత్యతిథుల్లో బ్రాహ్మణునకు గోదానం చేసినవారు పరమోత్కృష్టమైన కైవల్యపదాన్ని చేరుకుంటారు.

దానం ఇవ్వాలి. కొన్ని గ్రంథాల్లో ఈ రోజున లక్ష్మీనారాయణ పూజ చేయాలని ఉంది. సింహాచలక్షేత్రంలో ఈ రోజు స్వామి వారికి చందనోత్సవం నిర్వహిస్తారు.

**ఏకాదశినుంచి పూర్ణిమవరకు:** ఈ తిథులు పరమ పవిత్రమైనవి. ఈ ఏకాదశి రోజునే దేవదానవులు అమృతాన్ని పొందారు. ద్వాదశి రోజున విష్ణుమూర్తి ఈ అమృతాన్ని దాచి ఉంచి, త్రయోదశి నాడు దేవతలచే తాగించి, చతుర్దశి నాడు రాక్షసులను సంహరించాడు. పూర్ణిమరోజున దేవతలకు సామ్రాజ్యం తిరిగి లభించింది. అందువల్ల వైశాఖ శుక్ల పక్షంలో అంత్యతిథులు చాలా శ్రేష్ఠమైనవిగా పురాణాలు చెబు తున్నాయి. ఈ రోజుల్లో నదులన్నీ పుష్కరిణీ అంశతో ఉంటాయి. ఈ పుష్కరిణీరూప తీర్థాల్లో స్నానం చేసినవారికి బ్రహ్మహత్యా దోషం, మధుపానదోషం నివృత్తి అవుతాయి. ప్రత్యేకంగా వైశాఖ శుద్ధ ఏకాదశి శ్రీమహావిష్ణువుకు అత్యంతప్రీతికరమైంది. విష్ణు సహస్రనామపారాయణ చేయాలి. చతుర్దశితిథికూర్మజయంతి. ఈరోజున మహావిష్ణువును కూర్మావతారంగా అర్చించి, నామ పారాయణ చేయాలి. ఏకాదశి రోజున అన్నవరంలో శ్రీసత్యనారా యణస్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది.

**చతుర్దశి :** ఈ రోజు నృసింహజయంతి. ఈ రోజు పగలంతా ఉపవాసం చేసి, సాయం సంధ్యాకాలంలో నరసింహమూర్తిని అర్చించాలి. భాగవతంలో నృసింహ ఆవిర్భావఘట్టం పారా యణ చేసి, స్వామికి విశేషంగా పానకం నివేదన చేయాలి. నృసింహకరావలంబ స్తోత్రం పారాయణ చేయాలి.

**పూర్ణిమ :** వైశాఖపూర్ణిమకు మహావైశాఖి అని పేరు. అత్యంత విశేష పర్వదినం ఇది. మహావిష్ణువు కూర్మావతారాన్ని ధరించిన రోజు ఇది. ఈ రోజున సముద్రస్నానం చేయాలి. దీనివల్ల కోటి జన్మలపాపం నశిస్తుందని శాస్త్రవచనం. ఈ రోజున సోమవ్రతం చేయాలని చతుర్వర్గచింతామణి చెబుతోంది. సత్యనారాయణ వ్రతం చేయాలి. ధర్మరాజుప్రీతిగా నానావిధ దానాలు చేయాలి. కూర్మజయంతి, నమ్మాళ్వార్ తిరునక్షత్రం కూడా ఈ రోజే!

### కృష్ణ పక్షం

**విదియ :** ఈ రోజు నారద జయంతి. సంగీత అభ్యాసకులకు వీణాదానం చేస్తే మంచిది.

**చవితి :** శ్రీమహావిష్ణువుకు యథాశక్తి అర్చనాదులు నిర్వ హించాలి. విష్ణుసహస్రనామం పారాయణం చేయాలి.

**దశమి :** ఈ రోజు హనుమజ్జయంతి. విశేష పర్వదినం. అనేక ఉపచారాలతో హనుమను పూజించాలి. సద్గురూపదేశం ప్రకారం ఆ స్వామిని సమంత్రకంగా అర్చించి, బ్రహ్మచారులకు హనుమత్స్వరూపంగా అర్చన చేసి, భోజనం పెట్టాలి. సిందూరం, తమలపాకులతో స్వామిని అర్చించి, వడమాల వేయాలి. శక్తిని అనుసరించి సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణం చేయాలి. హనుమద్వ్రతం, సువర్చలాహనుమత్క ల్యాణం నిర్వహించాలి. హనుమపూజకు ముందుగా శ్రీసీతా రాములను తప్పకుండా పూజించాలి. ఇందులో ఏమరుపాటు పనికిరాదు.

**ఏకాదశి:** ఈ రోజుకు అపరైకాదశి అని పేరు ఉంది. ఈ రోజున ఏకాదశీవ్రతం చేసి, ఉపవాసం చేస్తే పవిత్రతీర్థాల్లో స్నానం చేసిన ఫలితం కలుగుతుంది.

# పతంజలి మహర్షి

- డా॥ కప్పగంతు రామకృష్ణ

భగవంతుడు ప్రసాదించిన శరీరం ఉండగా, ఆరోగ్యం కోసం మానవులు తయారుచేసుకున్న ఔషధాలతో పనిలేదని నిరూపించిన మహత్తరమైన శాస్త్రం 'యోగం'. పరమాత్ముడే స్వయంగా కొలువై ఉన్నశరీరమే అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తుందని యోగశాస్త్రం నిరూపించింది. మనిషి తాను నిలుచున్న చోటులోనే పరమాత్మను సందర్శించగల సామర్థ్యాన్ని, అనేక సృష్టి రహస్యాలను తెలుసుకోగలిగిన శక్తిని అందజేసే శాస్త్రం 'యోగం'. ఆయుఃప్రమాణాన్ని పెంచగల శక్తికూడా కేవలం యోగశాస్త్రానికే ఉంది. ఇంతటి సర్వోన్నతమైన యోగశాస్త్రాన్ని మనకు అందించి, భారతభూమిని యోగ భూమిగా యుగయుగాలపాటు విశ్వవిఖ్యాతి పొందేలా చేసిన మహనీయుడు పతంజలిమహర్షి.

పతంజలి జన్మకాలానికి సంబంధించిన అనేకచారిత్రక ఆధారాలు మనకు లభిస్తున్నాయి. వీటిలో కొన్నిభేదాలుకూడా కనిపిస్తున్న ప్పటికీ చరిత్రకారులందరూ క్రీ.పూ రెండు లేదా మూడు శతాబ్దాలకు చెందిన వాడుగా అంగీకరిస్తున్నారు. కొంతమంది చరిత్రకారులు పతంజలి శ్రీకృష్ణుడికాలానికి చెందినవాడని చెబుతున్నారు. గ్రీకుగ్రంథాల్లో క్రీ.పూ. రెండో శతాబ్దంలో పతంజలి జీవించినట్లు ఆధారాలు ఉన్నాయి. వీటన్నిటినీ సమన్వయం చేసి, చూస్తే ఇప్పటికి సుమారు ఐదువేల సంవత్సరాల క్రితం పతంజలి భారతదేశంలో అవతరించాడని తెలుస్తుంది.

పతంజలి మహర్షి ఆదిశేషుని అవతారమని పురాణాలు చెబుతున్నాయి. శ్రీమహావిష్ణువు అనుచరుల్లో అతిముఖ్యుడు ఆదిశేషుడు. రామావతారకాలంలో లక్ష్మణుడిగా, కృష్ణావతారకాలంలో బలరాముడిగా తానూ అవతరించటంతో పాటు విష్ణుమూర్తి వెన్నంటి ఉన్న పుణ్యమూర్తి ఆయన.

ఆదిశేషుని అవతారమైన పతంజలి మహర్షి కారణజన్ముడిగా కనిపిస్తారు. అవైదికమతాలను నియంత్రించి, భారతదేశంలో వైదికమతాన్ని సుప్రతిష్ఠితం చెయ్యటానికి పరమాత్మ చేసిన లీలానాటకానికి పతంజలిరూపం తొలి మెట్టు.

పతంజలి కారణంగా గౌడపాదాచార్యులు, ఆయన కారణంగా గోవిందభగవత్పాదాచార్యులు, ఆయన కారణంగా ఆదిశంకరులు ఈ దేశానికి అందారు. 'సంభవామి యుగేయుగే' అని గీతాచార్యుడు చెప్పినమాటకు అక్షరనిదర్శనం పతంజలిమహర్షి.

## యోగశాస్త్ర రచన

మంత్రసాధనను, యోగశక్తులను అన్వేషించేవారికి నిగూఢమైన కల్పతరువు పతంజలి యోగసూత్రాలు. ఇందులో ఒక్క శ్లోకాన్ని తీసుకుని, దాన్నే ఒక పద్ధతిగా ప్రతిపాదించి ప్రపంచవ్యాప్తమైన ప్రఖ్యాతిని, శిష్యగణాలను తయారుచేసుకున్నవారు ఎందరో ఉన్నారు. కాలపరిమితులకు, ప్రమాణాలకు, పరీక్షలకు అందని గ్రంథం 'పతంజలి యోగశాస్త్రం'. ఆధునిక జీవనంలో పాశ్చాత్యులకు సైతం అష్టాంగమార్గదర్శకంగా పతంజలి యోగసూత్రాలు ఉన్నాయి. ఒక సాధారణ మానవుడు



కరోనాను ఎదిరించడానికి మన శరీరంలోని అంతర్గత రక్షణవ్యవస్థలను బలోపేతం చేసుకోవడమే మార్గం

సాధకుడుగా, సిద్ధుడుగా, జీవన్ముక్తుడుగా, పరాముక్తుడుగా ఎలా పరిణామం చెందుతాడో ఈ సూత్రాల్లో విస్తారంగా వర్ణితమై ఉంది.



యోగవిద్య అత్యంత ప్రాచీనమైనది. మౌఖిక సంప్రదాయంలో విద్యావ్యాప్తి కొనసాగే కాలంలో ఈ విద్య చాలా కొద్దిమందికి మాత్రమే పరిమితమై ఉండేది. యోగం నియమ నిబంధనలేవీ చాలాకాలం పాటు గ్రంథస్థం కాలేదు. గురువుల అనుగ్రహంతో మాత్రమే కొందరు జిజ్ఞాసులు ఈ విద్యను నేర్చుకోగలిగేవారు. పతంజలి మహర్షి యోగశాస్త్రం, భాష్య రచన ఫలితంగా జనసామాన్యానికిసైతం యోగశాస్త్రం చేరువకాగలిగింది.

పతంజలిమహర్షి ప్రాచీన యోగశాస్త్రాన్ని మథించి, 196 సూత్రాలు రాశారు. యోగవిద్యలో హఠయోగ, క్రియాయోగ వంటి ఎన్ని శాఖోపశాఖలు ఉన్నా, కార్పొరేట్‌యుగంలో యోగంను మనం ఎన్ని కొత్త కొత్త పేర్లతో పిలుచుకుంటున్నా, వాటన్నింటికీ పతంజలి మహర్షి సూత్రాలే ప్రామాణికం. ఆయన తన సూత్రాలన్నింటినీ నాలుగు విభాగాలుగా విభజించారు. అవి– సమాధిపద, సాధనాపద, విభూతిపద, కైవల్యపద.

మనశ్చాంచలనాన్ని నిరోధించడంద్వారా సమాధిస్థితికి ఎలా చేరుకోవాలో 'సమాధిపద'లో వివరించారు. ఇందులో 51 సూత్రాలు ఉన్నాయి. క్రియాయోగ, అష్టాంగయోగాలను ఎలా సాధన చేయాలో 'సాధనాపద'లో 55 సూత్రాల ద్వారా తెలిపారు. ధారణ, ధ్యాన, సమాధి సాధనలలో ఎలా సంయమనం పాటించాలో 'విభూతిపద'లో వివరించారు. ఇందులో 56 సూత్రాలు ఉన్నాయి. ఈ విభాగంలో సిద్ధులసాధన ప్రస్తావన ఉన్నా, అవి మాయ మాత్రమేనని, కైవల్యలక్ష్యానికి దూరం చేస్తాయని హెచ్చరించారు. యోగసాధన పరమలక్ష్యమైన కైవల్యప్రాప్తి (మోక్షప్రాప్తి) గురించి 34 సూత్రాలతో 'కైవల్యపద'ను విపులీకరించారు. యోగసాధనకు యమ (నైతిక క్రమశిక్షణ), నియమ (విధి విధానాలు), ఆసన (యోగాసనాలు), ప్రాణాయామ (ఉచ్ఛ్వాస నిశ్వాసాలపై నియంత్రణ), ప్రత్యాహార (ఆలోచనల నుంచి ఉపసంహరణ), ధారణ (ఏకాగ్రత), ధ్యాన (ధ్యానం), సమాధి (నిశ్చలస్థితి) అనే అష్టాంగాలు కీలకమైనవని మానవాళికి తొలిసారిగా చాటిన మహనీయుడు పతంజలి మహర్షి.




# మనవంతు సాయం!

దారిలో అంబులెన్సు వాహనం వచ్చినప్పుడు...
దానికి దారి వదిలి, మీవంతు సహాయం చేయండి!
అందులోని రోగికి ఆరోగ్యం మెరుగుపడాలని...
మనసారా 'శ్రీవేంకటేశ్వరస్వామి'ని వేడుకోండి!!



# భక్తి పారిజాతం

-డా॥ సంగీతం కేశవులు, 90146 57722

తరిగొండ వెంగమాంబ క్రీ.శ. 1713 సం॥లో కానాల కృష్ణయ్య మంగమాంబలకు శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పుట్టినందువలన ఈమెకు "వెంగమ్మ" అని స్వామి వారి పేరుపెట్టి పిలిచేవారు. తరిగొండప్రాంతంలో పుట్టిపెరగడం వల్ల ఈమెకు తరిగొండ వెంగమాంబ అనే పేరు వచ్చింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబసాహిత్యాన్ని తరిగొండలో రాసిన సాహిత్యం, తిరుమలలో రాసిన సాహిత్యం అని రెండు విధాలుగా విభజించుకోవచ్చు.

**వెంగమాంబ తరిగొండలో ఉండగా ఐదింటిని రచించింది. అవి-**

**01) తరిగొండ నృసింహాశతకం:** ఇది వెంగమాంబ తరిగొండలో రాసిన మొదటి రచన. ఈ శతకంలో అనేక సామాజికఅంశాలకు సంబంధించిన విషయాలు తెలియజేసింది.

**02) నారసింహ విలాసకథ:** తరిగొండనృసింహాలయందగ్గర పీఠాధిపతి సమక్షంలో మహిమలు చూపినందుకు కృతజ్ఞతగా ఈ కథను యక్షగాన నాటకంగా రాసి, ఆ స్వామికి సమర్పించింది. ఇందులోని కథ ప్రహ్లాదచరిత్ర అని భావింపబడుతున్నది.

**03) శివనాటకం:** ఇందులోని విషయం నారదుడు గానం చేత సూర్యుణ్ణి మెప్పించి, అపూర్వమైన రత్నాలహారాన్ని బహుమతిగా పొందుతాడు. ఆ హారాన్ని నారదుడు శివునికి సమర్పిస్తాడు. శివుడు ఆ హారాన్ని పార్వతికి బహుకరిస్తాడు. అందుకు గంగాదేవికి కోపం వస్తుంది. ఆ తర్వాత గంగాదేవిని సంతోషపెట్టడానికి నారదుడు ఇచ్చిన హారం కన్నా అందమైనహారాన్ని బ్రహ్మచేత తెప్పించి, గంగాదేవికి ప్రసాదిస్తాడు. దీనితో గంగాగౌరుల మధ్య కోపం తొలగి కథసుఖాంతం అవుతుంది.

**04) రాజయోగామృతసారం:** రాజయోగసారంలోని కథ భాగవత తృతీయస్కంధంలోని కర్దమ ప్రజాపతి వృత్తాంతం ఆధారంగా గురుపరంపర, సాంఖ్యప్రయోగతత్త్వం సప్త చక్రాలవర్ణన, దశవాయువుల ప్రస్తావన, ముఖ్యనాడుల వివరణ, గ్రంథుల వర్ణన, తారక లక్షణం, మండలత్రయం, శాంభవీముద్ర మొదలగు వివరణలు చెప్పబడ్డాయి.

**05) బాలకృష్ణ నాటకం:** దీనికే "కృష్ణనాటకం" అనే మరొక పేరు ఉంది. దీనికి ప్రేరణ శ్రీభాగవతంలోని దశమస్కందం అని చెప్పవచ్చు. ఇందులో అద్భుతమైన పాటలను వెంగమాంబ రాసింది.

**తిరుమల దివ్యక్షేత్రంలో ఉండగా పదమూడు కృతులు వెలయించింది. అవి -**

**01) విష్ణుపారిజాతం:** శ్రీనివాసునిభక్తబృందంలో విశిష్టప్రఖ్యాతి గడించిన వెంగమాంబ యక్షగానకృతుల్లో ఆణిముత్యం విష్ణుపారిజాతం. వెంగమాంబ విష్ణుపారిజాత యక్షగాన రచనపై పోతన, నందితిమ్మన, సిద్ధేంద్రయోగుల ప్రభావం ఉంది. ఇందులో అద్భుతమైనవర్ణనలు కలవు.

**02) శ్రీరమాపరిణయం :** తాళ్లపాక తిమ్మక్క సుభద్రాకల్యాణం అనే పెండ్లిపాటలాగా వెంగమాంబప్రేరణ పొంది, రమా పరిణయం అనే పెండ్లిపాట రచించింది. సముద్రుని కూతురైన రమాదేవి(లక్ష్మీదేవి) శ్రీవేంకటేశ్వరుని పరిణయం ఆడటం ఇందులో ఇతివృత్తం. 400 ద్విపదల్లో ఈ కావ్యాన్ని రచించింది.

**03) శ్రీ వేంకటేశ్వర కృష్ణమంజరి:** శ్రీ వేంకటేశ్వరుని దివ్యపాద యుగళికి సమర్పించిన కమనీయకృతి. శ్రీ వేంకటేశ్వర కృష్ణమంజరి. అడుగడుగున "కృష్ణ" సంబోధనలతో పాటగా పాడుకోవడానికి సులభమైన మనోహరశైలిలో పారాయణం చేయాల్సిన పవిత్రమైన స్తుతికావ్యం శ్రీవేంకటేశ్వర కృష్ణమంజరి.

**04) శ్రీరుక్మిణీ నాటకం :** ఇది అలభ్యం.

**05) గోపికా నాటకం :** ఇందలి కథానాయిక గొల్లయువతి. వెంగమాంబ రచించిన ఈ గోపిగా నాటకమునకు గొల్ల కలాపం అనే పేరు కూడ ఉంది. ఇందులో "యజ్ఞపు



కరోనా ఎక్కువ కావడానికి కారణం డి-విటమిన్ లోపం

పట్టు" విశిష్టమైంది. ఇందలి విషయాలు ఆధ్యాత్మికంగా వ్యాఖ్యానించబడ్డాయి.

**06) శ్రీవేంకటాచల మాహాత్మ్యం:** తరిగొండ వెంగమాంబ రచనల్లో ప్రసిద్ధి చెందినది. ఈ గ్రంథం 6 అశ్వాసాల పద్యకావ్యం. ఇది సంస్కృత వేంకటాచలమాహాత్మ్యంనుండి వరాహ-భవిష్య- పద్మపురాణ భాగాల నుండి మూలాన్ని స్వీకరించి, వెంగమాంబ ఈ కావ్యాన్ని స్వేచ్ఛగా అనువదించింది. ఈ వేంకటాచలమాహాత్మ్యకావ్యాన్ని అర్హులైనవారికి దానం చేస్తే సకలశుభాలు కలుగుతాయని లోకోక్తి.

**07) అష్టాంగయోగసారం:** వెంగమాంబ యోగవిద్యకు సంబంధించిన అనేకవిశేషాలను యోగక్రమంలో అష్టాంగయోగ సారములో చెప్పబడింది. ఇవి మొట్టమొదటిసారిగా పతంజలియోగశాస్త్రంలో చెప్పబడ్డాయి. 1)యమ 2)నియమ 3)ఆసన 4)ప్రాణాయామ 5)ప్రత్యాహార 6)ధ్యాన 7)ధారణి 8)సమాధి అష్టాంగయోగాలను అనుసరిస్తూ వెంగమాంబ తెలియజేసింది.



**08) జలక్రీడా విలాసం:** వెంగమాంబ ఈ యక్షగానాన్ని తిరుమలలో రచించింది. ఇందులో శ్రీకృష్ణజననం మొదలుకొని గోపికల జలక్రీడలవరకు సాగిన ఆ గోపాలుని బాల్యదశ వర్ణించబడింది. ఈ కథ పోతనభాగవతంలోని దశమ స్కందంనుండి గ్రహించబడినది.

**09) వాసిష్ఠ రామాయణం:** సంస్కృతంలో వాల్మీకి రచించిన రామాయణాన్ని ఆధారంగా చేసుకొని, ద్విపదలో ఒక ప్రకరణలో రచించింది. ఇందులోని విషయం వేదాంతం. వసిష్ఠమహర్షి విశ్వామిత్రునిప్రేరణచేత శ్రీరామునికి అనేక తాత్విక విషయాలను కథలరూపంలో విశదీకరించి ఉపదేశిస్తారు. శ్రీరామునిసందేహాలను నివృత్తి చేయడం ఇందులోని కథాంశం.

**10) చెంచు నాటకం:** ఈ యక్షగానాన్ని తుంబురుకోనలో ఉన్నప్పుడు వెంగమాంబ రచించింది. తుంబురుకోనలో నివసించే చెంచువారివృత్తాంతం ఈ నాటకంలోని కథ. ఇందులో చెంచువారిఆచారవ్యవహారాలు, పెండ్లివర్ణన అద్భుతంగా రచన చేసింది వెంగమాంబ.

**11) ముక్తికాంతా విలాసం:** వెంగమాంబ రచించిన యక్షగానాల్లో చివరిది ముక్తికాంతా విలాసం. ఇందులో కథ వేదాంతానికి సంబంధించింది. జగదీశ్వరుడు ముక్తికాంతను కలసుకోవడం ఇందులోని ప్రధానకథ.


**12) ద్విపద భాగవతం:** వెంగమాంబస్వామివారిని ఒక రోజు ప్రార్థిస్తూ ఉండగా శ్రీవేంకటేశ్వరస్వామి బాలకృష్ణుని రూపంలో వెంగమాంబచెంతకు వచ్చి, భాగవత ప్రతిని చేతికి ఇచ్చి దీనిని ద్విపదకావ్యంగా రచించుమని స్వామి వారు సూచించారు.

**13) తత్త్వకీర్తనలు (ఆధ్యాత్మిక గేయాలు:** వెంగమాంబ తన జీవితకాలంలో అనేకకీర్తనలు, పాటలను ఆశువుగా అల్లుతూ పాడుతుండేది. ఇవి పరబ్రహ్మాయొక్కతత్త్వాన్ని తెలిపేవి కాబట్టి ఇవి తత్త్వకీర్తనలుగా పేర్కొనబడ్డాయి.

వెంబమాంబజీవితంలోని భక్తితత్త్వం అనేది ఆదర్శమైనది. వెంగమాంబ సృష్టించిన సాహిత్యసంపద తెలుగు సాహిత్యచరిత్రలో మరి ఏ భక్తకవయిత్రి సృష్టించలేదు.

# వర్ణించడానికి... వేయికన్నులు చాలవు!!

- ఆచార్య కోలవెన్ను మలయవాసిని,
73311 41505



విశాఖజిల్లాలో ప్రసిద్ధికెక్కిన వరాహనారసింహక్షేత్రం సింహాచలం. దశావతారాలలో మూడో అవతారం వరాహావతారం. నాలుగోది నృసింహావతారం. ఈ రెండు అవతారాలు కలిసి ఒకే రూపంలో వెలసిన విశిష్ట పవిత్రపుణ్యక్షేత్రం సింహాచలం. ఇక్కడ స్వామిని యుగళావతారమూర్తి అని ప్రత్యేకంగా పేర్కొంటారు. 'జమిలిదేవర' అని వ్యవహరిస్తూ ఉంటారు. జమిలి అంటే- రెండు అని అర్థం.

హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు అనే ఇద్దరు రాక్షసులను సంహరించడానికి విష్ణుమూర్తి రెండుఅవతారాలు ధరించాల్సి వచ్చింది. వరాహమూర్తిగా హిరణ్యాక్షుణ్ణి సంహరించాడు. భూదేవిని ఉద్ధరించాడు. ప్రహ్లాదుణ్ణి సంరక్షించడానికి నృసింహునిగా అవతరించాడు. ఈ రెండు అవతారాలు ఉగ్రమైనవే. బాలుడైన ప్రహ్లాదుడు వరాహనారసింహఅవతారాలను శాంతరూపంతో ఏకరూపుడై దర్శనమిమ్మని కోరగా వరాహనరసింహస్వామిగా శాంతస్వరూపుడై సింహాచలంమీద వెలసినట్లు స్థలపురాణం చెబుతోంది.

సింహాచలంలో మరోరెండువిశేషాలు ఉన్నాయి. ఒకటి ఇక్కడ స్వామికి చందనోత్సవం నిర్వహించడం. ఈ ఉత్సవం వైశాఖ శుద్ధ తదియనాడు జరుగుతుంది. రెండోది గిరిప్రదక్షిణ ఆషాఢపౌర్ణమి నాడు చేస్తారు.

'చందనోత్సవం' మాత్రం సింహాచలంలోనే జరుగుతుంది. ఈ ఉత్సవంనాడే స్వామివారి నిజరూపం దర్శించుకునే అవకాశం ఉంది. తక్కినరోజుల్లో స్వామిచందనం పూసుకుని లింగాకారుడై కనిపిస్తాడు. వరాహనారసింహరూపం ఎలా ఉంటుంది అనేది మామూలు రోజుల్లో తెలుసుకునే అవకాశం లేదు. అప్పుడు నిత్యరూపదర్శనం మాత్రమే. నిజరూపదర్శనం చందనోత్సవంనాడే! అది వైశాఖశుద్ధ తదియ. ఈ తదియకే అక్షయతృతీయ అని పేరు.

ఒకసారి పురూరవచక్రవర్తి ఊర్వశితో కలిసి విహారం చేస్తూ, ఆకాశమార్గాన వస్తున్నాడు. సింహాచలం దగ్గరకు వచ్చేసరికి విమానం ఆగిపోయింది. ఎందుకు ఆగిందో తెలియలేదు. ఆనాటి రాత్రివారు సింహాచలం మీదనే విశ్రమించారు. ఆనాటి రాత్రి స్వామి కలలో కనబడి, నేను ఈ పర్వతం మీద ఉన్నాను. నన్ను అర్చించు అని చెప్పాడు. పురూరవుడు లేచి ఆ రోజంతా స్వామికోసం వెదికాడు. స్వామి కనబడలేదు. రాత్రి అయింది. ఆనాటినిద్రలో స్వామి మళ్లీ స్వప్నంలో సాక్షాత్కరించి నేను ఇక్కడ గంగధార దగ్గర, పుట్టలో ఉన్నాను. దాని మీద మాలతీ లత ఉంటుంది. గమనించి సేవించు" అని చెప్పాడు.

మరునాటి ఉదయం స్వామిని పురూరవచక్రవర్తి కనుగొన్నాడు. గంగధారజలాలతో సహస్రఘటాభిషేకం చేశాడు. పంచామృతాభిషేకం చేశాడు భక్తితో. స్వామిపాదాలు దర్శిద్దామంటే కనబడక చింతించసాగాడు. స్వామి అప్పుడు చిరునవ్వుతో- "పురూరవా! చింతించకు. ఈ అవతారంలో భూలోకవాసులకు పాదదర్శనం లేదు" అని చెప్పాడు. అంతేకాదు మరో విషయంకూడా చెప్పాడు. నేను ఇన్నాళ్లూ పుట్టలో ఉన్నాను కాబట్టి చల్లగా ఉంది. ఇప్పుడు తాపం భరించలేక పోతున్నాను. నాకు వెంటనే గంధం పూయవలసింది అన్నాడు. భూమికి 'గంధవతి' అని పేరు. కాబట్టి మన్నుకు బదులుగా గంధం పూయమని కోరాడు. పురూరవచక్రవర్తి స్వామి కోరినట్లే చందనం పూశాడు. ఆ సందర్భంలో స్వామి "నువ్వు నన్ను


పుట్ట నుండి బయటకు తీసిన ఈ వైశాఖశుద్ధ తదియనాడు మాత్రమే నా నిజరూపదర్శనం. తక్కిన రోజుల్లో వరాహనారసింహమూర్తిగా చందనంలోనే ఉంటాను. ఆనాడు నాకు చందనోత్సవం జరపండి" అని చెప్పాడు. అప్పటినుండి ఈ చందన సమర్పణ జరుగుతున్నది.

చందనోత్సవం తీరుతెన్నుల విషయానికి వస్తే అక్షయ తృతీయకు వారం రోజులనుండి స్వామివారికి విశేషమైన పూజలు జరుపుతారు. స్వామికి ఏడాదికాలంగా పూసిన చందనాన్ని రంగరించే ప్రక్రియ ప్రారంభిస్తారు. విదియనాడు బంగారుగొడ్డలితో స్వామిమీది చందనాన్ని వేదమంత్రాల నడుమ అర్చకస్వాములు తొలగిస్తారు. ఆ తర్వాత 'గంగధార' నుండి తెచ్చిన జలాలతో సహస్రఘటాభిషేకాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత అక్షయతదియ నాటి తెల్లవారుజాము నుండి భక్తులకు నిజరూపదర్శనం కలగజేస్తారు. 'గంధం ఒలుపు' అని ఈ ప్రక్రియను వ్యవహరిస్తారు. తదియనాటి సాయంత్రం స్వామికి తిరిగి చందనం పూస్తారు. ఈ చందన సమర్పణ నాలుగు విడతలుగా జరుగుతుంది.

అక్షయతృతీయనాడు నూటఇరవైఅయిదుకేజీల చందనం అరగదీసింది పూస్తారు. రెండో విడతగా వైశాఖ పౌర్ణమినాడు 125 కేజీలు, జ్యేష్ఠపున్నమినాడు 125 కేజీలు, ఆషాఢపున్నమి నాడు 125 కేజీలు చందనం సమర్పిస్తారు. మొత్తం అయిదు వందల కేజీల చందనమందిరం స్వామినివాసం.

చందనంతయారీవిషయానికి వస్తే, చందనోత్సవానికి పది రోజుల ముందునుండీ ఈ చందనం అరగదీసే కార్యక్రమం ఆరంభమౌతుంది. ఈ చందనంకోసం మేలైన చందనపు చెక్కలను కేరళనుండి తెప్పిస్తారు. వాటిని అరగదీయడానికి వీలుగా అడుగు పరిమాణంలో ముక్కలుగా చేస్తారు. వీటిని పూజించి ప్రధాన అర్చకులు తొలి చెక్కను అరగదీస్తారు. దీంతో అరగదీత కార్యక్రమం ప్రారంభమౌతుంది. గంధం తీయడానికి పెద్ద పెద్దసానలు, తిరుచుట్టి మాళిగలో ఉన్నాయి. భక్తులు దర్శించు కోవచ్చు. అరగదీసిన శ్రీగంధాన్ని ఏ రోజుకారోజు స్థానాచార్యులవారు తూకం వేసి భద్రపరుస్తారు. అరగదీసిన గంధంలో అర్చకులు అనేక వనమూలికలు, సుగంధద్రవ్యాలు కలిపి ముద్దలుగా చేస్తారు.

అందువల్లనే వరాహ నరసింహదేవుని దేహం నుండి వేరు చేసిన నిర్మాల్య చందనానికి ఔషధ గుణాలున్నా యని పెద్దలమాట.



స్వామినుండి వేరుచేసిన గంధాన్ని ముక్కలుగా చేసి పొట్లాలు కట్టి ప్రసాదంగా పంపిణీ చేస్తారు. ఏడాది పొడవునా స్వామి విగ్రహాన్ని ఆశ్రయించి ఉన్న చందనాన్ని భక్తులు ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ చందనాన్ని నీటిలో కలుపుకుని సేవిస్తే ఏ రకమైనవ్యాధులైనా నశిస్తాయని భక్తుల విశ్వాసం. ఈప్రసాదంకోసం భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరి ఉంటారు. చందనోత్సవానికి ఇటు ఆంధ్రప్రదేశ్‌నుండి, అటు ఒరిస్సానుండేకాక భారతదేశంలోని ఇతరప్రాంతాలనుండి, విదేశాలనుండి కూడా భక్తులు విశేషంగా వస్తారు. చందన ప్రసాదం లభిస్తే పరమానంద భరితులవుతారు.

అసలు సింహాచలంలో ప్రసాదమంటే "చందనమే" అని శ్రీనాథమహాకవి 'భీమఖండం'లో పేర్కొన్నాడు. **'సింహాద్రియందు లక్ష్మీ నృకంఠీరవసార్వభౌము ప్రసాద చందనంబు' - (2వ ఆ-51 పద్యం)**

ఈ చందనోత్సవానికి చందనయాత్ర అనికూడా పేరు. నిరంతరం చందనం మధ్యలో ఉండడంతో పాటు సంపెంగమాలలు, తులసిమాలలు ధరించే ఈస్వామికి 'పరిమళస్వామి' అనే పేరు కూడా ఉంది. ఈ చందోనోత్సవం సామాన్యప్రజలలో కూడా ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

అక్షయతృతీయకు ముందువచ్చే అమావాస్యను అంటే చైత్ర అమావాస్యను ఉత్తరాంధ్రలో గంధం అమావాస్య అంటారు. గంధం అమావాస్యవారం అని, ఆ వారమంతా సింహాద్రినాథుణ్ణి పూజిస్తారు. ఇక్కడి ప్రజలు 'సింహాద్రి అప్పన్న' అని ప్రేమగా పిలుచుకుంటారు. ఈ ప్రాంతంలో అప్పన్న, అప్పారావు, అప్పాయమ్మ అనే పేర్లు ఎక్కువగా వినిపిస్తాయి.

సింహాచలానికి సంబంధించిన గొప్పఉత్సవం చందనోత్సవం. స్వామి ఈ నాడు నిజరూపంలో దర్శనమిస్తాడు. తనమేని గంధాన్ని ప్రసాదంగా ఇస్తాడు.

ఈ చందనోత్సవ సందర్భంలో స్వామివారి నిజరూపదర్శనం విశేషమైన ఫలాన్ని ఇస్తుంది. శరీరాన్నేకాక మన మనస్సులను కూడా పరిమళభరితం చేస్తుంది.

వాసనారహితుడైన భగవంతుడు ఈ క్షేత్రంలో సువాసనాభరితుడై భక్తులకు భవ్యము దివ్యము అయిన అనుభూతిని ప్రసాదిస్తున్నాడు.




# ఆలుమగలు హాయిగా ఉండాలంటే...

- డా॥ మేడికుర్తి ఓబులేశు

## శుక్రుడు

మానవజీవితంలో సుఖానికి, సౌఖ్యానికి, విలాస, వైభోగాలకు సంసారజీవితానికి, దాంపత్యసౌఖ్యానికి, భార్యా భర్తల అన్యోన్యతకు శుక్రుడే ప్రధానమైన నిర్ణయాత్మక గ్రహం. విలువైన వస్త్రాలు ధరించి, వివిధ భాషల్లో పరిజ్ఞానం కలిగి, విలువైన ఆభరణాలు ధరించి,రకరకాల వాహనాల్లో తిరిగే వైభోగం ఈ శుక్రగ్రహంవల్లే కలుగుతుంది. సినిమా రంగంలో, నాటకరంగంలో, ప్రసారమాధ్యమాలలో ప్రఖ్యాతి గాంచడానికి శుక్రగ్రహ అనుకూల ఫలితాలే కారణం.



ఈ శుక్రగ్రహ జాతకులు భృగుపాశుపతహోమం చేయాలి. ప్రేమసాఫల్యానికి, స్త్రీ జనఆకర్షణకు ముఖ్యగ్రహం శుక్రుడే. పరస్త్రీవ్యామోహానికి కారణం శుక్రగ్రహస్థితియే! జీవితంలో అదృష్టం స్త్రీవల్ల ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని సంభవించడానికి, వివాహం తదుపరి జీవనశైలి ఉన్నతంగా మారడానికి, దీర్ఘకాల రాజకీయ అధికారప్రాప్తి, సుగంధ పరిమళాలు వెదజల్లే వాతావరణంలో నివసించడం, నలగని దుస్తులు, మహత్తర మనోహరమైన ఉల్లాసవంతమైన సువాసనలు వెదజల్లే పరిమళద్రవ్యాలు వాడే అలవాట్లు, భోగాలు శుక్రగ్రహశుభఫలితాలే!




## శుక్రగ్రహ అనుకూలతకు చేయవలసినవి

ఇంద్రాణీజపం చేయటం, బొబ్బట్లు దానం చేయటం, ఆవు, దూడ బొమ్మ కలిగిన ఉంగరాన్ని వైష్ణవాలయంలో పూజించి ధరించాలి. ఇంట్లో స్త్రీలను ఏడ్పించకూడదు. శుక్రవారంనాడు రాహుకాలసమయంలో శుక్రగ్రహ స్తోత్రాన్ని పఠించాలి. లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయాలి. ఉత్తరం దిక్కుగా తలపెట్టకూడదు. తూర్పు, పడమర తలగడ నిద్రమంచిది.

కలువపూలతో మహాలక్ష్మీదేవి పూజ చేయాలి. పూజలో ఆరావళి కుంకుమ, లక్ష్మీచందనంతో మహాలక్ష్మీదేవిని పూజించాలి. శ్రీవేంకటేశ్వర స్వామివారికల్యాణం జరిపించాలి. పుష్యమీ నక్షత్రం ఉన్నరోజున భార్గవగోత్రం గలవారికి కనీసం నలుగురికి భోజనం పెట్టి తాంబూలం ఇవ్వాలి. చిన్న వెండి ఉంగరాన్ని దానం చేయాలి.

### శుక్రగ్రహస్తోత్రం

**హిమకుంద మృణాలాభం। దైత్యానాం పరమం గురుమ్।**
**సర్వశాస్త్ర ప్రవకారం। భార్గవం ప్రణమా మ్యహం॥**


ఆరడగుల దూరం - కరోనా మనకు దూరం

# శ్రీలక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రం

## (తాత్పర్య సహితం)

- విద్వాన్, డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య, 98481 11794

**ఆదిశంకరులు** రచించిన శ్రీలక్ష్మీనృసింహకరావలంబ స్తోత్రం **శ్రీనృసింహజయంతి** సందర్భంగా **'సప్తగిరి'** పాఠకులకోసం... దీన్ని ప్రతిరోజూ ఉదయం, సాయంకాలం భక్తితో పఠించేవారికి కష్టనష్టాలన్నీ తొలగిపోయి సుఖశాంతులు కలుగుతాయి!

శ్లో॥ శ్రీమత్పయోనిధినికేతన! చక్రపాణే!
భోగీంద్రభోగమణిరాజితపుణ్యమూర్తే!
యోగీశ! శాశ్వత! శరణ్య! భవాబ్ధిపోత!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥ 1

శ్రీలకు నిలయమైన పాలసముద్రంలో నివసించేవాడా! సుదర్శనచక్రాన్ని చేత ధరించినవాడా! ఆదిశేషుని పడగల పైనున్న మణుల కాంతులతో ప్రకాశించేవాడా! యోగులకు ప్రభువైనవాడా! శాశ్వతమైనవాడా! దీనులకు దిక్కైనవాడా! సంసారసముద్రానికి నౌక అయినవాడా! ఓ లక్ష్మీనృసింహస్వామి! నాకు చేయూత నిమ్ము!

శ్లో॥ బ్రహ్మేంద్రరుద్రమరుదర్కకిరీటకోటి -
సంఘట్టితాంఘ్రికమలామలకాంతికాంత!
లక్ష్మీలసత్కుచసరోరుహరాజహంస!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥ 2

బ్రహ్మ, ఇంద్రుడు, శివుడు, వాయువు, సూర్యుడు-వీరి కిరీటాగ్రాలచేత ఒరయబడ్డ పాదపద్మాల నిర్మలకాంతితో మనోహరమైనవాడా! లక్ష్మీదేవియొక్క అందమైనవక్షోజపద్మాలకు రాజహంసవైనవాడా! ఓలక్ష్మీనృసింహా! నాకు చేయూత నిమ్ము!

శ్లో॥ సంసారసాగరవిశాలకరాళకామ -
నక్రగ్రహగ్రసననిగ్రహవిగ్రహస్య -
మగ్నస్య రాగలసదూర్మినిపీడితస్య,
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 3

ఓలక్ష్మీనృసింహా! సంసారమనే సముద్రంలోని మహాభయంకరమైన కామమనే గొప్ప మొసలిచే పట్టువడినాను. సంసారవిషయచింతలనే అలలచే గుంజబడి బాధలు పడుతున్న నాకు చేయూత నిచ్చి రక్షించు స్వామీ!

శ్లో॥ సంసారఘోరగహనే చరతో మురారే!
మారోగ్రభీకరమృగప్రవరార్దితస్య
ఆర్తస్య మత్సరనిదాఘనిపీడితస్య
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥ 4

ఓమురారీ! నృసింహస్వామీ! సంసారమనే భయంకరమైన అడవిలో తిరుగుతూ, మన్మథుడనే క్రూరమృగం నోటబడి, బాధపడుతున్నాను. క్రోధమనే వేడిచే తపింపబడుతున్నాను. ఇట్టినాకు చేయూత నిచ్చి రక్షించుము.

శ్లో॥ సంసారకూప మతిఘోర మగాధమూలం,
సంప్రాప్య దుఃఖశతసర్పసమాకులస్య,
దీనస్య దేవ! కృపయా శరణాగతస్య,
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 5

ఓ లక్ష్మీనృసింహదేవా! మిక్కిలి భయంకరమై, చాల లోతుగల సంసారమనే బావిలో పడి, దుఃఖాలనే వందలకొద్దీ విషసర్పాలతో పట్టువడి, బాధపడుతున్న దీనుడనైన నన్ను కరుణించి, చేయూత నిచ్చి రక్షించుము.

శ్లో॥ సంసారభీకరకరీంద్రకరాభిఘాత-
నిష్పీడ్యమానవపుష స్సకలార్దితస్య,
ప్రాణప్రయాణభవభీతిసమాకులస్య,
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 6

ఓ లక్ష్మీనృసింహస్వామీ! నా శరీరం సంసారమనే భయంకరమైన మదపుటేనుగుతొండపుదెబ్బలచే నొచ్చింది. అనేకబాధలతో ఆర్తి నొందినవాణ్ణి. ప్రాణంపోతుందనే భయంతో ఉన్నవాణ్ణి. కరుణించి నాకు చేయూత నిమ్ము.

శ్లో॥ సంసారసర్పవిషదుష్టభయోగ్రతీవ్ర-
దంష్ట్రాకరాళవిషదగ్ధ వినష్టమూర్తేః,
నాగారివాహన! సుధాబ్ధినివాస! శౌరే!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 7

ఓ గరుడవాహనా! క్షీరసాగరశయనా! శౌరీ! లక్ష్మీ నృసింహస్వామి! సంసారమనే త్రాచుపాముయొక్క దుష్ట భయంకర క్రూరతీవ్రాలైన కోరలలోని మహావిషంతో నాశరీరం నష్టమైంది! కరుణించి, నాకు చేయూత నిచ్చి. బ్రతికించుము.

శ్లో॥ సంసారజాలపతితస్య, జగన్నివాస!
సర్వేంద్రియార్థబడిశస్థఝషాత్మనశ్చ,
ప్రోత్తంభితప్రచురతాలుకమస్తకస్య
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 8

ఓ జగన్నివాస! సంసారమనేవలలో తగుల్కొని, స్త్రీ భోగాదివిషయాలకులోనై, గాలానికి తగుల్కొన్న చేపవలే తన్ను కొంటున్నాను. దవుడలు. తల నిక్కి నీలుక్కొన్నవి. ఇట్టి దయనీయ స్థితిలో ఉన్న నన్ను కరుణించి, చేయూత నిచ్చి రక్షించుము.

శ్లో॥ సంసారవృక్ష మఘబీజ మనంతకర్మ-
శాఖాయుతం కరణపత్ర మనంగపుష్పమ్,
ఆరుహ్య దుఃఖజలధౌ పతితో దయాళో!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥ 9

ఓ దయాహృదయా! లక్ష్మీనృసింహస్వామీ! పాపమనే విత్తనంనుండి పుట్టింది, అనంతకర్మలనే కొమ్మలుగలదీ. ఇంద్రియాలనే ఆకులుగలదీ, మన్మథుడనే పూవుగలదీ ఐన ఈ సంసారమనే చెట్టు నెక్కి, దుఃఖమనే సముద్రంలో పడ్డాను. నాకు చేయూత నిచ్చి కాపాడుము.

శ్లో॥ సంసారదావదహనాకులభీకరోగ్ర
జ్వాలావళీభి రభిదగ్ధతనూరుహస్య,
త్వత్పాదయుగ్మసరసీరుహమస్తకస్య
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 10

ఓ లక్ష్మీనృసింహస్వామీ! ఈ సంసారమనే దావాగ్ని జ్వాలలు అన్ని వైపులా వ్యాపించి, నన్ను కాల్చుతున్నాయి. వెంట్రు కలు మాడిపోయాయి. నీ పాదపద్మాలపై శిరస్సు నుంచాను. ఈ మంటలను చల్లార్చి, నాకు చేయూత నిచ్చి, కాపాడుము.

శ్లో॥ సంసారసాగరనిమజ్జనముహ్యమానం
దీనం విలోకయ విభో! కరుణానిధే! మామ్,
ప్రహ్లాదఖేదపరిహార! పరావతార!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥ 11

ఓ స్వామీ! దయానిధీ! ప్రహ్లాదుని దుఃఖాన్ని పరిహరిం చినవాడా! శ్రేష్ఠాలైన అవతారాలెత్తినవాడా! లక్ష్మీనృసింహా! సంసారసముద్రంలో పడి, ఉక్కిరిబిక్కిరి అవుతున్న దీనుడనైన నన్ను కరుణతో చూడుము. నాకు చేయూత నిచ్చి, కాపాడుము.

శ్లో॥ సంసారయూథ గజసంహతిసింహ! దంష్ట్రా-
భీతస్య దుష్టమతిదైత్యభయంకరేణ,
ప్రాణప్రయాణభవభీతినివారణేన,
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 12

సంసారమనే ఏనుగులగుంపును హింసించే సింహ మైన లక్ష్మీనృసింహస్వామీ! దుష్టమతులైన రాక్షసులకు భయాన్ని కొల్పేదీ, జననమరణాలవల్ల కలిగే భయాన్ని నివారిం చేదీ అయిన నీకోరతో, సంసారభీతుణ్ణి ఐన నాకు చేయూత నిమ్ము.







శ్లో॥ సంసారయోగి సకలేప్సితనిత్యకర్మ-
సంప్రాప్య దుఃఖసకలేంద్రియమృత్యునాశ-
సంకల్ప! సింధుతనయాకుచకుంకుమాంక!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ 13

ఓ లక్ష్మీనృసింహస్వామీ! సంసారసంబంధంచే గల్గే సకలవాంఛలచే పుట్టినదీ, శాశ్వతాలైన కర్మబంధాలవల్ల ఏర్పడే దుఃఖాలను, ఇంద్రియార్థాలను, మృత్యువును, నశింపజేసే దివ్యసంకల్పాలుగలవాడవు- నీవు. ఇలాంటి యోగివి, భోగివి అగు నీవు నాకు చేయూత నిచ్చి, కాపాడుము.

శ్లో॥ బధ్వా కళై ర్యమభటాబహుభర్త్స్యయంతి,
కర్షంతి యత్ర పథి పాశశతై ర్యదా మామ్,
ఏకాకినం పరవశం చకితం దయాళో!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 14

దయామయా! లక్ష్మీనృసింహస్వామీ! దిక్కుమాలిన వాణ్ణీ, అపస్మారకస్థితిలో నున్న వాణ్ణీ, ఒంటరివాణ్ణీ. భయపడిన వాణ్ణీ అగు నన్ను- ఎక్కడ యమభటులు ఈడుస్తారో అప్పడక్కడ నీవు సాక్షాత్కరించి, నాకు చేయూత నిచ్చి రక్షించుము.

శ్లో॥ అంధస్య మే హృతవివేకమహాధనస్య
చోరై ర్మహాబలిభి రింద్రియనామధేయైః,
మోహాంధకారకుహరే వినిపాతితస్య.
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 15

ఓ లక్ష్మీనృసింహదేవా! కామాదులచే గుడ్డివాణ్ణి ఐనందున, మహాబలంగల ఇంద్రియాలనే దొంగలు, నా వివేకమనే ధనాన్ని దొంగలించి, నన్ను అజ్ఞానమనే చీకటికోనలో పడేశారు. కనుక స్వామీ! చేయూత నిచ్చి, నన్ను దరిచేర్చి రక్షింపుము.

శ్లో॥ లక్ష్మీపతే! కమలనాభ! సురేశ! విష్ణో!
యజ్ఞేశ! యజ్ఞ! మధుసూదన! విశ్వరూప!
బ్రహ్మణ్య! కేశవ! జనార్దన! వాసుదేవ!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్. 16

ఓ లక్ష్మీనాథా! పద్మనాభా! దేవదేవా! సర్వవ్యాపకా! యజ్ఞపురుషా! యజ్ఞరూపా! మధుసూదనా! విశ్వరూపా! బ్రహ్మజ్ఞానం గల బ్రాహ్మణులకు హితం కోరేవాడా! కేశవా! జనార్దనా! వాసుదేవ! లక్ష్మీనృసింహా! నాకు చేయూత నిమ్ము.

శ్లో॥ ప్రహ్లాద నారద పరాశర పుండరీక-
వ్యాసాంబరీష శుక శౌనక హృన్ని వాస!
భక్తానురక్తపరిపాలనపారిజాత!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 17

ప్రహ్లాదుడు, నారదుడు, పరాశరుడు, పుండరీకుడు, వ్యాసుడు, అంబరీషుడు, శుకుడు, శౌనకుడు మున్నగు పరమ భాగవతుల హృదయాలలో నివసించేవాడా! నీయందు ప్రీతి గల భక్తులను కాపాడడంలో పారిజాతమనే కల్పవృక్షంవంటి వాడా! ఓ లక్ష్మీనృసింహా! నాకు చేయూత నిమ్ము.

శ్లో॥ ఏకేన చక్ర మపరేణ కరేణ శంఖ-
మన్యేన సింధు తనయా మవలంబ్య తిష్ఠన్,
వామేతరేణ వరదాభయహస్తముద్రాం
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥ 18

ఓ లక్ష్మీనృసింహా! ఒక కుడిచేతిలో సుదర్శనచక్రాన్ని, ఒకఎడమచేతిలో పాంచజన్యమనే శంఖాన్ని, ఒక కుడిచేతితో అభయవరప్రదానముద్రను, ఒకయెడమచేతితో లక్ష్మీదేవిని తాల్చిన దివ్యరూపంతో సాక్షాత్కరించి, చేయూత నిచ్చి, నన్ను కాపాడుము.

శ్లో॥ ఆద్యంతశూన్య మజ మవ్యయ మప్రమేయం,
ఆదిత్య రుద్ర నిగమాదినుతప్రభావమ్,
త్వాంభోధిజాస్యమధులోలుపమత్తభృంగం.
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥ 19

మొదలూ తుది లేనివాడూ, పుట్టుకలేనివాడూ, నాశనం లేనివాడూ, కొలతపెట్టరానివాడూ, సూర్యుడు, రుద్రుడు; వేదాలు మున్నగువారిచే నుతింపబడు ప్రభావం గలవాడూ, లక్ష్మీదేవియొక్క ముఖపద్మంలోని తేనెను గ్రోలు తుమ్మెద అయిన ఓ లక్ష్మీనృసింహా! నిన్ను సేవిస్తాను. చేయూత నిచ్చి కాపాడుము.

శ్లో॥ వారాహ! రామ! నరసింహ! రమాదికాంతా-
క్రీడావిలోల! విధి శూలి సురప్రవంద్య!
హంసాత్మకం పరమహంస విహారలీల!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥ 20

పరమహంసలైన యోగులందు విహారక్రీడ సల్పు ఓలక్ష్మీనృసింహా! నీవు వరాహ, రామ, నృసింహాది రూపాలు దాల్చిన వాడవు, లక్ష్మిమొదలైన స్త్రీలతో క్రీడించే వాడవు. బ్రహ్మ, శివుడు మున్నగు దేవతలచే నమస్కరింపదగ్గవాడవు. కనుక హంసస్వరూపమైన నీ చేయూత నిచ్చి, నన్ను కాపాడుము.

శ్లో॥ మాతా నృసింహశ్చ పితా నృసింహః,
భ్రాతా నృసింహశ్చ సఖా నృసింహః
విద్యా నృసింహో ద్రవిణం నృసింహః
స్వామీ నృసింహ స్సకలం నృసింహః॥ 21

నాకు తల్లీ, తండ్రీ, తోబుట్టువూ. మిత్రుడూ, విద్యా, ధనం, రక్షకుడూ- జీవితసర్వం శ్రీలక్ష్మీనృసింహస్వామియే!

శ్లో॥ ప్రహ్లాదమానససరోజవిహారభృంగ!
గంగాతరంగధవళాంగ! రమాస్థితాంగ!
శృంగారసంగరకిరీటలసద్వరాంగ!
లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్॥ 22

ప్రహ్లాదుని మనఃపద్మమునందు విహరించే తుమ్మెద వైన వాడా! గంగాతరంగాలవలే తెల్లనైనవాడా! లక్ష్మీదేవికి నివాస స్థానమైన శరీరంగలవాడా! సుందరమైన కిరీటంతో ప్రకాశించే శిరస్సుగల వాడా! లక్ష్మీనృసింహా! నాకు చేయూత నిమ్ము.

శ్లో॥ శ్రీశంకరార్యరచితం సతతం మనుష్యః
స్తోత్రం పఠే దిహతు సర్వగుణప్రసన్నమ్,
సద్యో విముక్త కలుషో మునివర్యగణ్యో
లక్ష్మీపతేః పద ముపైతి స నిర్మలాత్మా॥ 23

శ్రీశంకరాచార్యులు రచించిన దివ్యమహిమ గల ఈ స్తోత్రాన్ని నిరంతరం పారాయణం చేసేవాడు, సర్వ పాపాల నుండి విడి వడి, మునీశ్వరులచే మెప్పునొందిన వాడై, నిర్మలాత్ముడై పునరావృత్తి లేని శాశ్వతమైన విష్ణుస్థానాన్ని పొందు తాడు.



శ్లో॥ ఏత న్మయార్జితవపుః ప్రచురప్రవాహ-
మగ్నార్త మర్త్య నివహస్య కరావలంబమ్,
లక్ష్మీనృసింహచరణాబ్జమధువ్రతేన
స్తోత్రం కృతం శుభకరం భువి శంకరేణ॥ 24

కర్మబంధాలతో పొందబడ్డ జన్మప్రవాహాలలో మునిగి, బాధనొందుతున్న మానవసమూహానికి, చేయూతనిచ్చునట్టి శుభకరమైన ఈస్తోత్రం, లక్ష్మీనృసింహపాదపద్మాలందు తుమ్మెదయైన శ్రీశంకరాచార్యులచే కావింపబడింది.

శ్లో॥ శ్రీమన్న ృసింహ! విభవే! గరుడధ్వజాయ!
తాపత్రయోపశమనాయ, భవౌషధాయ,
తృష్ణాదివృశ్చికజలాగ్నిభుజంగరోగ-
క్లేశవ్యయాయ హరయే గురవే నమ స్తే॥ 25

సర్వేశ్వరుడువు, గరుడధ్వజుడు, తాపత్రయాన్ని ఉప శమింపజేసేవాడు, జననమరణాత్మకమైన సంసారవ్యాధు లకు ఔషధమైనవాడు. ఆకలిదప్పులు, తేళ్లు, నీరు, అగ్ని, పాములు, వ్యాధులు మున్నగువానివల్ల గల్గే బాధల్ని నశింపజేసే వాడు, ఎల్లపాపాలను హరించేవాడు. గురువు అయిన ఓలక్ష్మీ నృసింహస్వామీ! నీకు నమస్కారం!







# వాగ్గేయకారులు కీర్తించిన తిరుపతి గంగమ్మ

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

త్రిగుణాత్మక అయిన ఆదిశక్తి గ్రామగ్రామాల్లో గ్రామదేవతలుగా కూడ అవతరించి, ఆయా ప్రాంతాల ప్రజలకు బాధలు, రోగాలు తొలగించి, పాడిపంటలను వృద్ధిపరుస్తుంటుందని కూడా పెద్దల మాట!

కనుకనే, భారతదేశంలో సర్వత్రా పల్లెపల్లెలో ఆ జగన్మాత గ్రామదేవతగా వెలసివుంటూ ఆఊరి ప్రజలచేత ఘనంగా పూజలందుకొంటూ, వారివారి కోరికలను నెరవేరుస్తున్నది. క్షేత్రయాత్ర చెయ్యాలన్నా లేదా తీర్థయాత్రకు బయలుదేరాలన్నా, లేదా ఇంట్లో ఒక శుభకార్యం చెయ్యడానికి పూనుకొన్నా ముందుగా ఆ గ్రామప్రజలు తమగ్రామదేవతను స్మరించాల్సిందే! తప్పక పూజించాల్సిందే. అలా చేస్తేనే వారివారికోరికలు, పనులు నెరవేరతాయి. ఇంటిలో శుభకార్యాలు నిర్విఘ్నంగా కొనసాగుతాయి.

ప్రధానంగా కలియుగ భూలోకవైకుంఠమైన తిరుపతి క్షేత్రంలో గ్రామదేవతగా వెలసిన 'గంగమ్మ' శక్తిస్వరూపిణిగా, భక్తులపాలిటి కల్పవల్లిగా, కరుణామయిగా దర్శనమిస్తున్నది. **"తిరుపతి గంగమ్మ జాతర"** పేరుతో వారంరోజులపాటు జరిగే ఉత్సవాలు ప్రాచీనకాలంనుండీ దేశమంతా ప్రసిద్ధికెక్కాయి.

అనూచానంగా ఈ తల్లి శ్రీవేంకటేశ్వరస్వామివారిసోదరిగా భావింపబడుతూ, ప్రతి సంవత్సరం మే నెలలో జరిగే తిరుపతి గంగమ్మ జాతరలో "చీరసారె పసుపుకుంకుమలు" తిరుమల శ్రీస్వామివారు సారెగా పంపడం ఆనవాయితీగా వస్తున్నది. తిరుపతి పట్టణంలో 'గంగమ్మ' పేరుతో ఇరువురు గ్రామదేవతలు వెలసి ఉన్నారు. ఒకరు తాతయ్యగుంట గంగమ్మ, మరొకరు తాళ్లపాక గంగమ్మ. తాళ్లపాక గంగమ్మ ప్రస్తుతం తిరుపతి ఆర్.టి.సి బస్టాండు కూడలి వద్ద చిన్నగుడిలోను, తాతయ్యగుంట గంగమ్మ 'తుడా' కార్యాలయం వద్ద ఆలయంలో కొలువై ఉన్నారు.

వీరిద్దరిలో తాతయ్యగుంట గంగమ్మ ప్రధాన గ్రామదేవతగా పూజలందుకొంటున్నది. 15వ శతాబ్దంలో కడపజిల్లా తాళ్లపాక నుంచి తిరుపతిని చేరుకొన్న అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని భక్తుడుగా ఆ స్వామివారి నందక ఖడ్గ అంశతో అవతరించిన కారణజన్ముడిగా పేరొందినాడు. సుమారు 32వేల కీర్తనలను శ్రీనివాసునిపై రచించి గానం చేసిన అన్నమయ్యకు అప్పటి దేవస్థానం వారో లేక అప్పటి తిరుపతి పురప్రముఖులో ఒక పెద్ద చెరువునూ, దానిప్రక్కనే సాగులో ఉన్న వ్యవసాయ భూమినీ విరాళంగా సమర్పించారు. అప్పటినుంచి అది తాళ్లపాక చెరువుఅనీ, తాళ్లపాక భూములనీ పేరు

ఏర్పడింది. ఆ నాటి నుండి ఆ చెరువుపక్కనే ఎప్పటినుంచో ఉన్న గ్రామదేవత గంగమ్మ ‘తాళ్ళపాక గంగమ్మ’ అనే పేరుతో స్థిరపడింది. తాళ్లపాక అన్నమయ్య తొలిసారిగా తిరుపతి యాత్రకు వచ్చిన సందర్భంలో ఈ గ్రామదేవత గంగమ్మను దర్శించినాడని “అన్నమయ్య జీవిత చరిత్ర”లో తెలుపబడింది.

అన్నమయ్య కాలానికే యాదవులు అర్చించే ఈగంగమ్మను మొదట దర్శించిన తర్వాతే యాత్రికులు తిరుమలకొండకు వెళ్ళేవారని తెలుస్తున్నది. నేటికీ తాళ్లపాక గంగమ్మవద్ద యాదవులే అర్చకత్వం చేస్తున్నారు. తిరుమల శ్రీస్వామివారిని ప్రతిరోజు తొలుతగా దర్శించేది కూడా యాదవుడే అని ఇక్కడ గమనించవలసిఉంది.

ఇక తాతయ్యగుంట గంగమ్మనుగూర్చి కూడా ప్రసిద్ధంగా ఒక కథ ప్రచారంలో ఉన్నది. తిరుమలక్షేత్రంలో సాక్షాత్తు శ్రీనివాసునిచేతనే తాతా! తాతా! అని పిలిపించుకొన్న ఒక పరమభక్తుడు ఉండేవాడు. ఆనాటినుండి ఆ భక్తుడు, అతని వంశంలోని వాళ్ళంతా “తిరుమల తాతాచార్యులు” అని పిలువబడేవారు. 16వ శతాబ్దంలో తిరుమలతాతాచార్యులు అని ప్రసిద్ధి పొందిన ఒక వైష్ణవభక్తుడు దేశసంచారం చేస్తూ కడపజిల్లాలో ఒకగ్రామానికి వెళ్ళి, ఆ రాత్రి అక్కడ విడిది చేశాడట! ఆపల్లెలో ఆ రోజు ఆ గ్రామదేవత గంగమ్మకు జాతర జరుగుతూ ఉండేది. ఆ దేవత భయంకరంగా ఉగ్రరూపిణియై నరభక్షకురాలై ఆ గ్రామ ప్రజల్ని వేళపాళలేకుండా పొట్టన బెట్టుకుంటూ పీడిస్తూ ఉండేది. ఆ బాధ భరించలేక “అమ్మా! తల్లీ! ఇలా మమ్మల్ని భక్షించకు. సంవత్సరానికి ఒకమారు నీకు జాతర చేసి, మేమే నీకు నరబలిని సమర్పిస్తాం. అని అందరూ వేడుకొనగా ఆ ఉగ్రదేవత సరేనన్నదట! సరిగ్గా ఆ రోజు నుంచి ఆ ఊళ్లో గంగమ్మ జాతర జరుగుతుండింది. ఆ గ్రామప్రజలు నరబలికోసం వెదుకుతుండగా వారికి ఆ రోజే ఆ ఊరికి వచ్చిన తాతాచార్యులు కనపడ్డాడు. బాగా బలిష్ఠంగా ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలతో ఉన్న ఈ స్వామిని బలి ఇస్తే అమ్మవారు సంతృప్తి పడుతుందని, ఇతనిని బలిఇచ్చి ఇప్పటికి గట్టెక్కవచ్చునని భావించిన ఆ ఊరి ప్రజలు ఆస్వామిని నిర్బంధించారు. ఇది తెలుసుకొన్న ఆయనశిష్యులు గగ్గోలు పెట్టారు. అయినా ఏమాత్రం బాధపడ వద్దని శిష్యులను ఓదార్చి, తాతాచార్యులు ఆ ప్రజలవెంట గంగజాతర దగ్గరకు వెళ్ళాడు. ఆ స్వామి ఇంతలో కొలిమిలో అగ్ని వెలిగించి, శంఖ చక్ర ముద్రలను బాగా ఎర్రగా కాల్చి ఉంచమని శిష్యులను ఆదేశించాడు. బాగా అర్ధరాత్రి అయిన తర్వాత గంగమ్మ ఒకనికి పూనకం వచ్చి “బలి! బలి! నరబలి!” అని అరుస్తూ, చిందులేస్తూ రాగా వెంటనే తాతాచార్యులు కొలిమి నిప్పుల్లో బాగా ఎర్రగా కాల్చివుంచిన శంఖ చక్రాల ముద్రలను వాని భుజాలపై వాతలు వేశాడు. వెంటనే వానిని ఆవహించిన గంగమ్మ భయపడి పారిపోవడానికి ప్రయత్నించగా తాతాచార్యులు మంత్రశక్తిచేత ఆమెను దిగ్బంధం చేశాడు. అయినా ఆ శంఖచక్రాలవాతలు భుజాలపై పడకుండా వీపుపై పడ్డాయట! అందువల్లే “తాతాచార్యుల వాతలు భుజం తప్పినా వీపు తప్పవు” అనే సామెత ఏర్పడింది. ఆ గంగమ్మ ఆచార్యులను శరణువేడింది. ఆమెను తన శిష్యురాలిగా చేసుకొని అనుగ్రహించి, తన వెంట తిరుపతికి పిలుచుకొని వచ్చాడు. అప్పటికే తమ అధీనంలో ఉన్న చెరువు పక్కన ఉన్న పొలంలో ఆమెను ప్రతిష్ఠించి, ఇకమీదట, ఆ దేవతను తిరుపతి గ్రామదేవతగా ఉంటూ రక్షించవలసిందనీ, సాత్త్వికంగా ఉంటూ ఎలాంటి బలులను కోరకుండా కేవలం పొంగళ్లను ఆహారంగా స్వీకరించ వలసిందంటూ తాతాచార్యులు కట్టడి చేశాడట! ఆనాటినుండి ఆ గంగమ్మ ‘తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ’గా పేరుపొంది ప్రధానగ్రామదేవతగా మొక్కులందుకుంటున్నది.

భక్తకవయిత్రిగా పేరుపొందిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కూడ తిరుపతిలోని ఈ గ్రామదేవతలను ఘనంగా ఆరాధించి, తన రచనల్లోనూ పేర్కొంది. ‘జలక్రీడావిలాసం’ అనే యక్షగానంలో–చిలిపికృష్ణుడు తన అల్లరిపనులతో గోపికలను ఆట పట్టిస్తుంటాడు. ఒకప్పుడు అల్లరికన్నయ్య తేళ్లను







పట్టుకొని గోపికలకు కుట్టిస్తాడు. అంతే తేళ్లవిషం ఎక్కిన ఆ గోపికలు నొప్పి! నొప్పి! అంటూ చిందు లేస్తుండగా ఆ గోపికల అత్త, కోపంతో అంతా నటన అంటూ అరుస్తుంది. లేదత్తా ఇదంతా అల్లరి కృష్ణుడు చేసిన పని అంటూ తమ బాధను అత్తలదగ్గర వ్యక్తం చేస్తారు– గోపికలు. వెంటనే అత్త తన చేతిలో విభూతిని పట్టుకొని ఇలా మంత్రిస్తుంది.

"ధూ! మాయలమల్లీ! మళయాళ భగవతీ! నందవర చౌడేశ్వరీ! నారాయణం ఆమ్నాయాక్షీ! పరమేశ్వరీ! శివకంచి ఏకామ్రేశ్వరీ! జంబుకేశ్వరాఖిలేండశ్వరీ!కాళహస్తీశ్వర జ్ఞానాంబ! భక్తజనావలంబ! సద్గుణకదంబ! మదంబ! చిదంబరేశ్వర శివ శంకరీ! శ్రీశైలభ్రమరాంబ! కాలభైరవ! గణేశ్వరా! కోళాలమ్మా! కోల్లాపురెమ్మా! తాళ్లపాక గంగమ్మా! తాతయ్యగుంట గంగమ్మా! మీకు మ్రొక్కెద. ఈ కులుకులాడి(ల) సళుకుదించుడు. తరి గొండ నరసింహుని తోడే! నాకు జెప్పిన గురు పాద మాన! దిగు, దిగూ!" అంటూ తేలువిషాన్ని దిగమని మంత్రిస్తూ తేలుకుట్టిన చోట విభూతిని రాస్తుంది– గోపికల అత్త! అంతే! తేలువిషం దిగిపోయేదట! ఈ తేలుమంత్రంలో ప్రసిద్ధమైన క్షేత్రాల్లో వెలసిన దేవతలసరసన తిరుపతి గంగమ్మలను ఇద్దరిని పేర్కొనడంలో వీరు ఎంత మహిమగల దేవతలో స్పష్టమౌతున్నది.

తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక గంగమ్మలతో పాటు, తిరుపతి పట్టణంలో ఆయాచోట్ల అంకాళమ్మ, వేషా లమ్మ, ముత్యాలమ్మ, నేరెళ్లమ్మ మున్నగు శక్తి దేవతలున్నారు. అక్కాచెల్లెళ్లుగా వ్యవహరింపబడే వీరందరిపుట్టిల్లు తిరుపతికి సమీపంలోని అవిలాలగ్రామం. తిరుపతి గంగజాతర సందర్భం లోనే వీళ్ళందరికీ జాతర జరుగుతుంది. అవిలాలనుంచే వీరికి పసుపుకుంకుమలు సారెగా సమర్పింపబడతాయి.

తిరుపతి గంగమ్మజాతర ప్రతిఏటా తమిళమాసం చిత్రి నెలలో చివరిమంగళవారంనాడు జరుగుతుంది. అంటే తెలుగు వైశాఖమాసంలో (మే నెల) వస్తుంది. ఈ చివరి మంగళ వారానికి ఎనిమిదిరోజులు ముందునుంచే జాతర సంరంభం ప్రారంభమౌతుంది. అంటే జాతర జరిగే మంగళవారానికి ముందు మంగళవారం రాత్రి 'గంగజాతర!' ప్రారంభం అంటూ పురవీథుల్లో చాటింపు వేస్తూ పొలి చల్లుతారు. అంటే మరునాడు బుధవారం నుండి ఏడురోజుల పాటు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండుపూటల వేషాలు వేసి 'వేషాలమ్మ' గుడినుండి ప్రారంభించి, ఊరంతా తిరుగుతూ చివరకు తాతయ్యగుంట గంగమ్మ దగ్గరికెళ్లి మొక్కులు చెల్లించుకొంటారు. గంగమ్మజాతర ప్రారంభమైన తర్వాత ఈ పురప్రజలు తిరుపతిని, విడిచి వెళ్ళరు. ఒక వేళ తప్పనిసరిగా వెళ్ళినా జాతరలోపలే తిరిగి వచ్చేస్తారు.

శ్రీ వేంకటేశ్వరునిచెల్లెలు గంగమ్మ పూర్వం ఒక రాక్ష సునితో ఏడురోజులపాటు ఏడు వేషాలతో హోరాహోరి యుద్ధం చేసిందనీ, చివరిరోజువాణ్ణి సంహరించిందనీ, అందుకు నిదర్శ నమే నేటి గంగజాతర వేషాల వేడుకలనీ పెద్దలమాట! అందుకు పూర్వం రాక్షసుని వేషం వేసిన వాణ్ణి బండిమీద ఊరేగిస్తూ పొలిమేరవరకు తరిమికొట్టి చంపినట్లుగా చేసి వచ్చేవారనీ, పూర్వం గజిట్‌లో తెల్పబడింది. ఇప్పుడు ఈ రాక్షసునివేషం ప్రచారంలో లేదు.

ఈ వేషాలన్ని గంగమ్మ ధరించిన రూపాలకు ప్రతీ కలగా, ఉన్నందువల్ల ప్రతివేషంలోను స్త్రీత్వమే గోచరిస్తుంది!

మారుతున్న కాలంతో పాటు ఎన్ని ఆచారవ్యవహారాలు మారినా, తిరుపతి ప్రజల్లోమాత్రం నాటికీ, నేటికీ గంగమ్మ ఎడల భయమూ, భక్తీ ఏ మాత్రం సడలలేదు. ప్రాచీన వేషాలు ఆడంబరాలు, ఆర్భాటాలు తగ్గినా, మొక్కులు చెల్లించడం, వరపడడంవంటి వాటిల్లో ఏమాత్రం విశ్వాసాలు సడలలేదని చెప్పవచ్చు. శ్రీ వేంకటేశ్వరుని సోదరి అయిన తిరుపతి గంగమ్మ కొలిచినవారికులదైవం! ఆ అమ్మలగన్న అమ్మ ఆర్తుల పాలిట ఆనందవల్లి! భక్తులపై అమృతజల్లులు కురిపించే దయా స్వరూపిణి తిరుపతి గంగమ్మతల్లి!








ధారావాహిక - 2

# శ్రీమద్భగవద్గీత

- శ్రీ కుప్పా విశ్వనాథశాస్త్రి

*గత సంచిక తరువాయి భాగం...*

మానవులు తపస్సు అంటే శరీరాన్ని ఎంత కష్టపెట్టుకోవటానికైనా ఇష్టపడతారట. కానీ, దానం చెయ్యటానికి మాత్రం ఇష్టపడరట. చేతిలో రూపాయిలు పెట్టుకున్నారు- దొంగ వచ్చి నీవు ఇస్తావా? నిన్ను కొట్టనా? అంటే ఒక దెబ్బకొట్టు తినేసి పారిపోతానంటాడు తప్ప ఈ డబ్బుమాత్రం అక్కడ పారేసి పోడు. డబ్బుల మీద అంత ధ్యాస ఉంటుంది మానవులకు. కాబట్టి మానవులకుండే పిసినారితనాన్ని, డబ్బు మీద ఉండే కాంక్షను దృష్టిలో పెట్టుకొని దత్త అంటే దానం చెయ్యండి అని తీర్మానం చేశారు. దీన్ని మానవులందరు అర్థం చేసుకున్నారు.

మరి మిగతా రెండు 'ద' ల మాటేమిటి? అని అంటే దేవతలకు, రాక్షసులకు మనకేం సంబంధంలేదు. ఒక 'ద' చాలు మనకు అని మానవులలో కొంతమంది తీర్మానం చేసుకున్నారు. అయితే కొంతమంది మహర్షులు సమావేశమయ్యారు. ప్రజాపతి వారంతటి వారు 'ద ద ద' అని మూడు 'ద' లు చెబితే మనం ఒక 'ద' కు అర్థం చెప్పుకుంటే ఎట్లాగా? మూడు 'ద' లకు అర్థం చెప్పుకోవాలి గదా! ఆయన ఒక 'ద' నే చెప్పదలచుకుంటే దేవతలను పిలిచి విడిగా 'ద' అనేవాడు. మనుష్యులను పిలిచి 'ద' అనేవాడు. అలాగే రాక్షసులను పిలిచి 'ద' అనుండేవాడు లేదా ముగ్గురిని పిలిచినా కాస్త సభా సౌకర్యంకోసం ఒకేసారి 'ద' అనాలి. మరి 'దదద' అని మూడు సార్లెందుకన్నాడు?

అందులో ఏదో అభిప్రాయం. ఇది ఒక్క దేవతలకో, ఒక్క రాక్షసులకో ఉద్దేశించిన ఉపదేశం కాదు. మనుష్యులకు మనకే ఉద్దేశించి ఉపదేశం చేసిందే! దేవతలకు ఉపదేశం ఏమిటి? రాక్షసులకు ఉపదేశం ఏమిటి? అని మనకు అక్కరలేదు. మనకు మహర్షులు చేసిన విచారమిదే! మనం మహర్షులం- మనం మనుష్యులం. కాబట్టి మనకే ఉపదేశం చేశాడు.

ఏమని ఉపదేశం చేశాడు?

'దామ్యత' మీరు అహం కారం జోలికి పోబోకండి. 'దత్త' దానాలు బాగా చేయండి. కావలిసినంత మేర మాత్రమే, పూర్తిగా కాదు. 'దయత్వం' దయతో ఉండండి మరి మూడు ఉపదేశాలు చేయాలి అంటే ఈ మూడు లక్షణాలు మనలో ఉండాలిగదా, దేవతల లక్షణాలూ ఉండాలి. రాక్షసుల లక్షణాలూ ఉండాలి. అలాగే మనుష్యుల లక్షణాలూ ఉండాలి. అప్పుడే గదా ఈ ఉపదేశాన్ని మనం గ్రహించుకోగలిగింది.

మనలోకూడ దేవతల స్వభావాలు ఉన్నాయి. మనలో మంచి సద్గుణాలు ఉన్నాయి. 'పాజిటివ్' ఆలోచనలు ఉన్నాయి. అలాగే మనలో రాక్షసులు గూడ దాగివున్నారు. రాక్షసభావనలు కొంచెం క్రూరమైనభావనలు. అవి కొంచెం మనలో కూడ ఉన్నాయి. అలాగే వ్యతిరేకఆలోచనలు ఉన్నాయి. మానవ సహజమైన కొన్నిగుణాలు ఉన్నాయి. మనలోనే దేవతల గుణాలూ ఉన్నాయి. రాక్షసుల గుణాలూ ఉన్నాయి. మానవుల గుణాలు కూడా ఉన్నాయి.

ఇంకా మనం సరిగ్గా చెప్పుకోవాలంటే దేవతలు అనే వాళ్లు ఎలా పుడతారంటే-కేవలం పుణ్యకర్మలు చేసుకుంటే దేవతలుగా పుడతారు. కేవలం పాపకర్మలు చేసుకుంటే రాక్షసులుగా పుడతారు. మరి మనుష్యులుగా ఎవరు జన్మిస్తారు? అంటే ఈ పాపాలు, పుణ్యాలు కలసిపోతే మనుషులుగా జన్మిస్తారు. ఎప్పుడైతే పాపాలు, పుణ్యాలు కలిసిపోయి ఉంటాయో అప్పుడు అన్ని గుణాలూ మనలో ఉంటాయి. అటు దేవతల సద్గుణాలు, ఇటు రాక్షసుల దుర్గుణాలూ కూడా కొద్దిగా ఉంటాయి. వినటానికి కఠోరంగా ఉన్నా మనం ఒప్పుకోవలసిందే! ఈ రెండు కాని సాధారణగుణాలు కొన్ని ఉంటాయి. మనలో లేకుండా ఏమీ లేవు.

ఈ దేవతలగుణాలకు, రాక్షసులగుణాలకు యుద్ధం నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఇటువంటి యుద్ధం జరిగినప్పుడు దేవతల గుణాలు గెలిచినప్పుడు గూడా జాగ్రత్తగా ఉండాలి. రాక్షసగుణాలు గెలిచినప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. మనుష్యుల గుణాలు గెలిచినప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. మనుష్యుల గుణాలు గెలిచినప్పుడు ఇంతకంటె పైకి వెళ్లే ప్రయత్నం చేసుకోవాలి. ఇది ప్రజాపతి ఉపదేశం. ఈ విషయాన్ని మహర్షులందరు బాగా అర్థం చేసుకుని 'దామ్యత' 'దత్త' 'దయత్వం' అని మూడు 'ద' లకు వ్యాఖ్యనం చేసి ప్రచారం చేశారు. మనందరికి బాగా పరిచయం ఉన్నదే ఈ స్వభావం. మానవులు సద్గుణాల రాశులు.

*(ఇంకా ఉంది)*




# భక్తసులభుడు పెంచలకోన నరసింహుడు

- శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

భక్తుడైన ప్రహ్లాదుడిమాటను నిజం చేస్తూ దుష్టదానవుడైన హిరణ్యకశిపుడిని అంతమొందించేందుకు స్తంభం నుంచి సింహంతల, నరశరీరంతో ఆవిర్భవించిన శ్రీనరసింహస్వామి శ్రీపెనుశిలనరసింహస్వామి పేరుతో శ్రీఆదిలక్ష్మీదేవి సమేతంగా కొలువుదీరిన దివ్యక్షేత్రం **'పెంచలకోన'.**

అటవీప్రాంతమైన ఈ ప్రాంతంలో పూర్వం చెంచులు అధికసంఖ్యలో నివసిస్తూ ఉండేవారు. కనుక, దీనికి 'చెంచుల కోన' అనే పేరు ఉండేది. అది కాలక్రమేణ మారి 'పెంచల కోన'గా స్థిరపడింది.

కాగా, స్వామివారు 'పెనుశిల' రూపంలో కొలువుదీరిన క్షేత్రం కనుక దీనికి 'పెనుశిలకోన' అనే పేరు ఏర్పడి వాడుకలో 'పెంచలకోన' అయిందని కూడా అంటారు.

## చెంచులక్ష్మిని చూసి....

స్తంభం నుంచి ఉగ్రరూపంలో ఆవిర్భవించి హిరణ్యకశిపుడిని అంతమొందించిన నరసింహస్వామి అదే ఉగ్రత్వంతో వివిధప్రాంతాలలో పర్యటిస్తూ-ప్రస్తుత క్షేత్రప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ చెంచుగూడెం ఉండేది. ఆ గూడెంలో నరసింహస్వామికి చెంచులక్ష్మి ఎదురుపడింది. చెంచులక్ష్మిని చూస్తూనే స్వామివారిలో ఉగ్రత్వం తగ్గింది. ఆమెను వివాహం చేసుకోవాలని భావించాడు. అక్కడ ఉన్న చెంచులనాయకుడికి కప్పం చెల్లించి వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమెను ఆలింగనం చేసుకుని అంటే పెనవేసుకుని అక్కడే శిలారూపంలో ఉండిపోయినట్లు స్థలపురాణం.

## కణ్వమహర్షి ఆరాధించిన దేవుడు...

స్వయంభువుగా కొలువుదీరిన స్వామివారిని కణ్వ మహర్షి ఆరాధించినట్లు కథనం. పూర్వం ఈ ప్రాంతంలో కణ్వమహర్షి ఆశ్రమాన్ని నిర్మించుకుని తపస్సు, యజ్ఞయాగాలు నిర్వహిస్తూ ఉండేవారు. విశ్వామిత్రునికి, మేనకకు జన్మించిన శకుంతలను కణ్వమహర్షి తన ఆశ్రమంలోనే పెంచి పెద్ద చేశాడు.

కనుక, శకుంతల, దుష్యంతులగాథ కూడా ఈ ప్రాంతంలోనే జరిగిందని చెప్పబడుతుంది. ఇక్కడికి సమీపంలో ఉన్న 'కండలేరు' అనే నది కణ్వమహర్షి పేరుతో ఏర్పడిందేనని చెప్పబడుతోంది. ఈ నదికి పూర్వం 'కణ్వ ఏరు' అనే పేరు ఉండేది. అది తర్వాతి కాలంలో కండలేరు అయింది.

కణ్వమహర్షి, పెంచలకోన ప్రాంతంలోని స్వామివారికి నిత్యం పూజలు చేస్తూ ఉండేవాడు. ఆయన తర్వాత స్వామివారు పూజలు, పునస్కారాలు లేకుండా ఉండిపోయాడు. ఆ తర్వాత సుమారు ఎనిమిది వందలసంవత్సరాల క్రితం స్వామివారు తిరిగి వెలుగులోకి రావడం వెనుక ఓ గాథ ఉంది.

శ్రీనరసింహస్వామివారు 'పెనుశిల' రూపంలో కొలువుదీరిన క్షేత్రం పెంచలకోన

## పశువులకాపరికి దర్శనం

ఈ క్షేత్రానికి సుమారు ఆరుకిలోమీటర్లదూరంలో 'గోనుపల్లె' అనే గ్రామంనుంచి కొంతమంది ప్రతిరోజు పశువులను మేతకోసం కోన ప్రాంతానికి తోలుకుని పోయేవారు. ఉదయాన్నే తోలుకుని వెళ్లి, తిరిగి సాయంత్రానికి ఇంటికి వచ్చేవారు.

ఇలా ఉండగా ఒకరోజు ఒక పిల్లవాడికి ఒక వృద్ధుడు కన్పించి రెండుశిలలను చూపించి ఒకటి స్వామివారిదనీ, మరొకటి అమ్మవారిదనీ చెప్పి, నీవు వెను తిరిగి చూడకుండా వెళ్లి, ఇక్కడ ఆలయం కట్టించి, పూజలు చేయుమని, గ్రామస్థులకు తెలుపుమని చెప్పాడు.

వృద్ధుడిమాటలు విని ఆశ్చర్యానికి లోనైన బాలుడు వెంటనే గ్రామానికి బయలుదేరాడు. కొంతదూరం వెళ్లాక అనుమానం వచ్చి వెనుతిరిగి చూచాడు. సాయంత్రం పిల్లవాడు లేకుండా పశువులు ఇల్లు చేరడంతో పిల్లవాడు ఏమైపోయినాడని భయాందోళనలకు లోనైన గ్రామస్థులు పిల్లవాడిని వెదుకుతూ కోనకు చేరారు. ఎక్కడా కనిపించపోవడంతో నిరాశతో తిరిగి గ్రామానికి బయలుదేరారు.

ఆ సమయంలో "నేను నరసింహస్వామిని శిలా రూపంలో ఉన్నాను. నాకు ఆలయం కట్టించి పూజలు చేయండి. మేలు జరుగుతుంది. మీ పిల్లవాడు సమీపంలో శిలగా మారిపోయి ఉన్నాడు. అతనికీ పూజలు చేయండి" అనే మాటలు అశరీరవాణి నుంచి వినిపించాయి.

దీనితో గ్రామస్థులు వెదికి స్వామివారిశిలను గుర్తించి ఆలయాన్ని నిర్మించి పూజలు చేయడం ప్రారంభించినట్లు స్థలపురాణం. చాలాకాలంవరకు శనివారం మాత్రమే గ్రామస్థులు కోనకు చేరుకుని పూజలు నిర్వహించేవారు. మిగతారోజుల్లో స్వామివారికి తోడుగా ఒక సింహం ఉండేదని చెబుతారు. కాగా, సుమారు ఐదుదశాబ్దాలనుంచి నిత్యపూజలు నిర్వహిస్తూ ఉన్నారు.

## అందమైన ప్రకృతితో కనువిందు చేసే క్షేత్రం

చుట్టూ ఎత్తైన కొండలు, కొండలపై ఆకాశాన్ని అంటే పచ్చనిచెట్లు, సెలయేర్లు, ఇలా అందమైన ప్రకృతి దృశ్యాల మధ్య పెంచలకోనక్షేత్రం భక్తులకు కనువిందు చేస్తూ దర్శనమిస్తుంది. స్వామివారి ఆలయం ఉత్తరాభిముఖంగా ఉంది. ఆలయంలో ప్రవేశించేందుకు ఉత్తరం, తూర్పుద్వారాలు ఉన్నాయి. ఉత్తరద్వారం ప్రధానద్వారం. ఈ ద్వారంపై ఐదు అంతస్తుల గోపురం దర్శనమిస్తుంది. ఈ ద్వారం గుండా ఆలయప్రాంగణంలోనికి ప్రవేశించగానే ప్రధానఆలయం దర్శనమిస్తుంది.

ప్రధాన ఆలయానికి ఎదురుగా బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడాళ్వారు మండపం ఉన్నాయి. ధ్వజస్తంభంవద్ద దీపాలు వెలిగించి, స్వామివారికి మొక్కులు సమర్పిస్తుంటారు. ప్రధాన ఆలయం ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది.

ప్రధానగర్భాలయంలో శ్రీనరసింహస్వామివారు కొలువుదీరి ఉన్నారు. రెండుశిలలు పెనవేసుకున్నట్లుగా స్వామివారు దర్శనమిస్తారు. స్వామివారికి రూపం లేదు. అయితే స్వామివారిముఖం, పాదాలకు కవచాలు ఉంచి పూజలు చేస్తారు. అభిషేకసమయంలో స్వామివారి నిజరూపాన్ని దర్శనం చేసుకోవచ్చు. కాగా, స్వామివారిని ఛత్రవటనరసింహస్వామి అనీ, నవనారసింహక్షేత్రాల్లోని ఒకరు అని ప్రసిద్ధి. స్వామివారి ఆలయం వెనుక ఉన్న కొండ ఛత్రం (గొడుగు) మాదిరి ఉండడం వల్ల స్వామివారిని ఛత్రవటస్వామి అని పిలుస్తారు. ఆలయ ముఖమండపంలో స్వామివారల ఉత్సవమూర్తులను దర్శించుకోవచ్చు.

స్వామివారిఆలయానికి కొద్దిదూరంలో స్వామివారి దేవేరి శ్రీఆదిలక్ష్మీ అమ్మవారుగా కొలువుదీరిన ఆలయం ఉంది.






అభిషేకసమయంలో పెంచలకోన నృసింహస్వామివారి నిజరూపాన్ని దర్శించవచ్చు

తూర్పు అభిముఖంగా ఉన్న ఆలయం ప్రదక్షిణపథంతో కూడిన ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. ప్రధానగర్భాలయంలో అమ్మవారు స్థానకభంగిమలో నిలుచుని కొలువుదీరి దర్శనమిస్తుంది. స్వామివారిముందు ఒక చిన్న శిల ఉంది. అది అమ్మవారి స్వయంభూమూర్తి అనీ, తర్వాతి కాలంలో అమ్మవారిమూర్తిని ప్రతిష్ఠించినట్లు పెద్దలంటారు. కాగా, చెంచులక్ష్మితో స్వామివారు ఉండడం చూచిన లక్ష్మీదేవి అలిగి, కొంతదూరంలో ఇక్కడ కొలువుదీరినట్లు కథనం.

స్వామివారిఆలయానికి సమీపంలోని ఆలయంలో క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామివారు కొలువుదీరి ఉన్నారు.



ఆలయ సమీపంలో పుష్కరిణి ఉంది. రెండు కిలోమీటర్ల దూరంలో గొల్లబోయస్వామి (పశువులకాపరి) ఆలయం ఉంది.

## సంతానప్రదాయకుడు

నరసింహస్వామి వరపడినంతనే సంతానం ప్రసాదించే దేవుడుగా పేరు పొందాడు. సంతానంలేని స్త్రీలు ఈ క్షేత్రానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని వరపడతారు. అంటే స్నానం ఆచరించి, తడిబట్టలతో క్షేత్రంలో సాష్టాంగనమస్కారం చేస్తూ పడుకొంటారు. దీనినే "వరపడడం" అని అంటారు. ఈ విధంగా భక్తులు గంటలకొద్దీ ఉంటారు. ఇలా వరపడిన వారికి శీఘ్రంగా సంతానం కలుగుతుందని విశ్వాసం. కడప, నెల్లూరుజిల్లాల్లో పెంచలయ్య, పెంచలమ్మ, నరసింహారావు, నరసయ్య వంటి పేర్లు అధికంగా ఉండడం అందుకు నిదర్శనం. అలాగే భూత, ప్రేత, పిశాచబాధలతో బాధపడేవారు ఈ క్షేత్రం చేరుకుని, స్వామివారిని పూజిస్తే ఆ బాధలు తొలగిపోతాయని విశ్వాసం.



## ఆలయచరిత్ర

సుమారు 800 సంవత్సరాల క్రితం గ్రామస్థులు కేవలం గర్భాలయాన్ని నిర్మించి, చిహ్నాలు చేసేవారు. 1959వ సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వ దేవదాయశాఖ ఆలయపాలనను స్వీకరించింది. అప్పటి నుంచి ఆలయాభివృద్ధి ప్రారంభమైంది. 1990వ సంవత్సరం తర్వాత భక్తుల సహకారంతో ఆలయం సర్వాంగసుందరంగా తీర్చిదిద్దబడింది.

## పూజలు, ఉత్సవాలు

ప్రతిరోజూ పూజలు జరిగే పెంచలకోన శ్రీపెనుశిల నరసింహస్వామివారికి రోజూ నిత్యకల్యాణోత్సవం, ప్రాకారోత్సవాలను నిర్వహిస్తారు. ప్రతిసంవత్సరం వైశాఖమాసంలో నరసింహజయంతి సందర్భంగా వైశాఖశుక్లపక్షదశమి మొదలు వారంరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. వివిధ వాహనసేవలు, రథోత్సవం ప్రత్యేక కల్యాణోత్సవాలను నిర్వహిస్తారు. ధనుర్మాసంలోనూ, దేవీనవరాత్రులు, రథసప్తమి సందర్భంగా ప్రత్యేకపూజలు, ఉత్సవాలూ జరుగుతాయి.

## ఇలా చేరుకోవచ్చు...

ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలో నెల్లూరు నుంచి 75, రాపూరు నుంచి 28, గూడూరు నుంచి 67, కడపనుంచి 140, రాజంపేట (కడపజిల్లా) నుంచి 90, బద్వేలు (కడపజిల్లా) నుంచి 110, తిరుపతి నుంచి 115 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెంచలకోనకు నెల్లూరు, రాపూరు, గూడూరు, కడప, రాజంపేట, బద్వేలు నుంచి విరివిగా బస్సు సౌకర్యాలు ఉన్నాయి.

శ్రీవేంకటేశ్వరలీలలు



# స్వామిని చూడాల్సింది కళ్లతో కాదు...

శ్రీ దేవరకొండ శ్రీనివాస విజయప్రకాష్

స్వామి అనుగ్రహం, అనుమతి లేనిదే కొండకు ఎవరూ రాలేరని నా నమ్మకం. స్వయంగా నా విషయంలో నిరూపణ అయింది కూడా. ఏటా స్వామిని కుటుంబంతో సహా దర్శించు కోవటం నాకు అలవాటు. కిందటేడాదికూడా అలాగే వచ్చాను. అయితే ఈసారి స్వామి కరుణ నాకు లేదు.

ఏటా నేను తిరుమలకు వచ్చే ముందుగానే స్వామి దర్శనానికి సంబంధించిన టిక్కెట్లు, ఇతర బస ఏర్పాట్లు అన్నీ చూచుకుని బయల్దేరతాను. స్వామికి ముందుగానే మనవి చేసుకుంటాను. "స్వామీ! నీ దర్శనభాగ్యం కలిగించు" అంటూ మొక్కుకుంటాను. కానీ మూడు నాలుగేళ్ళ క్రితం ఎందుకో గానీ నేనలా చెయ్యలేదు. బంధువుల కారు దొరికిందని బయల్దేరాను. ఎలాగైనా దర్శనం దొరుకుతుందని పిచ్చినమ్మకం. నా అలవాటు ప్రకారం యాత్రకు వచ్చేముందు స్వామికి నమస్కారం చేసుకోలేదు. కావాలని కాదు, కానీ ఎందుకో అప్పుడలా ప్రవర్తించాను.

తిరుపతికి చేరుకోగానే దర్శనం ప్రయత్నాలు ప్రారంభించాను. ఒకటా... రెండా... చాలా ప్రయత్నాలు చేశాను. ఎంత ఖర్చు అయినా సరే అన్నాను. ఏ ఒక్కరూ టిక్కెట్లు ఇప్పించలేదు. సిఫార్సులకోసం ప్రయత్నించాను. అవీ సఫలం కాలేదు.

కొండెక్కిన తర్వాత ప్రయత్నం చేయొచ్చు. వెళ్దాం అనుకున్నా. కానీ... చుట్టుపక్కల అందరూ వద్దంటూ వారించారు. ఏ భ్రమలో ఉన్నానో. వారిమాట విని తిరిగి వెనక్కి ప్రయాణం కట్టాను. ఆ క్షణం నాలో కలిగిన ఆవేదన అంతా ఇంతా కాదు. ఎవరికీ చెప్పుకోలేను. ఓ పక్క కుటుంబం అంతా నన్ను అదో రకంగా చూస్తున్నారు. ఆ మానసికవేదన అంతా ఇంతా కాదు. ఎందుకిలా జరిగిందంటూ ఒకటే ఆలోచన. మర్నాడు ఇంటికి చేరుకున్నాం. శరీరమైతే కదులుతోంది కానీ నా మనసుమాత్రం పరాకుగానే ఉంది. స్వామిదర్శనం కాలేదన్న బాధ నన్ను విడిచి పెట్టటం లేదు. ఇంట్లో అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు.

నేనూ యాంత్రికంగానే పనులు చేస్తున్నాను. సాయంకాలం ఇంటికి వచ్చి స్నానం చేసి వసారాలో కూర్చున్నా. కొద్ది కొద్దిగా చీకటి ముసురుకుంటోంది. మరీ పట్నం, మరీ పల్లె కాని ఊరు మాది. వీధి అరుగు మీద కూర్చుని ఎవరో మాట్లాడుకుంటున్నారు.

గుడికి వెళ్ళటమంటే సినిమాకు వెళ్ళినట్లు కాదురా. అదొక ఆధ్యాత్మికయాత్ర. దైవాన్ని దర్శించుకోవాలన్న కోరికతో మనసు పులకించాలి. ఎప్పుడెప్పుడు స్వామిని చూస్తామా అని తపించాలి. గుడికి వెళ్ళాక కళ్ళతో కాకుండా మనసుతో స్వామిని చూడాలి. అప్పుడు రా స్వామి దర్శనం కలుగుతుంది. నీ డబ్బు, నీ ఆర్భాటం స్వామికి అవసరం లేదురా....

చెంప మీద ఛెళ్ళున ఎవరో కొట్టినట్లు అనిపించింది. ఒక్కసారిగా కళ్ళు తిరిగాయి. జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకువచ్చాయి. నా తప్పు తెలిసింది. క్షణం ఆలస్యం చెయ్యకుండా వీధిలోకి పరిగెత్తాను. మాట్లాడిందెవరో చూద్దామని వెతికాను. ఎవరూ కనిపించలేదు. దారివెంట వెళ్తున్న ఒకరిద్దరిని అడిగినా వారూ తెలియదన్నారు.

ఇక నాకు అర్థమైంది. తిరుమల శ్రీవారే స్వయంగా నా గర్వం అణచటానికి వచ్చారని అర్థమైంది. కళ్ళు తెరచుకున్నాయి. "స్వామీ!" అంటూ ఒక్కసారిగా శ్రీవారిచిత్రపటం దగ్గర మోకరిల్లాను. లెంపలు వేసుకున్నాను. ఆ తర్వాత కొద్ది కాలానికే వస్తానని మొక్కుకుని, ఎప్పటిలాగే తిరుమలయాత్రకు బయల్దేరాను. అంతా సవ్యంగా సాగింది. కన్నులారా స్వామిని దర్శించుకున్నాను. శ్రీవేంకటేశుణ్ణి దర్శించుకోవాలంటే స్వామి అనుగ్రహం, అనుమతి తప్పనిసరి అని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అప్పటి నుంచి నా తోడు నీడ స్వామి వారే!



శ్రీవేంకటేశుణ్ణి దర్శించుకోవాలంటే స్వామి అనుగ్రహం, అనుమతి తప్పనిసరి



# ఆస్వాదించే వారికి ఆస్వాదించినంత!!

– శ్రీ వెంకట్ గరికపాటి

అపూర్వ సంకీర్తనలు సృజించి తెలుగుభాషకు, తెలుగుపాటకు ఎనలేని సేవచేసిన, పదకవితాపితామహుడు తాళ్లపాకఅన్నమయ్య. పల్లవి, చరణాలతో కూడిన తెలుగుపాటకు ప్రాణప్రతిష్ఠ చేసిన వాగ్గేయశిరోమణి. శ్రీవేంకటేశ్వరుని చరణారవిందాలకు సమర్పించిన పారిజాతాలా అన్న చందాన అన్నమయ్య సంకీర్తనలు జగత్ప్రసిద్ధిని పొందాయి.

సాక్షాత్తూ శ్రీహరి ఖడ్గమైన నందకాంశ సంభూతుడుగా వినుతికెక్కిన కారణజన్ముడు అన్నమయ్య. తన 16వ ఏట సంకీర్తనా రచనకు శ్రీకారం చుట్టిన అన్నమయ్య రోజుకు ఒక్క సంకీర్తన తక్కువ కాకుండా తన రచనాప్రస్థానాన్ని కొనసాగించాడు. సుప్రసిద్ధ నారసింహక్షేత్రమైన అహోబిలంలో వేదాంత విద్యను అభ్యసించిన అన్నమయ్య, నృసింహమంత్రంలోని 32 బీజాక్షరాలకు సంకేతంగానే 32,000 సంకీర్తనలు లిఖించాడు. భక్తి, సంగీత, సాహిత్యమిళితమైన అన్నమయ్యసంకీర్తనలు, పావనత్రివేణిసంగమంలా నేడు తెలుగునేలను నలుచెరగులా పునీతం చేస్తున్నాయి.

దేహాత్మేశ విచారాలను ప్రకటించే అధ్యాత్మ్యసంకీర్తనలను, జీవాత్మ, పరమాత్మల అమలిన ఐక్యాన్ని చాటే శృంగార సంకీర్తనలను వ్రాసిన ఘనుడు–అన్నమయ్య. దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుడు శరణాగతవజ్రపంజరుడని వినుతించాడు. అద్భుత భావగరిమకు, శృంగార రసోద్దీపకమై అన్నమయ్య సంకీర్తనలు భాసించినా, దేవదేవునిచరణారవిందాలకే ఆసంకీర్తనలను పదపారిజాతాలుగా సమర్పించిన భాగవతుడు అన్నమయ్య. ఆ సంకీర్తనలు అణువణువునా ఎంతో ఘనం. అనంతగుణ కల్యాణనిధియైన శ్రీవిభునిశృంగార రసరాజ్యాన్ని భక్తులకు ప్రేమతో పంచిన వాగ్దానం.. మరుని కన్నతండ్రి శృంగారలీలలను మరులూరించేలా వర్ణించినప్పుడు రసికసాహితీప్రియులు తన్మయానికి లోనవడమూ, ఆ చిన్మయరూపుని దివ్యలీలగానే మనం భావించాలి. సాళువ నరసింహరాయలు తనపై సంకీర్తనలు రచించమని ఆదేశించినప్పుడు "నరహరి నామము నుడిగిన జిహ్వ... నరులను పొగడగ ఓపదు జిహ్వ" అనడంలోనే సర్వాంతర్యామి సార్వభౌమత్వాన్ని అన్నమయ్య ప్రకటించిన విధం ఆశ్చర్యపరుస్తుంది. శ్రీవేంకటేశ్వరుణ్ణి పరతత్వమూర్తిగానే గాక, వివిధ ఆగమసంప్రదాయాల్లో నిలిచిన వైభవమూర్తిగానూ అన్నమయ్య కీర్తించాడు.

అన్నమయ్య ప్రజలభాషకు సాహిత్యగౌరవం కల్పించిన వాగ్గేయకారుడు. ఎన్నో జానపదసంకీర్తనలను సామాన్యులు పాడుకునేలా విందుగా, పసందుగా, లిఖించిన అన్నమయ్య జానపదులకు ప్రాణప్రదుడు. జోలపాటలు, సువ్విపాటలు, కోలాటంపాటలు, దంపుళ్లపాటలు.. ఇలా.. ఎన్నో.. ఎన్నెన్నో.. అద్భుతమైన జానపదగీతాలను సృజించి భక్తితో భజించాడు– అన్నమయ్య.

అన్నమయ్య సకలదేవతాస్వరూపాలలోనూ, తిరుమల విభుడైన శ్రీవేంకటేశ్వర దివ్యమంగళమూర్తినే దర్శించాడు, పలు క్షేత్రాల్లోని దైవాలను అమితంగా కీర్తిస్తూనే, వారికి "వేంకట" పదముద్రను అలంకరించి, తరించాడు. తిరుమలగిరి రాయనితో ఆ దైవాలకు అభేదాన్ని ప్రతిపాదించి సంకీర్తనాభేరిని వెలయించాడు. శ్రీనివాసునికి సాహితీకైంకర్యం చేసిన విధంగానే, తిరుమల దేవాలయంలోనూ ఎన్నోకైంకర్యాలను పునరుద్ధరించిన ఘనత, ఎన్నో ఉత్సవాలను ప్రారంభించిన ప్రత్యేకత తాళ్లపాక వంశానికి చెందుతుంది.

అన్నమయ్య సంకీర్తనలు అపారసాగరం. అందులో దొరికే మణులు, వజ్రాలు, వైఢూర్యాలు అనేకం. ఆ సాగరాన్ని మథించిన కొద్దీ అమృతం మరింతగా పుడుతూనే ఉంటుంది. అవేయసంగీత, సాహిత్యమధురిమలను పంచుతూనే ఉంటుంది, ఆనందాన్ని పెంచుతూనే ఉంటుంది. ఆస్వాదించే సహృదయులకు ఆస్వాదించగలిగినంత.. తెలుగుపాట నిలిచి ఉన్నంతకాలం చిరంజీవిగా నిలిచే చిరస్మరణీయుడు మన అన్నమయ్య.



# హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు

9

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం...*

**ఆనందతీర్థవరదే దానవారణ్యపావకే ।**
**జ్ఞానదాయిని సర్వేశే శ్రీనివాసేఽస్తు మే మనః ॥**

ఆనందతీర్థులకు వరప్రదుడును దానవారణ్యమునకు నిప్పును, జ్ఞానులకు జ్ఞానప్రదుడును, సకలజనులకు స్వామియును అయిన శ్రీనివాసుడు నా అంతరంగంలో ఎల్లప్పుడుండని.

ఈ విధముగా తీర్థప్రబంధమున శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థించిన శ్రీవాదిరాజస్వామివారు కన్నడంలో అసంఖ్యాక పదాలను రాగతాళబద్ధంగా పాడుకొనుటకు వీలుగా రచించారు. వాటిలో 'నారాయణననె మనవే' 'ఈతనే లోకగురు వేద విఖ్యాత' 'ఆంజనేయనే అమరవందిత' 'ముద్దు ముఖదా తనమ్మ', 'ఒందు బారి స్మరణే సాలదే' 'నెనెవె నను దిన నీల నీరద వర్ణన గుణరన్నన' 'ఈగలో ఇన్న్యావగలో' పదములు సుప్రసిద్ధాలు.

శ్రీవాదిరాజస్వాములవారి సంస్కృతంలోని దశావతారస్తుతి గంభీరపదబంధాలతో లయాత్మకమై ఉంది. శ్రీవాదిరాజస్వామివారి కన్నడ కీర్తనలలో శ్రీవేంకటేశ్వరుణ్ణి స్తుతించిన 'పానవమాడువేనునా। మనదణియ నామామృతవ' అనే పాటలో శ్రీనివాసుని నామం తేనెకన్న అత్యంతమధుర మైనదని, చెక్కెర కన్న మధురమైనదని, కదళి, ఖర్జూర, ద్రాక్షలకన్న తియ్యనైనదని, మీగడపాలకన్న మిన్న అయినదని – ఈతని నామాన్ని భజించిన సాయుజ్యం కలుగునని అంటారు.

'సారిదేనో నిన్న వేంకటరన్న' అనే మరొక కీర్తన సుప్రసిద్ధమైనది. ఇందులో అనాథుడను నేను నాకు బంధుడవు నీవు. నీవాడనని నాపై దృష్టినుంచి నీవుగా నాపై దయ చూపుము. నా తప్పులను ఎంచక హే దేవ! దేశ దేశాల్లోని భక్తులను అనుగ్రహించేటట్లు శేషాచలఘనుడవైన హేహయ వదన వేంకటేశ కాపాడుము' అని అంటారు.

శ్రీవాదిరాజ స్వాములవారు శ్రీవేంకటేశ్వరునిలో దశావతారాలను చూచి స్తుతించినారు.

**“మన్ని సో శ్రీవేంకటేశ మంజుగుణిపురవాస ॥**
**సన్నుత సద్గుణపూర్ణ సుప్రసన్న హయవదన ॥**
**దేశదేశదింద బందజనరిగెముదదింద**
**లేసినవరవీ వేనిరుత కావే ।**
**భాసుర మోహన వేష భానుకోటి సుప్రకాశ**
**శ్రీసతియప్రాణేశ శ్రీశ్రీనివాస ॥**

(దేశ దేశాలనుండి వచ్చే భక్త సముదాయానికి మోదంతో ఉన్నత వరాలను ఇచ్చి, కాపాడే హే దేవ! నీవు ప్రకాశించే సుందరుడవు. భానుకోటిప్రకాశుడవు. లక్ష్మీప్రాణ నాథుడవు శ్రీనివాసుడవు.)

*(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి

**:: 64 – సమాధానాలు ::**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 దా | శ | 2 ర | థి | | 3 ల | 4 వ | కు | 5 శ |
| వా | | ణం | | 6 మాం | | థ | | యు |
| 7 న | గ | | 8 అ | డ | వి | | 9 వా | న |
| లం | | 10 శ | | వి | | 11 అం | | ము |
| | 12 మ | ర | | | | 13 గ | ద | |
| 14 దా | | థి | | 15 వై | | ద | | 16 జ |
| 17 మో | దం | | 18 మి | థి | ల | | 19 కా | న |
| ద | | 20 కా | | వి | | 21 వే | | కు |
| 22 ర | క్క | సు | లు | | 23 వై | నా | కు | డు |

# నిత్యమై.. నిఖిలమై నిలిచి ఉంటాయి

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

భారతీయసంగీతంలో 'త్యాగరాజస్వామి' పేరు ప్రపంచప్రసిద్ధి. ముఖ్యంగా తెలుగుభాషలోనే సంగీతాత్మ ఉందని ఋజువుచేసిన ఈ మహానుభావుణ్ణి తెలుగువారందరూ గురుస్థానంలో ఆరాధించవలసినది. చిత్రమేమంటే సంగీత, సాహితీభావసంపద విశ్వజనీనం కనుకనే అన్యభాషలవారుసైతం ఆరాధించే ఔన్నత్యం తెలుగువెలుగైన త్యాగయ్యకు దక్కింది. వీరి సంగీతాన్ని ప్రపంచవేదికలపై విన్నాక, పాశ్చాత్యులు ఈ కీర్తనల్లోని తెలుగుభాషామాధుర్యానికి పరవశులై "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని కీర్తించారు.

సంగీతశాస్త్రమర్మాలను కీర్తనలలో ఒదిగించి, పొదిగించిన ఏకైక వాగ్గేయకారుడు–త్యాగయ్య. సంగీతాన్ని మోక్షవిద్యగా, యోగశాస్త్రంగా అధ్యయనంచేసి, నిరూపించి, ఆ ఫలాన్ని పొంది, ఇతరులకు పొందించిన మహాయోగి. సంగీతసాహిత్యాలను సుసంపన్నం చేసిన త్యాగయ్య లేత లేత పలుకులతో, లోతైన వేదాంతరహస్యాలను పల్లవింపజేసిన నాదబ్రహ్మ.

1767–1847 మధ్యకాలంలో జీవించిన వీరు సంగీతానికీ, భక్తిమార్గానికీ శాశ్వతోపకారాన్ని చేశారు.

'సంగీతజ్ఞానము భక్తి వినా సన్మార్గము గలదే మనసా!'
'అనురాగము లేని మనసున సుజ్ఞానము రాదు'
'మనసు స్వాధీనమైన ఆ ఘనునికి
మరి మంత్రతంత్రములేల?"…. ఇలా లెక్కలేనన్ని కీర్తనలు, త్యాగరాజు సాహితికి ఉపనిషత్తుల స్థానాన్నిచ్చాయి. రామభక్తిసామ్రాజ్యాన్ని కృతుల్లో ప్రతిష్ఠించిన త్యాగయ్య వాటిద్వారా మరో రామాయణాన్నే అందించారు.

'ఎందరో మహానుభావులు' 'సమయానికి తగుమాట లాడెనే', 'సొగసుచూడతరమా', 'తెరతీయగరాదా', 'ఎంత వారలైనా కాంతదాసులే'– ఇలా లెక్కలేనన్ని త్యాగయ్యపలుకులు తెలుగువారినోట నానుడులయ్యాయి.

రాగభావప్రపంచానికి రాజుగానే కాక, నిరాడంబర సాత్త్విక యోగజీవనానికి ఆదర్శంగా శోభిల్లిన అద్భుతవ్యక్తిత్వం త్యాగయ్యవైభవం.

తన నామం త్యాగయ్య అయినా, చివరిదశలో రామాజ్ఞవలన సన్న్యసించిన కారణంగా, ఆరాధనకు యోగ్యులై "త్యాగరాజస్వామి" అని గౌరవింపబడుతున్నారు. సంగీతకారులకు ఎంత ముఖ్యమో, భక్తులకు వేదాంతులకు అంతే ఆరాధ్యులు ఈ నాదయతి.

త్యాగయ్యగురించి పేర్కొంటూ "మానవుడు కాదు దేవుండు మనకు నిజము" అని చెళ్ళపిళ్ళవారు కీర్తించారు.

"నిధి చాల సుఖమా రామునిసన్నిధిసేవ సుఖమా?" అని కీర్తించిన త్యాగయ్య, కోరి దరిద్రాన్ని వరించారు.

తనవిద్యను వాత్సల్యంగా ఎందరో శిష్యలను పోషించి, బోధించి, సుస్థిరంగా నిలిపారు.

త్యాగయ్య నెలకొల్పిన గురుశిష్యసంప్రదాయం ఋషిపరంపరకు ప్రతీక. నిష్కపటమైన భక్తి, శుద్ధసాత్త్వికమనఃప్రవృత్తి, తపోమయ జీవనం– ఈ నాదయోగి బ్రతుకుతీరు. పటిష్ఠమైన పాండితీభరితసంగీతంతో పాటు, సామాన్యులు సైతం పాడుకోగలిగే సంకీర్తనలను చిన్నచిన్న మాటలతో సమకూర్చారు.

సంగీతం నిర్మలభక్తితో, ద్రాక్షారసంవంటి సౌలభ్యమాధుర్యంతో, స్వరశుద్ధంగా ఉండాలని నిర్దేశించి, లక్ష్యలక్షణాలను తన రచనలలో నిక్షిప్తం చేశారు.



సంగీత, సాహిత్య, వేదాంతశాస్త్రాల సారం త్యాగరాజకృతివైభోగం. సంస్కృతిపై అభిమానం కలవారు, అందునా తెలుగువారు కృతజ్ఞతతో స్మరించుకోదగిన ఆ మహాత్మునికి– ఈ జయంతి సందర్భంగా హృదయాంజలి.

గృహలక్ష్మి

# ఈ తిథికి ఎన్ని విశేషాలో...!

– శ్రీమతి జానపాటి మనస్విని

త్రికరణ శుద్ధిగా చేసే ఏ చిన్న పనైనా సరే అది భగవంతుడి అనుగ్రహాన్ని పొందుతుందని చెప్పటానికి ప్రతీకగా నిలిచే పండుగ అక్షయతృతీయ. వైశాఖశుద్ధ తదియకు అక్షయతృతీయ అని పేరు. వాడుకలో ఇది అక్ష తదియగా వ్యాప్తిలోకి వచ్చింది. ఈ రోజున చేసే పుణ్యం రవ్వంతైనా సరే అది కొండంత ఫలితాన్నిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. అందుకనే ఈ పండుగ అంతులేని ఆదరణ పొందింది.

క్షయం అంటే నాశనం అని అర్థం. క్షయం అనే పదానికి 'అ' అవ్యయం చేరితే అక్షయం అవుతుంది. అక్షయం అంటే క్షయం లేనిది, నాశనం కానిది అని అర్థం. ఈ ప్రకారం చూస్తే 'అక్షతదియ' రోజున చేసే పనులన్నీ క్షయం కాని ఫలితాన్నిస్తాయి. కేవలం నాశనం లేకుండా ఉండటమే కాదు. చేసిన పుణ్యకార్యం మరిన్ని ఎక్కువ రెట్లు ఫలితాన్నికూడా ఇస్తుంది. అందుకే అక్షతదియ రోజున ఏదో ఒక చిన్నపుణ్యకార్యమైనా చెయ్యాలని పెద్దలు చెబుతారు.

'త్రి' అనే సంస్కృత పదానికి తెలుగులో మూడు అని అర్థం. మూడు సంఖ్యను పూరించే స్థానం కలిగింది అనే అర్థంలో 'తీయ' అనే పదం కలిసి తృతీయ అనే శబ్దం ఏర్పడింది. ఇది సంస్కృత పదం. తృతీయ అనే సంస్కృత పదానికి తెలుగు రూపం తదియ. ఈ ప్రకారం అక్ష తృతీయ కాస్తా తెలుగులో 'అక్షతదియ'గా మారింది.

పురాణాల ప్రకారం వైశాఖమాసంలో వచ్చే శుద్ధ తదియకు మూడు ప్రత్యేకతలు ఉన్నాయి. అవి 1)బలరామ జయంతి. 2)సింహాచలం అప్పన్నస్వామి చందనోత్సవం. 3)త్రేతాయుగానికి మొదటిరోజు. ఇటువంటి అనేకప్రత్యేకతల కారణంగా "వైశాఖశుద్ధతదియ"కు పవిత్రత ఏర్పడింది. భవిష్యపురాణం ఈ పండుగకు సంబంధించిన అనేక విషయాలు, వ్రతాచరణకు సంబంధించిన విధివిధానాలను ఎంతో వివరంగా చెబుతోంది.

అక్షతదియ వ్రతాన్ని పెళ్ళికాని వారు ఆచరిస్తే అతిస్వల్పకాలంలో వివాహం జరుగుతుందని నమ్మిక. ఈ వ్రతాన్ని లక్ష్మీనారాయణుల్ని, గౌరీశంకరుల్ని ఉద్దేశించి చెయ్యాలి. అమ్మవారి ప్రతిమను మంటపంలో ఉంచి పూజించాలి. అమ్మవారికి బెల్లం, నెయ్యి, నూనె, కలకండ, ఉప్పు, ఆకుకూరలు, జీలకర్ర నివేదన చెయ్యాలి. పగలంతా ఉపవాసం ఉండి రాత్రికి ఉప్పు, కారం లేని పదార్థాలు భుజించాలి. తప్పనిసరిగా రాత్రివరకు మౌనం పాటించాలి. ఈ వ్రతాచరణం వల్ల శచీదేవి జయంతుణ్ణి పొందగలిగింది. అరుంధతి కూడా ఈ వ్రతాన్ని ఆచరించిన ఫలితంగానే సప్తర్షి మండలంలో స్థానం సంపాదించిం దని పురాణాలు చెబుతున్నాయి.

అక్షతదియరోజున ఉప్పును విసర్జించటంవల్ల అమ్మవారు సంతోషించి లావణ్యాన్ని, రూపసౌభాగ్యాన్ని ప్రసాదిస్తుం దని భవిష్యపురాణం చెబుతోంది. లక్ష్మీదేవితో పాటు గౌరీదేవికి కూడా ఈ రోజున విధివిధానంగా పూజలు చెయ్యాలి. ఈ రోజున సూర్యోదయానికి ముందే నిద్రలేచి, స్నానాదికార్యక్రమాలు పూర్తి చేసుకోవాలి. విష్ణుమూర్తిని ప్రార్థన చెయ్యాలి. ఈ రోజున దేవతలతో పాటు పితృ దేవతలనుకూడా ఆరాధించాలి. యథాశక్తిగా గోదానం, భూదానం, సువర్ణదానం, వస్త్రదానం చెయ్యాలి. ముత్త యిదువులు చిన్నికృష్ణునికి, గౌరీదేవికి డోలోత్సవం నిర్వహించాలి. అనంతరం ముత్తయిదువులకు, కన్యలకు సుమంగళ ద్రవ్యాలు, నూతనవస్త్రాలతో పాటు శనగలు వాయనం ఇవ్వాలి. దీనివల్ల దీర్ఘసుమంగళీయోగం కలుగుతుంది.

వైశాఖమాసం ఎండలు నెమ్మదిగా తీవ్రంగా పెరిగే సమయం కాబట్టి విసనకర్రలుకూడా దానం చెయ్యాలి.



అక్షతదియ రోజున ఏదో ఒక చిన్న పుణ్యకార్యమైనా చెయ్యాలి

ఈకాలంలో పండే మామిడి పండ్లుకూడా దానం చెయ్యాలి. కొన్నిప్రాంతాల్లో స్థానిక ఆచారాల ప్రకారం లడ్డూలు దానం చేస్తారు. పెరుగన్నం, పాదరక్షలు, ఛత్రం (గొడుగు), ఉదక కుంభం (నీటి చెంబు) కూడా దానం చేసే ఆచారం కొన్నిచోట్ల ఉంది. ఇటీవలి కాలంలో నీటికుండను దానం చెయ్యటానికి బదులుగా నీటికేంద్రాలు (చలివేంద్రాలు) ఏర్పాటుచేస్తున్నారు. మట్టిగ్లాసుల్లో నీటిని పాదచారులకు పంచితే ఆ నీటిలో ఎన్ని జలబిందువులు ఉంటాయో అన్ని సంవత్సరాలపాటు దివ్యలోకాల్లో జీవించే పుణ్యఫలితం దక్కుతుంది. భవిష్యపురాణం చెప్పిన ఈ దానాలన్నీ చేస్తే తర్వాతి జన్మల్లో ఉత్తమకుటుంబాల్లో పుట్టి, అన్నిభోగాలు అనుభవిస్తారు. పేరుప్రతిష్ఠలు కలుగుతాయి.

ఏదైనా కారణంవల్ల వైశాఖశుద్ధతదియరోజున వ్రతాన్ని ఆచరించలేకపోతే భాద్రపదశుక్లతదియ లేదా మాఘశుద్ధ తదియరోజుల్లోకూడా ఈ వ్రతాన్ని ఆచరించ వచ్చు. శక్తి ఉండి సంవత్సరంలో వచ్చే 12 శుద్ధ తదియ ల్లోనూ ఈ వ్రతాన్ని ఆచరించగలిగితే మాటల్లో వర్ణించలే నంత పుణ్యఫలితం కలుగుతుంది. ఆచారసంప్రదాయాల



ప్రకారం చూస్తే అక్షతదియరోజున వ్యవసాయం చేసేవారు తమ పొలాల్లో విత్తనాలు చల్లుతారు. గృహస్థులు కూర గాయల మొక్కలు నాటుతారు. మరికొంతమంది దాన ధర్మాలు చేస్తారు.

పూర్వం శాకల నగరంలో ధర్మాత్ముడైన ఓ వ్యాపారి ఉండేవారు. ఒక రోజున అతడికి బాగా దానం చెయ్యాలనే బుద్ధి కలిగింది. అనుకున్నదే తడవుగా తన దగ్గర ఉన్న వస్తువు లన్నీ చివరకు ఇంట్లోని వస్తువులు, ధాన్యాలతో సహా అన్నీ దానం చేశాడు. చివరకు కూరలు, పెరుగన్నం కూడా దానం చేశాడు. రేపటికి ఎలా అన్న ఆలోచన అతడికి కలగలేదు. భార్యాపిల్లలు వారిస్తున్నా వినిపించుకోలేదు. నిజానికి ఆ రోజు అక్షతదియ. కానీ అతడికి ఆ విషయం తెలియదు. తెలిసి చేసినా తెలియక చేసినా అక్షతృతీయ రోజున అమితమైన దానం చేసిన ఫలితంగా ఆ వ్యాపారికి తెల్లవారే సరికి కొన్నిరెట్లు ఎక్కువ వస్తువులు లభించాయి. అలా అతడు దానాన్ని తన చివరిరోజువరకు చేశాడు. అమితమైన దానఫలితంగా అతడు తర్వాతి జన్మలో కుశా వతి అనే నగరంలో ఉత్తమక్షత్రియవంశంలో జన్మించాడు. పూర్వజన్మజ్ఞాపకాలు ఉండటంతో అనేక యజ్ఞయాగాలు, దానాలు లెక్కకు మిక్కిలిగా చేశాడు. ఫలితంగా తర్వాతి జన్మలో అతడు వేదాధ్యయనపరుడైన ఓ సంపన్నబ్రాహ్మ ణుడి ఇంట్లో జన్మించాడు. ఆ జన్మలోనూ భూరిదానాలు చెయ్యటంతో అక్షయమైన పుణ్యలోకాల్లో శాశ్వతంగా నివసించే పుణ్యఫలితాన్ని పొందాడు. అక్షతదియనాడు చేసే దానాలు ఇంతటి సర్వోన్నతమైన పుణ్యాన్ని అందిస్తాయి.

ఈ రోజు చేసే ఏ చిన్నపుణ్యమైనా అనేకరెట్లు ఎక్కువ ఫలితాన్నిస్తుందనే నానుడివల్ల చాలామంది ఈ రోజున బంగారం కొనటానికి ప్రయత్నిస్తారు. చాలా మంది కొంటారు కూడా! అయితే దీనికి శాస్త్ర ప్రమాణం ఏదీ లేదు.

మొత్తంగా అక్ష తదియ పర్వదినం మనిషిని సత్కర్మల వైపు ప్రేరేపిస్తుంది. కర్మయోగిని చేస్తుంది. తనతో పాటు సమాజాన్నికూడా సత్కర్మల వైపు నడిపించే ధర్మబుద్ధిని కలిగిస్తుంది.

# కూర్చుని మాట్లాడుకుంటే సరిపోతుంది కదా!

- శ్రీ ఆర్.సి. కృష్ణస్వామి రాజు, 93936 62821

ఎర్రగుంటకోట రాజు ఎత్తిరాజులు ఇరుగుపొరుగు రాజ్యాలతో చీటికి మాటికి యుద్ధాలు చేసేవాడు. ఆస్తినష్టం, ప్రాణనష్టం జరిగి రాజ్యం అన్నివిధాలా వెనుకబడింది. కొత్తగా సరిహద్దుల సమస్య తలెత్తడంతో సిద్ధవటం రాజ్యంపై యుద్ధం ప్రకటించాడు. యుద్ధాలు చేసిచేసి అలసిపోయిన సైనికులు దిగులుచెందారు. సైనికుల కుటుంబాలు భోరుభోరున విలపిస్తూ యుద్ధం వద్దని రాజును కోరారు. అందుకు రాజు ఒప్పుకోలేదు.

జనం సేనాధిపతిని కలిసి యుద్ధం వద్దని రాజుకు చెప్పమని ప్రాధేయపడ్డారు. చూరు కత్తి తెగుతుందే కానీ చూపుకత్తి తెగుతుందా? నాలాంటివాడు చెబితే రాజు వింటాడా? అనుకుని పరిష్కారం కోసం సేనాధిపతి రకరకాలుగా ఆలోచించినాడు. చివరికి రాజుకు యుద్ధానికి ముహూర్తాలు నిర్ణయించే ఆస్థానసిద్ధాంతివద్దకు వెళ్లి విషయం చెప్పాడు. ప్రజలు యుద్ధానికి సిద్ధంగాలేరని రాజు మనసు మార్చమని కోరినాడు.

మొండివాడు రాజు కన్నా బలవంతుడని అంటారు. మనకి మొండిరాజు దొరికాడు అని సిద్ధాంతి గంటల కొద్దీ ఆలోచించ సాగాడు. ఇంతలో రాజు నుంచి పిలుపు వచ్చింది. ఎలాగోలాధైర్యం తెచ్చుకొని "ముహూర్తనిర్ణయానికి సైతం మంచి గడియలు లేవు. మూడురోజులతర్వాత ముహూర్తాన్ని నిర్ణయిద్దాం. అయితే ఈ మూడు రోజులూ మీరు సర్వశక్తి సంపన్నురాలైన పార్వతీదేవి పూజ చేయాల్సి ఉంటుంది. బ్రహ్మముహూర్తాన నిద్రలేచి ప్రాణాయామాలు చేసి మొదటిరోజు ఉదయం రాణి, రెండవరోజు రాకుమారుడు, మూడవరోజు రాకుమారి శయనమందిరాలకు వెళ్లాలి. నిద్రపోతున్నవారిని గంటపాటు గమనించాలి. తర్వాత స్నానం చేసి పూజలు చేయాలి" అని చెప్పాడు

అందుకు అంగీకరించిన రాజు మొదటిరోజు ఉదయం రాణి శయనమందిరం వెళ్లాడు. ప్రశాంతంగా నిద్రపోతున్న రాణి ముఖం కేసి చూశాడు. ఆమె చిన్నపసికందులా నిద్రపోవడం చూచి, ముచ్చటేసింది. ఆమెను అలాగే చూస్తూ ఉంటే రాజులో తెలియని అలజడి మొదలైంది. "అవును, వారం పదిరోజుల్లో యుద్ధం మొదలు కాబోతుంది కదా, నేను యుద్ధభూమిలో ఉన్నప్పుడు రాణి ఇంత ప్రశాంతంగా నిద్రపోగలదా" అన్న ఆలోచన గొంగళిపురుగులా మనసును తొలిచివేయసాగింది. ఆ రోజంతా రకరకాలుగా ఆలోచిస్తూ ఉండిపోయాడు. రాజు అదోలా ఉండటం సేనాధిపతి, సిద్ధాంతి గమనించారు

రెండవరోజు ఉదయం యువరాజు శయనమందిరం వద్దకు వెళ్ళాడు. నిండుపున్నమిలా వెలిగిపోతోంది యువరాజు ముఖం. గట్టిగా ముద్దు పెట్టుకుందామనుకున్నాడు. ఇంతలో ఒక చిన్న దోమ ఎగురుకొంటూ వచ్చి యువరాజు చెవివద్ద గింగిర్లు కొట్టసాగింది. కోపమొచ్చిన యువరాజు వెంటనే పిడికిలి బిగించి దోమను కొట్టి చంపడానికి చేయి ఎత్తాడు. అలికిడికి దోమ సర్రున ఎగురుకొంటూ వెళ్లిపోయింది. వెంటనే రాజుకు చిన్న అనుమానం మొదలైంది. 'దోమ రాకుమారుడిరక్తం తాగుతుందంటేనే భరించలేకపోయానే, రేపు యుద్ధంలో అటూ ఇటూ జరిగి జరగరానిది జరిగితే నేను తట్టుకోగలనా' అని ఆలోచించడం ప్రారంభించాడు. చిన్నగా అక్కడినుంచి వచ్చేశాడు. ఆ రోజుకూడా రాజు ముభావంగా ఉండటం సేనాధిపతి మరియు సిద్ధాంతి గమనించారు.

మూడవరోజు ఉదయం రాకుమారి మందిరానికి వెళ్ళాడు. రాకుమారి అమాయకముఖంతో మంచంమీద పడుకొని ఉంది. దుప్పటి మంచం కింద పడి ఉంది. రాకుమారి చలికి వణుకుతోంది. గబగబా వెళ్లి రాకుమారికి దుప్పటి కప్పాడు. 'బిడ్డ బాగోగులు చూడాల్సినవాడిని, సరైన సమయంలో సరైన వరుణ్ణి చూచి, రంగరంగ వైభవంగా పెళ్లి జరపాల్సిన వాడిని. రాకుమారి చలికి వణుకుతుంటేనే భరించలేక పోతున్నానే, పొరబాటుగా యుద్ధంలో ఓడిపోతే, నేనే లేకుండా పోతే, నా రాకుమారి శత్రుసైన్యంచేతికి చిక్కితే' అనే ఆలోచనలు వచ్చి గిలగిల లాడిపోయాడు.

బాధగా వచ్చి ఉద్యానవనంలో కూర్చొన్నాడు. సిద్ధాంతి తిన్నగా రాజు వద్దకు వచ్చాడు. "రాజా! ముహూర్తం ఖరారు చేయమంటారా" అని అడిగాడు. రాజు చిన్నగా తల ఎత్తి సేనాధిపతి వైపు చూస్తూ "యుద్ధం అవసరమంటావా సేనాధిపతీ? "అని ప్రశ్నించాడు. కోరిన కొండపైన వాన పడుతోందని గుర్తించిన సేనాధిపతి "గోటితో పోయేదానికి గొడ్డలెందుకు?" అని పెద్దలు ఎప్పుడో చెప్పారు కదా మహారాజా! ఇరుపక్షాలు కూర్చొని మాట్లాడితే సమస్య పరిష్కారమవుతుందేమో మహారాజా!" అని వినమ్రంగా చెప్పాడు. పోరు నష్టం- పొందు లాభం అని తెలుసుకున్న రాజు యుద్ధ ప్రతిపాదనను విరమించుకున్నాడు. నాయకులు యుద్ధానికి ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి, మంచిచెడ్డలు బేరీజు వేసుకొంటే యుద్ధాలనేవే ఉండవుకదా అనుకున్నాడు- సిద్ధాంతి.

పొరుగు రాజుతో జరిపినచర్చలు ఫలించడంతో యుద్ధం జరుగలేదు. దీంతో ప్రజలు పండుగ చేసుకున్నారు.

# ఆయుర్వేదం 'కరోనా'ను ఇలా నివారిద్దాం!

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

కంటికి కనిపించని అత్యంత సూక్ష్మాతిసూక్ష్మమైన క్రిమి కరోనా వైరస్. ఇలాంటి క్రిములు, బ్యాక్టీరియాలు, ఫంగస్‌లు వాటి ఉనికి, వ్యాప్తి, అవి మనకు కలుగజేసే ఇక్కట్లు, చికిత్సా విధానాలు ఇత్యాదులకు సంబంధించిన సమగ్రసమాచారం అత్యంత ప్రాచీన కాలంలోనే మన భారతీయ వాఙ్మయ, వేద, వైద్యగ్రంథంలో నిక్షిప్తీకరించినట్లు తెలుస్తోంది.

వ్యక్తులతో అతిసమీపంనుంచి మాట్లాడటం, కౌగిలింతలు, శరీర స్పర్శ, వ్యాధిగ్రస్తులు వదిలిన గాలిని పీల్చటం, మరీ దగ్గర దగ్గరగా కూర్చుని ఆహారం సేవించటం, ఒకేశయ్యపై శయనించటం, విశ్రమించటం, ఒకే స్థలంలో కూర్చోవటం, ఒకరి వస్త్రాలు, ఆభరణాలు మరొకరు వాడటం మున్నగు కారణాలవల్ల వ్యక్తినుంచి వ్యక్తికి కొన్ని రకాలవ్యాధులు సంక్రమిస్తాయని స్థూలంగా దీని అర్థం చెప్పుకోవచ్చు.

ఈ వ్యాధి సంక్రమించకుండా ఉండేందుకు మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటించటం, చేతులను సబ్బు లేదా శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటూ ఉండటం అత్యంతావశ్యకం. పరిశుభ్రమైన తాజాగా వేడిగా ఉండే పోషకవిలువలతో కూడిన ఆహార సేవన, తగినంత శారీరకవ్యాయామం చాలా ముఖ్యం. మరిగే నీటిని ఆవిరిపట్టడంకూడా మంచిదే!

**శానిటైజర్:** 200మి.లీ. నీటిలో 50గ్రా. వేపాకులు, ఒక టీస్పూను ఉప్పు వేసి వేడిచేసి మరిగే సమయంలో ఒక టీస్పూను పసుపు వేసి దించి, ఒక టీస్పూను కర్పూరం పొడి కలిపి మూత పెట్టి చల్లారిన పిదప వడగట్టి ఒక సీసాలో నిల్వ ఉంచుకుని ఆ ద్రవంతో తరచుగా చేతులను శుభ్రం చేసుకుంటుండాలి.

ఈ వైరస్‌వల్ల ఉత్పన్నమయ్యే వ్యాధిలక్షణాలు తగ్గేందుకు, వైరస్ ప్రభావం తీవ్రతరం కాకుండా ఉండేందుకు, వైరస్ సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరగకుండా ఉండేందుకు, వైరస్ త్వరగా శక్తిహీనంగా, నిర్వీర్యంగా అయ్యేందుకు, వ్యాధి నిరోధక శక్తి పెరిగేందుకు దోహదపడే చక్కటి ఆహారఔషధాలు మన దేశీయ వైద్య విధానంలో కోకొల్లలు.

వాటిలో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించుకుందాం!

నలగ్గొట్టిన లవంగాలు, వాము, కర్పూరంలను సమానంగా ఒక బట్టలో తీసుకుని, మూటలా కట్టి తరచుగా ఆ ఔషధాన్ని వాసన పీలుస్తుండాలి.

ఆవాల నూనెను వేలితో తీసుకొని రోజు ఒకసారి ముక్కు పుటాల లోపలి భాగంలో పట్టిస్తుండటంకూడా చాలా మంచిది.

ఇలాంటి ప్రక్రియల వల్ల గొంతు, ముక్కు, నోటి భాగాల్లో వైరస్‌లు వృద్ధి చెందకుండా నిర్వీర్యమయ్యేందుకు కావలసిన ప్రతికూల అంశం అక్కడ చోటు చేసుకుంటుంది.

ఒకలీటరు వేడినీటిలో 10 తులసిఆకులు, 10 మిరియాలు (నలగ్గొట్టి), 5 గ్రాముల అల్లం (నలగ్గొట్టి), 10 గ్రాముల బెల్లం పొడి, ఒక గ్రాము వంతున సొంటిపొడి, పసుపు వేసి, సన్నమంటపై గ్లాసు నీరు అంటే 250 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి దించి వడగట్టి రోజూ ఉదయం గోరువెచ్చగా ఉన్నప్పుడు త్రాగుతుంటే వ్యాధినివారణకు, నిరోధానికి ఉపయోగపడుతుంది.

రోజూ ఒకసారి 250 మి.లీ. మరిగే నీటిలో పావు టీస్పూన్ మిరియాల పొడి వేసి దించి 3-4 చిటికెల పసుపు వేసి మూతపెట్టి గోరువెచ్చగా ఉన్నప్పుడు వడగట్టి మూడు టీస్పూన్ల తేనె అరబద్ద నిమ్మరసం కలిపి సేవించాలి.


5 టీ స్పూన్ల మిరియాల పొడి, 2 1/2 టీస్పూన్ల వాము పొడి, 2 1/2 టీస్పూన్ల జీలకర్ర పొడి, ఒక టీస్పూన్ సొంటి పొడి, పావు టీస్పూన్ దాల్చిన చెక్క పొడి కలిపి ఉంచుకుని రోజు ఒకసారి ఒకలీటరు నీటిలో అర టీస్పూన్ ఈ మిశ్రిత పొడిని వేసి, అరలీటరు నీరు మిగిలేలా సన్న మంటపై మరిగించి దించి అందులో 3 లేదా 4 చిటికెల పచ్చకర్పూరం పొడిని కలిపి మూతపెట్టి చల్లార్చి వడగట్టి నిల్వ ఉంచుకుని వ్యాధిరాకుండా ఉండేందుకు రోజూ ఒకసారి 100-150మి.లీ. వరకు వాడాలి. వ్యాధి సంక్రమించినపుడు ఈద్రవాన్ని 3-4 భాగాలుచేసి రోజూ 3 లేదా 4 పూటలు సేవించాలి.

రోజూ మూడుపూటలా పూటకు ఒక లవంగం, ఒక ఏలక్కాయి, శనగబేడంత దాల్చిన చెక్కని నోట్లో వుంచుకుని నమిలి రసం మింగుతుంటే ఊపిరితిత్తుల సామర్థ్యం బాగా పెరగటంతో పాటు వ్యాధినిరోధకశక్తి శక్తిమంతంగా తయారవుతుంది.

# నాన్నా...! వేదం గురించి చెప్పవూ..?




– డా॥ కుప్పా వేంకటకృష్ణమూర్తి



**భారతదేశంలో కొన్నివేల సంవత్సరాలనుండి ఉన్న వేదాలలో, శాస్త్రాలలో ఎన్నో వైజ్ఞానికరహస్యాలు ఉన్నాయని ఈవాళ అందరూ అంగీకరించారు. ఈ రహస్యాలపైన పరిశోధనలూ సాగుతున్నాయి. ఆధునిక విజ్ఞానశాస్త్రగ్రంథాలలోకూడా అక్కడక్కడా వీటిల్ని గురించి ప్రస్తావించిన సందర్భాలూ ఉన్నాయి.**

**విద్యార్థులారా! మనవేదాలూ, శాస్త్రాలూ, కేవలం పూజలకు సంబంధించినవి అని అనుకోకండి. ప్రాచీనులకు కూడా 'విజ్ఞానం' పట్ల ఆసక్తి లేకపోలేదు. కాకపోతే 'భూగోళ' మని ఎందుకు పిలుస్తారు? (కపిత్థాకారం భూగోళమ్- వెలగపండులా భూగోళముంది). భూమి బల్లపరువుగా ఉందని ఎక్కడా చెప్పలేదు కదా! అలాగే ఎన్నో గ్రహాలనుగురించి, తిథివారనక్షత్రాల్ని గురించి, సూర్యచంద్రగ్రహణాలనుగురించి ఎప్పటి నుంచో భారతీయులు అధ్యయనం చేశారు. ఇలాగే పదార్థం- శక్తి- వీటి మధ్య సంబంధాన్ని గుర్తించే ఆలోచించారు. అణువును గురించి కూడా వ్రాసిన వివరాలు ఉన్నాయి. 'విద్యుత్తు'ను గురించి కూడా ప్రస్తావించారంటే ఆశ్చర్యంగా ఉందికదూ! అందుకే చాలా ఆసక్తికరమైన సంభాషణగా ఉన్న ఈపాఠాన్ని జాగ్రత్తగా చదవండి. ఇక్కడ తండ్రి సంప్రదాయానికీ, కొడుకు ఆధునికవిజ్ఞానానికీ ప్రతీకలు. వాళ్లసంభాషణరూపంలో పాఠం సాగుతుంది.**

**తండ్రి** – బాబూ! వేదాలను గురించి కొంచెం చెపుతాను, విను.

**కొడుకు** – వేదాలగురించి ఇప్పుడు నా కెందుకు నాన్నా? వాటి నిండా ఉండేది దేవుళ్లు, యజ్ఞాలు, యాగాలూ, ఇలాంటివే కదా!

**తండ్రి** – ఇలా కాదు బాబూ! వేదాలు అన్ని రకాల విజ్ఞానాలకూ మూలాలు.

**కొడుకు** – ఈనాటి ఆధునికవిజ్ఞానంగూడా వేదాల్లో ఉందా?

**తండ్రి** – ఎంతో ఉంది.

**కొడుకు** – ఉంటే, నే నొకటి అడుగుతా, అది మీవేదాల్లో ఉంటే చూపించు. భూమిమీద మనం ఉన్నాం గనుక, సూర్యుడు భూమిచుట్టూ తిరుగుతున్నట్లు కనిపిస్తూ ఉంటుంది. కానీ నిజానికి భూమే సూర్యుడిచుట్టూ తిరుగుతూ ఉందని 16వ శతాబ్దిలో గెలీలియో అనే శాస్త్రవేత్త నిరూపించాడు. ఈ విషయం వేదంలో ఉందా?

**తండ్రి** – *"ఆయం గౌః పృశ్నిరక్రమీ దసన న్మాతరం పునః"* అనేమంత్రం ఋగ్వేదంలో 10వ మండలంలో 189వ సూక్తంలో ఉంది. ఆంబోతుచుట్టూ- ఆవూ, ఆవు చుట్టూ – దూడ, తిరిగినట్లుగా సూర్యుడిచుట్టూ భూమి, భూమిచుట్టూ చంద్రుడూ, తిరుగుతూ ఉన్నారు – అని ఈ వేదమంత్రం చెపుతోంది.

**కొడుకు** – ఆశ్చర్యంగా ఉందే! వేదాలను ఎవరు రాశారు? ఎప్పుడు రాశారు?

**తండ్రి** – తెలుసుకోవాలనే ఉత్సాహంతో అడుగుతున్నావు కనుక వేదాల్లోని ఆధునికవిశేషాలు కొన్ని వివరిస్తాను. తెలుసుకో!

## వేదాలు - ఉపవేదాలు

**తండ్రి** – మానవజాతిచరిత్రలో అత్యంతప్రాచీనవాఙ్మయం వేదం. ఇది మానవనిర్మితం కాదు. అందుకనే దాన్ని అపౌరుషేయం అంటారు. అందువల్లనే వేదానికి

వయస్సు లేదని సనాతనభారతీయులు ప్రతిపాదించారు. ఆధునికచారిత్రకులుమాత్రం వేదాలవయస్సును నిర్ణయించటానికి అనేకప్రయత్నాలు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు కూడా! ఈనాటిఆధునికచరిత్రవేత్తల్లో ఎక్కువమందివేదాల వయస్సు సుమారుగా ఎనిమిది వేలసంవత్సరాలని అంటున్నారు. ప్రారంభకాలంలో వేదం అంతా ఒకే రాశిగా ఉండేది. సుమారు ఐదువేల సంవత్సరాల క్రిందట జీవించిన వ్యాసమహర్షి ఆ వేదరాశిని ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదాలుగా విభాగం చేశాడు.

ఈ దృష్టితో వేదాలు నాలుగు. వాటినే చతుర్వేదాలంటారు. వీటిలో ఆధ్యాత్మికతత్త్వవిషయాలు మాత్రమే కాకుండా, భౌతికవిజ్ఞానవిషయాలుగూడా ఎన్నో నిగూఢంగా నిక్షిప్తమై ఉన్నాయి. దివ్యదృష్టి గల మహర్షులు వాటిల్ని తమతపోమయదృష్టితో వెలికితీసి, మరిన్ని పరిశోధనలు చేసి, సామాన్యులకు గూడా ఆ విషయాలు అందుబాటులోకి వచ్చేందుకు వీలుగా వివిధవైజ్ఞానికశాస్త్రగ్రంథాలను రచించారు. వాటిలో ముఖ్యమైనవాటిల్ని ఆయా వేదాలకు ఉపవేదాలుగా చేర్చుకొన్నారు.

ఉదాహరణకు- ఆయుర్వేదం ఋగ్వేదానికి ఉపవేదం; ధనుర్వేదం యజుర్వేదానికి ఉపవేదం; గంధర్వవేదం సామవేదానికి ఉపవేదం; అర్థశాస్త్రం అథర్వణవేదానికి ఉపవేదం.

ఇవి గాక, గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం, నక్షత్రశాస్త్రం, వ్యవసాయశాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, కిరణశాస్త్రం, లోహశాస్త్రం, యంత్రశాస్త్రం, పశుశాస్త్రం, స్థాపత్యశాస్త్రం (లేక ఇంజనీరింగ్) వంటి అనేకవిజ్ఞానశాస్త్రశాఖలపై మనమహర్షులు గ్రంథాలు రచించారు.

**కొడుకు** - ప్రకృతిశక్తులకు భయపడి, వాటిల్ని దేవతలుగా భావించిన ఆనాటి అనాగరకమానవులు చేసిన స్తుతులే వేదసూక్తాలని కొందరు చెపుతున్నారు కదా! దానిమా టేమిటి?

**తండ్రి** - అదే నిజమైతే, ఆ స్తుతులలోకి గంభీరమైన వైజ్ఞానిక రహస్యాలు ఎలా చేరగలిగాయి? ష్రోడింగర్ లాంటి నోబుల్ బహుమతిగ్రహీతలు తమనూతనప్రతిపాదనలకు వేదాలే ప్రేరణలని ఎందుకు ప్రకటిస్తారు?

## భారతీయవిజ్ఞానంయొక్క ఆవశ్యకత

**కొడుకు** - ఇంతటి గొప్పవిషయాలు 8 వేల ఏళ్ళనాటివేదంలో ఉన్నాయంటే - ఆశ్చర్యంగా ఉందే, ఐతే, వేదా లన్నీ, అనాగరికులస్తోత్రాలనేమాట ఎవరో గిట్టనివాళ్లు చేసిన కల్పనే అయి ఉంటుంది.

**తండ్రి** - ఈ గుర్తింపు నీకే కాదు, ఆధునికమేధావులకుగూడా ఇప్పుడిప్పుడే కలుగుతూంది. అందుకే వేదాలపైనా, ఉపవేదాలపైనా, వాటికి అనుబంధంగా వచ్చిన పురాతన వైజ్ఞానికగ్రంథాలపైనా, వాళ్లదృష్టి పడుతూంది.

**కొడుకు** - వాళ్ళకు ఈ పాతచింతకాయపచ్చడితో పనేమిటి?

**తండ్రి** - ఈనాడు ఆధునికవిజ్ఞానం ఊహకు అందనంత బ్రహ్మాండంగా పెరిగిపోయినప్పటికీ, ఈ విజ్ఞాన విస్తరణవల్ల సంభవిస్తున్నకాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వంటి ఇతరవ్యతిరేకప్రభావాలు, ఈనాటి విజ్ఞాన శాస్త్రవేత్తలను ఎంతగానో ఆందోళనకు గురిచేస్తున్నాయి. వాటినివారణకోసం వాళ్లు రకరకాల అన్వేషణలు చేస్తున్నారు. అందులో భాగంగా వాళ్లదృష్టి పురాతనభారతీయవిజ్ఞానశాస్త్రగ్రంథాలమీద గూడా పడుతూంది. అందుకు ప్రధానకారణాలు- ఆనాటి భారతీయుల విజ్ఞానవికాసం మనం ఊహించినదానికన్నా అధికంగానే ఉందని గుర్తించటం, దానికి తోడు ఆ వికాసమంతా ప్రకృతిమైత్రీ సంపన్నంగా (నేచర్ ఫ్రెండ్లీగా) ఉండటం, అనేవే!

పురాతనభారతీయసాహిత్యంలో అలాంటి ప్రత్యేకవైజ్ఞానికగ్రంథాలు వేలసంఖ్యలో ఉండే వని గుర్తించటం జరిగింది. కానీ, చరిత్రలో జరిగిన అనేక విదేశీయులదాడులు మొదలగు కారణాలవల్ల ఆనాటి తాళపత్రగ్రంథాలలో అత్యధికభాగం అగ్నిపాలు కాగా, కొద్దిగ్రంథాలుమాత్రమే భారతదేశపు మూలమూలల్లో చెదురుమదురుగా దొరుకుతున్నాయి. వాటికోసం అన్వేషణకూడా ఇప్పుడు ఒకింత పెరిగింది.

# పేద పౌరాణికుడు

- శ్రీ సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
99085 54535

ఒక పేదపౌరాణికుడు పురాణం చెబుదామని భక్తితో గుడికి వచ్చాడు. పురాణం ప్రారంభించాడు. అయితే అది వినడానికి ఒక్కరూ రాలేదు. అయినా ఆ పౌరాణికుడు దేవుని పైనే భారం వేసి పురాణం చెప్పసాగాడు. ఇలా మూడు రోజులు గడిచాయి. పూజారితో పాటు ఒకరిద్దరు నూతన యాత్రికులు ఆ పురాణం వింటున్నారు.

ఆ పురాణానికి ఎవ్వరూ జనం రాకపోవడంపట్ల విమర్శలు మొదలయ్యాయి. కొందరు ఆయన చక్కగా చెప్పడం లేదని, ఈయనపురాణానికి అంతకన్నా ఎక్కువ వస్తారా! అని, ముందు ఈయన పురాణాన్ని దేవుడు, దేవుడు మెచ్చువద్దూ!" అని జనం అనడం ప్రారంభించారు. ఆ పేదపౌరాణికుడు వారి మాటలను లెక్క చేయక తనపని తాను చేసుకోసాగాడు.

ఆ తెల్లవారికూడా పౌరాణికునికి ఎవ్వరు శ్రోతలు కనబడలేదు. కానీ పూజారిమాత్రం ఆ పౌరాణికునితో "అయ్యా! ఏమి జనం. గుడి జనంతో క్రిక్కిరిసిపోయింది. ఇంత మంది వస్తారని కలలో కూడా అనుకోలేదు" అని అన్నాడు. పౌరాణికునికి ఆశ్చర్యం కలిగింది. "నాకు ఎవరూ కనిపించ లేదే" అని అన్నాడు. "ఏమిటండీ! అలా అంటారు. గుడిలో కాలు పెట్టే స్థలంకూడా లేదు. నాకుకూడా లోపలికి రావడం చాలా కష్టమైంది" అని పూజారి అన్నాడు. "మరి నా ముందు ఎవరూ కూర్చోలేదే! నాకు వారు ఎందుకు కనబడడం లేదు?" అని పౌరాణికుడు అన్నాడు. "ఏమో! మీరు ఎవరినైనా అడగండి" అంటూ అక్కడి యాత్రికుణ్ణి చూపించాడు. ఆ యాత్రికుడు "అవు నండీ! ఈరోజు చాలామంది వచ్చారు. స్త్రీలు, పురుషులు, పిల్లలు కూడా నిశ్శబ్దంగా వచ్చి మీ పురాణాన్ని కూర్చొని విన్నారు" అని అన్నాడు– ఆ యాత్రికుడు. పౌరాణికునికి చాలా ఆశ్చర్యం కలిగింది.

మరునాడు ఆ పురాణాన్ని విమర్శించిన వారుకూడా అక్కడకు వచ్చి, అతనికి ఎదురుగా కూర్చుని తన్మయత్వంతో ఆ పురాణాన్ని వినసాగారు. అప్పుడే అక్కడికి ఒక ఆవు, ఒక కోతి, ఒక కుక్క లోపలకు ప్రవేశించి కూర్చున్నాయి. ఆ తదుపరి చేతిలో లడ్డూతో ఒక బోడిగుండు బాలుడు ప్రవేశించి కూర్చు న్నాడు. ఇదంతా ఆ పౌరాణికుడు గమనిస్తున్నాడు. అవి తన్మ యత్వంతో పురాణాన్ని వింటున్నాయి. ఆ బాలుడుకూడా శ్రద్ధగా పురాణాన్ని వింటున్నాడు.

పౌరాణికుడు కళ్ల వెంబడి నీళ్లు కారుస్తూ "భగవన్ శ్రీకృష్ణా! ఓ శ్రీరామా! ఓ దత్తగురూ! ఏడుకొండలవాడా! వేంకట రమణా! ప్రభో! ఈ అవతారంలో వచ్చి నా పురాణాన్ని వింటు న్నారా! నన్ను ఉద్ధరించుటకై వచ్చారా?" అని ఉద్వేగభరితుడై నాడు. ఆ ఆవు 'అంబా' అని అంది. కోతి 'కిచ కిచ'మంది. కుక్క 'భౌ, భౌ' మని అంది. ఆ బోడిగుండు బాలుడు చిరునవ్వు నవ్వాడు. అవి వెంటనే బయటకు వెళ్లిపోయాయి. చివరగా, లడ్డూ అయిపోవడంతో ఆ బాలుడుకూడా లేచి వెళ్లిపోయాడు.

ఇక చివరిరోజు గ్రామమంతా ఆ పురాణానికి తరలి వచ్చింది. ఆ గుడి పరిసరాలు కూడా భక్తులతో నిండిపోయాయి. ఇసుక వేస్తే రాలనంత జనం. పౌరాణికుడు దేవునికి దండం పెడుతూ తన చివరిరోజు పురాణాన్ని ప్రారంభించాడు.

ఆ రోజు ఆ ఘట్టమంతా ముగిసిన తర్వాత గ్రామపెద్ద వచ్చి, అతణ్ణి ఘనంగా సన్మానించాడు. అతణ్ణి విమర్శించిన వారూ వెలలేని కానుకలు ఆ పౌరాణికునికి ఇచ్చారు. అతడు వాటిని అన్నింటిని అక్కడే పేదవారికి పంచి, తాను ఒక్కటి కూడా తీసుకోకుండా బయలుదేరాడు.

అప్పుడు అక్కడి వారు "మీరు కూడా పేదవారు గదా! కొన్నింటినైనా స్వీకరించండి" అని బ్రతిమిలాడారు. "వద్దు! నాకన్నా పేదలు మనగ్రామంలో చాలామంది ఉన్నారు. నా సంగతి ఆ దేవుడు, మీరూ చూస్తారు. ఇక ఇప్పటినుండి పది మందికి మంచిచెబుతూ నా జీవితకాలం గడిపేస్తాను. గ్రామాల్లో పురాణపఠనం చేస్తాను" అని అంటూ అక్కడి నుండి వెళ్లాడు. దీంతో అతని కీర్తి గ్రామగ్రామాన వ్యాపించి? అతణ్ణి స్వాగ తించి, ఎంతో ఉత్సాహంతో, శ్రద్ధతో పురాణానికి తగిన ఏర్పాట్లు చేయసాగారు.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-07

రచన- మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| ये | = ఎవరు (ఎవరైతే) | अन्ये | = ఇతరులు | स्वे | = తాము |
| किम् | = ఏమి? | अपि | = ను, యును, కూడ | अनेकत्र | = చాలా చోట్ల |
| स्यात् | = ఉండును, వలెను, చాలును. | स्याः | = ఉందువు, వలెను, చాలుదువు. | स्याम् | = ఉందును, వలెను, చాలుదును. |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) अन्ये अपि तत्र न सन्ति।
02) ते तत्रासन् वा?
03) किं वा?
04) अद्य एकः अपि तत्र नास्ति।
05) अहम् अपि तत्र स्याम्।
06) त्वं श्वः अनेकत्र स्याः।
07) यूयं तत्र न आस्त किं वा?
08) ह्यः अत्र त्वम् अपि नासीः।
09) श्वः प्रभृति अहमपि तत्र स्याम्।
10) ते स्वे तत्र तदा आसन्, इदानीं न सन्ति।

### అ) జవాబులు

01) ఇతరులును అక్కడ లేరు.
02) వారు అక్కడనుండిరా?
03) ఏమైనా?
04) ఈనాడు ఒక్కడు కూడా అక్కడ లేడు.
05) నేను కూడా అక్కడ ఉందును.
06) నీవు రేపు చాలాచోట్ల ఉందువు.
07) మీరు అక్కడ లేకుంటిరా ఏమి?
08) నిన్న ఇక్కడ నీవును లేకుంటివి.
09) రేపటినుండి నేనును అక్కడనుందును.
10) వారు తాము అప్పుడు అక్కడ ఉండిరి, ఇప్పుడు లేరు.


### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) తామును అక్కడ లేరు.
02) నిన్న అక్కడ నెవరున్నారో వారిప్పుడు లేరు.
03) ఇవ్వేళ వాడక్కడ లేడేమో?
04) ప్రొద్దున మొదలుకొని నీ వక్కడ నుండవలెను.
05) మే మివ్వేళ నెక్కడ నుండలేదు.
06) మీరివ్వేళ నిక్కడ నున్నారు కారు.
07) వారు ఎవరో!
08) అక్కడ నితరులును చాలమంది యుండిరి.
09) ఏమో నే నెక్కడ నుండవలెనో?
10) వారందఱు నేడిక్కడ లేరు.

### ఆ) జవాబులు

01) ते स्वे अपि तत्र नासन्।
02) ह्यः तत्र ये आसन्, ते इदानीं न सन्ति।
03) अद्य सः तत्र नास्ति किम्?
04) प्रातः प्रभृति त्वं तत्र स्याः।
05) वयम् अद्य कुत्रापि न आस्म।
06) यूयम् अद्य अत्र न स्थ।
07) ते के!
08) तत्र अन्ये अपि बहवः आसन्।
09) किं वा अहं कुत्र स्याम्?
10) ते सर्वे अत्र अद्य न सन्ति।

విశ్వదాభిరామం — వేమన పద్యసూక్తి



## మంది - మంచి

పంది పిల్ల లీను పదియు నైదింటిని;
కుంజరంబు లీను కొదమ నొకటి;
ఉత్తమపురుషుండు ఒక్కడు చాలడా?
విశ్వదాభిరామ! వినుర వేమ!


**అర్థాలు:** ఈను = ప్రసవించు; కుంజరంబు = ఏనుగు; కొదమ = (జంతువుల) పిల్ల.

**భావం:** పంది ఒక్కయీతలో పదిహేను పిల్లల్నికంటుంది. ఏనుగైతే ఒక్కపిల్లనే కంటుంది. నీచులు చాల మందికంటె ఉత్తముడు మేలు.

**వివరణ:** కొందరు సమాజంచేత 'ఛీ! ఛీ!!' అనిపించు కొంటారు. అలాంటి వాళ్లు భూమికి భారమే అవుతారు. దజన్లకొద్దీ బిడ్డల్ని కనేకంటే జనం మెచ్చేవాడూ, జనానికి పనికివచ్చేవాడూ ఒక్కణ్ణి కంటే చాలు. పిల్లల్ని కనడం అనేది మనఇష్ట ప్రకారం జరిగేది కాదు. మానవుడు పదిమంది చేత మంచి అనిపించుకునేపని ఒక్కటి చేసినా చాలు. దానివల్ల సమాజానికి ప్రయోజనమూ, తనకు మంచిపేరూ రెండూ వస్తాయి. అలా కాకుండా, పనికిమాలినపనులు ఎన్ని చేసినా, వానివల్ల ఎవరికీ ఉపయోగం ఉండదు. పైగా జనం తిట్టుకుంటారుకూడా! ఎన్నాళ్లు బ్రది కాము అనేదానికంటె ఎలా గౌరవంగా జీవించా మనేది ప్రధానం.

- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## 64 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

1)దశరథుని కుమారుడు(4); 3)సీతాదేవి కుమారులు(4); 7)ఆభరణం(2); 8)క్రూరమృగాలున్న ప్రదేశం(3); 9)వర్షా కాలంలో కురుస్తుంది(2); 12)యంత్రం(2); 13)మారుతి ఆయుధం(2); 17)సంతోషం(2); 18)జనకుని రాజధాని(3); 19)అడవి(2); 22)రాక్షసులు(2); 23)ఆకాశమార్గంలో వెళ్లు తున్న హనుమకు ఆతిథ్యం ఇచ్చినది(4)

### నిలువు

1)అడవిని దహించే అగ్ని(2); 2)యుద్ధము(2); 4)చంపుట(2); 5)పడుకునే ప్రక్క(4); 6)భరతుని భార్య(3); 10)దాశరథిలో దాగిన సముద్రం(3); 11)వాలికుమారుడు(3); 14)విష్ణువు(4); 15)జనకుని కుమార్తె(3); 16)జానకి తండ్రి(4); 20)11 అణాల ఎత్తుగల(2); 21)పూర్వంలో వాడిన పల్లకి(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



# బాలనీతి

# ఈ నిజం తెలుసుకో! తెలివిగా మసలుకో!

– ఆచార్య పి.ఎల్. శ్రీనివాస రెడ్డి

కం. తగునిది తగదని యెదలో
వగవక సాధులకు, పేద వారల కెగ్గల్
మొగిజేయు దుర్వినీతుల
కగు ననిమిత్తాగమంబులయిన భయంబుల్

ఇది తగింది, ఇది తగంది అని మనసులో ఏమాత్రం ఆలోచించకుండా మంచివాళ్లకు, పేదవాళ్లకు పనిగట్టుకొని కీడులు కలిగించే నీతి, నియమం లేని దుర్మార్గులకు నిష్కారణ మైన భయాందోళనలు కలుగుతాయంటాడు ఆదికవి నన్నయ.

ధనం, వంశం, బంధుబలగం, చదువు, పదవి ఇలాంటివాటివల్ల కలిగే మదంతో కొంతమంది చెడ్డవాళ్లు మంచివాళ్లకు, బీదవాళ్లకు అదే పనిగా హాని తలపెడతారు. అలాంటప్పుడు సాధువర్తనులైనవాళ్లూ, పేదతనం కారణంగా శక్తిలేనివాళ్లూ ఎదురుదెబ్బ తీయలేకపోవచ్చు, కనీసం ఎదిరించలేకనూపోవచ్చు, అంతమాత్రంచేత చెడుచేసినవాళ్లకు ఏమీ కాదనుకోవడం పొరపాటు. ఏ కారణం లేకుండానే వచ్చే ఆపదలు తద్వారా వచ్చే అనేకవిధాలభయాలూ వీళ్లకు సంభవిస్తాయి. ఇంకో విధంగా చెబితే ప్రకృతి తనధర్మాన్ని తాను నిర్వర్తిస్తుందని అర్థం.

'బలవంతులు దుర్బలజాతిని బానిసలను కావించడం' అనాదిగా జరుగుతున్న నిరంతరమైన అన్యాయం. ఈ ఘోరానికి ఎక్కడో ఒక చోట అంతం ఉండాలి. ఏ కొందరో సుఖపడితే చాలదు. సమాజంలో వున్న అందరూ సుఖపడాలి. తమకున్న బలంతో దుష్టులు బలహీనుల్ని హింసించరాదని హెచ్చరించడం ఉందిక్కడ.

హింసకు గురి అయినవాళ్లంతా ఎప్పుడూ అలాగే పడివుండరు. ఆక్రందిస్తారు, ఆలోచిస్తారు, సంఘటితమౌతారు, ప్రతిఘటిస్తారు; వ్యవస్థను బద్దలు కొడతారు. ఆవిధంగా హింసించినవాళ్లలో భయాలను కలిగిస్తారు.

దాన్నే వేరే విధంగా చెప్పాడు– కవి. హింసించినవాళ్లకే అనూహ్యమైన దడ పుడుతుంది. ఎందుకంటే మనసు చాలా సున్నితమైంది. దానికి తెలుసు ఎక్కడ ఏ తప్పు చేస్తున్నామన్నది. తప్పుల బరువెక్కువైనకొద్దీ మనసుపడవ మునిగిపోయే ప్రమాదం ఉంది. అలా భయాలకు లోను కాకుండా ఉండా లంటే సాధులకు, పేదవారికి కీడుతలపెట్టకుండా ఉండాలి.

ధనమున్నవాడు ధనహీనుణ్ణీ, బలమున్నవాడు బలహీనుణ్ణీ, విద్య ఉన్నవాడు విద్యాహీనుణ్ణీ కించపరచకూడదు, పైపెచ్చు గౌరవించాలి. లేనివాడికి ఉన్నవాడు స్నేహహస్తాన్ని హార్దికంగా అందించడం బాధ్యత అని సారాంశం.


శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం వారు టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయడం జరిగింది.


యాత్రికులు, భక్తులు దేవస్థానానికి సంబంధించిన సూచనలు / ఫిర్యాదులకు మరి ఏ ఇతర సమాచారం కోసమైనా ఈ నంబరును సంప్రదించండి.


తిరుమల తిరుపతి దేవస్థానం
టోల్ ఫ్రీ నెంబరు
18004254141


ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోండి! తిరుమల తిరుపతి దేవస్థానం యాత్రికులకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు మీ సూచనలివ్వండి.

# చిత్ర కథ జీవితం సార్థకం కావాలంటే..!


కథ & బొమ్మలు- శ్రీ తుంబలి శివాజీ





వైష్ణవస్వామి పూసగుచ్చినట్టు చెప్పిన భాగవతకథలు సిద్ధప్పను మరో ప్రపంచంలోకి తీసుకెళ్ళాయి. కనులు మూసినా తెరచినా, ఏవేళలోనూ అవే తలపులకు వస్తున్నాయి.
శ్రీకృష్ణలీలలు అనుక్షణం జ్ఞాపకమవుతున్నాయి. నిద్దురలేచిందే మొదలు తన రోజువారి పనులన్నిటా భగవానుని ఆలోచనలతోనే సాగుతోంది దినచర్య.
భగవాన్! ఏమిటీమాయ..
పరమాత్మా! అల్పుడనైన నేను నీ లీలలను ఏమని పొగడగలను..
ఆ సాములోరు చెప్పినట్టు... ప్రతిరోజూ ప్రతి ఘడియ ఆ దేవుడ్ని గుర్తు చేసుకుంటున్నాను..సరే.. కానీ రాత్రనక పగలనక ఆ దేవుడే పదేపదే కనిపించి నా పనులకు అడ్డుపడుతున్నాడేంటి? ఎందుకిలా జరుగుతోంది. నేనమన్నా తప్పు చేసానా.. తెలిసో తెలియకో ఏదన్నా చేసుంటే, ఆ దేవుడికి కోపమొస్తే తరువాత నా పరిస్థితి ఏంటి...? ఈ రోజు ఎలాగైనా ఎట్టయినా సాములోరిని పట్టుకుని అడగాలి...
3



దండాలు సాములూ! నన్ను మీరే కాపాడాలి.
ఏం జరిగింది నాయనా! ఎందుకంత ఆందోళనగా కన్పడుతున్నావు. అసలు విషయమేంటో చెప్పు..
నాకు ముప్పొద్దులా ఆ దేవుడే కనబడుతున్నాడు. ముప్పేదో ఉన్నట్టు నా మనసుకి అనిపిస్తోంది. నేనేతప్పు చేశానో మరి పదేపదే కనబడుతూ నా పనులకు అడ్డుపడుతున్నాడేమో అనిపిస్తోంది. మీరు సెలవిచ్చినట్టే నా పనులన్ని నేను చేస్తున్నట్టుగాక ఆ దేవుడే చేస్తున్నట్టు భ్రమ కలుగుతోంది.. అది తప్పో ఒప్పో తెలవకుంది.
నువ్వు చాలా అదృష్టవంతుడివి నాయనా! నీపేరు సార్థకమయ్యేలా నువ్వు భగవత్‌సిద్ధి పొందావు.
సామీ! నాకేమీ పాలు పోవట్లేదు. నాకంత అదృష్టమా?
అవున్నాయనా! అదృష్టం నీదే... ప్రతి మనిషీ తన పనులను తాను చేసు కుంటూ ప్రతి పనినీ భగవదర్పణ బుద్ధితో సాగించాలి. అప్పుడే ఆ జీవితం సార్థకమవుతుంది. నిరంతరం భగవన్నామ స్మరణతో సాగాలి. ఎవరికీ హాని తలపెట్టక తోటివారికి సాయపడుతూ జీవనం సాగించిననాడు అదే మాధవ సేవ...
వైష్ణవస్వామి చేసిన జ్ఞానబోధతో సిద్ధప్ప తన జీవితాన్ని పరోపకార బుద్ధితో సాగించాడు.
సమాప్తం
4

# కదంబం

## సప్తచిరంజీవులు

1) అశ్వత్థామ
2) బలిచక్రవర్తి
3) వ్యాసమహర్షి
4) హనుమంతుడు
5) విభీషణుడు
6) కృపాచార్యుడు
7) పరశురాముడు

## పిల్లలూ.. జతచేయండి!!

| | |
|---|---|
| 1) బలరాముడు | అ) కుంతీదేవిపుత్రుడు |
| 2) అర్జునుడు | ఆ) గాంధారిపుత్రుడు |
| 3) దుర్యోధనుడు | ఇ) రోహిణీదేవిపుత్రుడు |
| 4) రావణుడు | ఈ) దేవకిపుత్రుడు |
| 5) కృష్ణుడు | ఉ) కైకసిపుత్రుడు |

**జవాబులు:**
1-(ఇ); 2-(అ); 3-(ఆ); 4-(ఉ); 5-(ఈ)

## మీకు తెలుసా?

1) శ్రీవారికి లాలిపాటను రాసినవారెవరు?
2) శ్రీవేంకటేశ్వరస్వామికి ముత్యాలహారతిని ప్రవేశపెట్టిన వారెవరు?
3) తిరుమల బ్రహ్మోత్సవాల్లో అవభృథస్నానాన్ని ఏ నక్షత్రం రోజు నిర్వహిస్తారు?
4) ఆదికావ్యమని ఏ గ్రంథానికి పేరు?
5) భారతాన్ని ఇలాకూడా అంటారు?

**జవాబులు:**
1) తాళ్లపాక అన్నమాచార్యులు
2) తరిగొండ వెంగమాంబ
3) శ్రవణానక్షత్రం
4) రామాయణం
5) పంచమవేదం, 'జయం'

## కనుక్కోండి

ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

శాం దు సౌ క లే ము ఖ్య ము లే త

**జవాబు:**
శాంతము లేక
సౌఖ్యము లేదు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...



Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.



21-04-2021న హనుమంతుడి జన్మస్థలం తిరుమల అని
తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించిన సందర్భంలోనిది



13-04-2021న మహతి కళాక్షేత్రం(తిరుపతి)లో
తి.తి.దే. నిర్వహించిన ప్లవనామసంవత్సర ఉగాది వేడుకల దృశ్యం



18-04-2021న శ్రీరామానుజాచార్యుల 1005వ అవతారమహోత్సవాన్ని
పురస్కరించుకొని తిరుమల శ్రీపెద్దజీయర్ మఠంలో జరిగిన
శ్రీరామానుజ నూత్రందాది దివ్యప్రబంధపారాయణ మహోత్సవ దృశ్యం



13-04-2021న తిరుమల శ్రీవారి ఆలయంలో
ఉగాది ఆస్థానం అనంతరం శ్రీవైఖానసఆగమశాస్త్ర గ్రంథాల ఆవిష్కరణ దృశ్యం



01-05-2021న తిరుమలలో విధులు నిర్వహించే పారిశుద్ధ్యకార్మికులకు
హెల్త్‌కిట్లు అందించిన తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు


వినరో భాగ్యము విష్ణుకథ..!!